ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ


epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

22-5-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 111 పేజీలు: 10+4 వెల: 6.50




2

**కరీంనగర్‌లో కొర్రమీను అక్వా క్లస్టర్**

ఒకేచోట సాంకేతికత, మార్కెటింగ్

విదేశాలకు ఎగుమతి చేసేలా ప్రణాళిక

## మెగా రైల్వేస్టేషన్



**38 నెలల్లోనే రోబోలతో నిర్మాణం**

**ప్రపంచంలో అతిపెద్ద స్టేషన్ ఇదే**

చైనాలోని చాంగ్‌కింగ్ ఈస్ట్ రైల్వేస్టేషన్

15 ప్లాట్ ఫామ్‌లు



**బీజింగ్, మే 21:** ప్రపంచంలోనే అతిపెద్దదైన చైనాలోని చాంగ్‌కింగ్ ఈస్ట్ రైల్వే స్టేషన్ నిర్మాణ దృశ్యాలు టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్‌ను సైతం ఆశ్చర్యపరిచాయి. గతంలో ప్రజా రవాణాపై పెదవి విరిచిన మస్క్ ఈ స్టేషన్ నిర్మాణానికి సంబంధించిన వీడియోను ఎక్స్‌లో షేర్ చేయడంతో ఇపుడుప్రపంచాన్ని ఆకర్షిస్తోంది. 40 డిగ్రీల ఎండ, కొండ ప్రాంతంలో కేవలం 38 నెలల రికార్డు కాలంలోనే చైనా ఈ అద్భుతాన్ని నిర్మించడం వెనుక ఒక పెద్ద రోబో విప్లవం ఉందని అన్నారు. చైనాకు చెందిన ప్రభుత్వ మీడియా >>2

# కార్మికులకు తీపికబురు

**కనీస వేతనాలు భారీగా పెంపు**

**జూన్ 1 నుంచి అమల్లోకి**

**4 కేటగిరీలుగా కార్మికుల విభజన**

**వేతనాల లెక్కింపు కోసం 3 జోన్లు**

**బిఆర్ఎస్ కార్మికులను మోసం చేసింది**

**మీడియాతో సిఎం రేవంత్‌రెడ్డి**



గురువారం మీడియాతో సిఎం రేవంత్‌రెడ్డి

**కేటగిరీల వారీగా కొత్త జీతాలు**

అన్‌స్కిల్డ్ (నైపుణ్యం లేనివారు): రూ.12,750 నుంచి రూ.16,000కు పెంపు

సెమీ స్కిల్డ్ (పాక్షిక నైపుణ్యం): రూ.13,592 నుంచి రూ.17,000కు పెంపు

స్కిల్డ్ (నైపుణ్యం ఉన్నవారు): రూ.13,772 నుంచి రూ.18,500కు పెంపు

హైస్కిల్డ్ (అధిక నైపుణ్యం): రూ.14,607 నుంచి రూ.20,000కు పెంపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే21:** తెలంగాణ లోని కార్మికులకు సిఎం రేవంత్ రెడ్డి తీపికబురు చెప్పారు. కార్మికుల కనీస వేతనాల పెంపుపై కేబినెట్ సబ్ కమిటీ నివేదిక మేరకు తీసుకున్న నిర్ణయాలను ఆయన మీడియాకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల 1.11 కోట్ల మంది కార్మికులకు మేలు జరుగుతుందన్నారు. బిఆర్ఎస్ హయాంలో కార్మికులకు కనీస వేతనాలు నిర్ణయించక పోవడం వల్ల 1.11 కోట్ల మంది నష్టపోయారని సిఎం తెలిపారు. కనీస వేతన పెంపుపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ అన్ని వర్గాలతో సంప్రపులు జరిపి.. కీలక సిఫార్సులు చేసినట్లు పేర్కొన్నారు. గురువారం సచివాలయంలో మంత్రి వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్‌రెడ్డి, ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, అనిల్ యాదవ్, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 'కార్మికులను అన్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హై స్కిల్డ్‌గా కేటగిరీలుగా కేబినెట్ సబ్ కమిటీ విభజించింది. కార్మికులవేతనాలు నిర్ణయించేందుకు జోన్లను మూడుగా విభజించాం. జోన్1 మున్సిపల్ కార్పొరేషన్లు, జోన్2 మున్సిపాల్టీలు, జోన్3 గ్రామీణ ప్రాంతాలు ఉంటాయి. జోన్1లో అన్‌స్కిల్డ్ కార్మికుల వేతనాన్ని రూ. 12,750 నుంచి 16 వేలకు, సెమీ స్కిల్డ్ కార్మికుల వేతనం రూ.13,592 నుంచి రూ.17 వేలకు, స్కిల్డ్ కార్మికుల వేతనం రూ.13,772 నుంచి 18,500లకు, హై స్కిల్డ్ కార్మికులకు రూ,14,607 నుంచి రూ.20 వేలకు పెంచాం' అని వివరించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం జూన్ ఒకటో తేదీ నుంచి అమలులోకి >>2

**మహిళా రిజర్వేషన్ల కోసం ప్రత్యేక పార్లమెంట్ పెట్టండి** 2

**బండి భగీరథ్‌పై కెసిఆర్ మౌనమేల?: ముఖ్యమంత్రి** 3



గురువారం హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌తో భేటీ అయిన మంత్రి తుమ్మల

## జొన్న, మొక్కజొన్నకు మద్దతివ్వండి

పంటల మద్దతు ధరల స్కీంలో చేర్చండి

పొద్దుతిరుగుడు కొనుగోలు పరిమితిని పెంచండి

**కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు మంత్రి తుమ్మల వినతి**

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:** మొక్కజొన్న, జొన్న పంటలను పిఎస్ఎస్ స్కీం (పంటల మద్దతు ధర)లో చేర్చాలని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహన్‌ను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. అనుకూల వాతావరణ పరిస్థితులు, అధిక దిగుబడుల కారణంగా >>2



న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ అయిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

## ఎంఎంటిఎస్ విస్తరణకు గ్రీన్‌సిగ్నల్

**తెలంగాణలో రైల్వేనెట్‌వర్క్ పెంపు, అభివృద్ధికి సహకారం**

**భాగ్యనగరంలో ప్రజారవాణా మెరుగుదలకు చర్యలు**

**కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కిషన్‌రెడ్డి భేటీ, ప్రాజెక్టులపై చర్చలు**

**హైదరాబాద్,మే 21,ప్రభాతవార్త:** తెలంగాణలో 42 ప్రధాన రైల్వేస్టేషన్లను ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా ఆధునిక అవసరాలకు అనుగుణంగా వేగంగా అభివృద్ధి పరిచేందుకు కార్యాచరణ >>2





గురువారం కాళేశ్వరం పవిత్ర సంగమంలో సరస్వతి అంత్యపుష్కరాలను ప్రారంభిస్తున్న శంకర విజయేంద్ర సరస్వతి, గవర్నర్ శుక్లా, మంత్రులు

## సరస్వతి అంత్యపుష్కరాలు సంరంభం

పవిత్ర సంగమంలో తొలి స్నానం ఆచరించిన శంకర విజయేంద్ర సరస్వతి, గవర్నర్ శుక్లా, మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ

భక్తులతో కిక్కిరిసిన ఘాట్లు

**కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన యంత్రాంగం**

**మహాదేవపూర్, మే 21, ప్రభాతవార్త:** సరస్వతి అంత్య పుష్కరాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. పుష్కరాల తొలి రోజు ఉదయం 5:43 గంటలకు పవిత్ర త్రివేణి సంగమ క్షేత్రంలో అత్యంత భక్తిశ్రద్ధల మధ్య తొలి పుష్కర స్నాన ఘట్టం నిర్వహించబడింది. వేదమంత్రాల మధ్య ప్రముఖుల పుణ్య స్నానాలు మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి >>2



2

## ఇంధన కొరత లేకుండా తగు చర్యలు

**నాలుగున్నర గంటలకుపైగా సాగిన అత్యవసర కేబినెట్ సమావేశం**



## ఎబోలా డేంజర్ బెల్స్

2

**భారత్‌లో అప్రమత్తత**

**విమానాశ్రయాల్లో ప్రయాణికుల స్క్రీనింగ్**

**ఆఫ్రికా ఫోరమ్ సదస్సు వాయిదా**

## ఎన్నాళ్లీ మొద్దు నిద్ర

**రాష్ట్రంలో పంట కొనుగోళ్ల సంక్షోభం**

**కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు**

**10 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారు**

రైతు ద్రోహిగా రేవంత్ మిగిలి పోతారంటూ కెటిఆర్ బహిరంగ లేఖ



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే21:** తెలంగాణలో ప్రస్తుతం పంట కొనుగోళ్ల సంక్షోభం నెలకొందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న కష్టాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంకా ఎంతకాలం మొద్దునిద్ర పోతారని ప్రశ్నిస్తూ ఆయనకు గురువారం ఒక బహిరంగ లేఖ రాశారు. ఈనెల23న జరగబోయే రాష్ట్ర కేబినెట్ సమావేశంలోనైనా ప్రభుత్వం కళ్లు తెరిచి, అన్నదాతల సమ స్యలపై దిద్దుబాటు చర్యలు చేపట్టాలని >>2


వైద్య సేవలు ప్రారంభం

Sindhu HOSPITALS
హైటెక్ సిటీ, హైదరాబాద్
+91 40 4545 4545

**ఆరోగ్యవంతమైన సమాజం దిశగా మా ముందడుగు!**

క్యాన్సర్‌కు ప్రత్యేక వైద్య సేవలతో పాటు, అత్యాధునిక మల్టీ సూపర్ స్పెషాలిటీ సేవలను లాభాపేక్షలేని దృక్పథంతో అందించడమే సింధు హాస్పిటల్స్ ప్రధాన లక్ష్యం.

**నాణ్యమైన వైద్యం ... ఆరోగ్య భద్రత ... అందరికీ అందుబాటులో ... సమాజ శ్రేయస్సు కొరకై పూర్తి స్థాయిలో అందించగలిగిన వైద్య సదుపాయాలు**

1500+ పడకల సామర్థ్యం | 700+ నిపుణులైన వైద్యులు | 2700+ నిబద్ధత గల నర్సింగ్ సిబ్బంది | 4800+ పారామెడికల్ మరియు సహాయక సిబ్బంది

30+ ప్రత్యేక సూపర్ స్పెషాలిటీ విభాగాలు | 200+ ఓపీ కన్సల్టేషన్ గదులు | 15 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక క్యాంపస్

**క్యాన్సర్ స్పెషాలిటీలు**

సర్జికల్ ఆంకాలజీ | మెడికల్ ఆంకాలజీ | రేడియేషన్ ఆంకాలజీ
హీమాటో ఆంకాలజీ | బోన్ మారో ట్రాన్స్‌ప్లాంటేషన్ | న్యూక్లియర్ మెడిసిన్

**మల్టీ సూపర్ స్పెషాలిటీలు**

అనస్థీషియాలజీ | బ్లడ్ సెంటర్ | కార్డియాలజీ | కార్డియో-థొరాసిక్ & వాస్కులర్ సర్జరీ | కార్డియాక్ & న్యూరో ఎలక్ట్రోఫిజియాలజీ
క్లినికల్ సైకాలజీ | క్రిటికల్ కేర్ మెడిసిన్ | డెంటల్ & మాక్సిల్లోఫ్యాష సర్జరీ | ఎమర్జెన్సీ మెడిసిన్ | ఈఎన్‌టి | హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్
ఇంటర్నల్ మెడిసిన్ | ఇంటర్వెన్షనల్ రేడియాలజీ | కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ | మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ | మెడికల్ ఇమేజింగ్
మెడికల్ లేబొరేటరీ | నెఫ్రాలజీ | న్యూరాలజీ | న్యూరోసర్జరీ | న్యూట్రిషన్ & డైటెటిక్స్ | ఆప్తాల్మాలజీ
ఆర్థోపెడిక్స్ & జాయింట్ రీప్లేస్‌మెంట్ | పీడియాట్రిక్స్ | ఫిజియోథెరపీ | ప్లాస్టిక్ & రికన్‌స్ట్రక్టివ్ సర్జరీ | పల్మనాలజీ | రోబోటిక్ సర్జరీ
సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ | ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ | యూరాలజీ

**ఇతర ఆరోగ్య సేవా కార్యక్రమాలు**

క్యాన్సర్ అవగాహన మరియు నివారణ కార్యక్రమాలు | గ్రామాలకు సంచార ఆరోగ్య పరీక్షలు
ధర్మశాల - రోగులు మరియు కుటుంబ సభ్యుల కోసం వసతి సౌకర్యం

HOSPITAL BLOOD BANK



సింధు హాస్పిటల్స్, సింధు హెల్త్ క్యాంపస్, హైటెక్ సిటీ, హైదరాబాద్ - 500084, తెలంగాణ
info@sindhuhospitals.com | sindhuhospitals.com



గురువారం కాళేశ్వరంలో ప్రత్యేక పూజలు చేసిన గవర్నర్ శుక్లా దంపతులు

## సరస్వతి అంత్యపుష్కరాలు
# సంరంభం

>> స్వాములు పవిత్ర నదిలో తొలి పుష్కర స్నానం ఆచరించి, నదీ మాతకు ప్రత్యేక పూజలు సమర్పించారు. ఈ పుణ్యస్నాన మహోత్సవంలో ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శైలజా రామయ్యర్ దంపతులు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ధార్మిక సలహాదారు గోవింద హరి తదితరులు పాల్గొని పవిత్ర స్నానాలు ఆచరించారు. వీరితో పాటు భూపాలపల్లి, రంగారెడ్డి నియోజకవర్గాల శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, మల్ రెడ్డి రంగారెడ్డి కూడా పుష్కర స్నానాలు చేసి నదికి హారతి ఇచ్చారు.
పుష్కరాల ప్రారంభ దినం కావడంతో తెల్లవారుజాము నుంచే భారీ సంఖ్యలో భక్తులు పవిత్ర క్షేత్రానికి తరలివచ్చారు. నమస్తే శారదే దేవి అంటూ భక్తులు చేసిన స్మరణలతో ఘాట్లన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం అన్ని రకాల కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టింది. సమన్వయంతో యంత్రాంగం పనులు భక్తుల రద్దీని తట్టుకునేలా భారీ భద్రత, నిరంతర పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా, అత్యవసర వైద్య సేవలు మరియు ప్రత్యేక రవాణా సదుపాయాలను సిద్ధం చేశారు. ఈ పుణ్యకాలంలో భక్తులు అత్యంత సౌకర్యవంతంగా, సురక్షితంగా పుష్కర స్నానాలు నిర్వహించుకునేలా అన్ని ప్రభుత్వ శాఖలు పూర్తి సమన్వయంతో పనిచేస్తున్నాయని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఈ సందర్భంగా తెలిపారు.

## ఎంఎంటిఎస్ విస్తరణకు గ్రీన్‌సిగ్నల్

>> రూపొందించి అమలు చేస్తున్నామని కేంద్ర రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. కేంద్ర రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌ను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గురువారం ఢిల్లీలో సమావేశమైనారు. ఈ సందర్భంగా తెలంగాణలోని అనేక లెవల్ క్రాసింగ్‌లపై నిర్మాణం చేయబోతున్న రైల్వే ఓవర్‌బ్రిడ్జిలు అండర్‌పాస్‌లు ఇతర మౌళిక వసతుల కల్పన వంటి పలు కీలక అంశాలపై ఇరువురు చర్చించారు. తెలంగాణలో రైల్వేప్రాజెక్టుల పురోగతి, కొత్త ప్రాజెక్టులు, ఎలక్ట్రిఫికేషన్ ప్రాజెక్టు నిర్ణీత కాలంలో చేసేందుకు లక్ష్యం పెట్టుకొని నిరంతరం సమీక్షలు చేస్తున్నామని కిషన్‌రెడ్డికి వివరించారు. హైదరాబాద్ నగరంతో పాటుగా, చుట్టుపక్కల ప్రాంతాల ప్రయాణికులకు కీలకమైన రవాణా సౌకర్యంగా ఉన్న ఎంఎంటిఎస్ విస్తరణ అభివృద్ధి పై కూడా కిషన్‌రెడ్డి వివరించారు. టైమింగ్స్ రెగ్యులరైజేషన్, సౌకర్యాలను మరింత మెరుగుపరిచేలా చొరవ తీసుకోవాలని కిషన్ కోరారు. కేంద్ర రైల్వేమంత్రి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి తదనుగుణంగా ఎంఎంటిఎస్ మెరుగుపరచడం కోసం చర్యలు తీసుకుంటాననీ కిషన్ రెడ్డికి ఈ సందర్భంగా హామి ఇచ్చారు. రాష్ట్రంలో కొత్త రైల్వేలైన్లు, హైస్పీడ్ రైల్ కారిడార్ పనులు వేగంగా చేపడుతున్నామని భూసేకరణ విషయంలో రాష్ట్రంలో ఇబ్బందులు ఉన్నాయనీ వాటిని పరిష్కరిస్తే మరింత వేగంగా రైల్వే విస్తరణ పనులు జరుగుతాయని అశ్విన్‌వైష్ణవ్ అన్నారు. రానున్న రోజుల్లోనూ రైల్వేనెట్‌వర్క్ పెంచడం, ప్రజలకు సౌకర్యాల అభివృద్ధిలో పూర్తి సహకారం ఉంటుందని రైల్వేమంత్రి స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో తెలంగాణలో రైల్వేల అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తి అంకితభావంతో పనిచేస్తోందని కిషన్‌రెడ్డి సంతృప్తితో వెల్లడించారు.

## మొక్కజొన్నకు మద్దతివ్వండి

>> రాష్ట్రంలోని మార్కెట్ యార్డులకు భారీగా దిగుబడులు వస్తుండటంతో ధరలు అమాంతం పడిపోయాయని వివరించారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాల్ మొక్కజొన్న ధర సుమారు రూ.1,800 వరకే ఉండగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ. 2,400గా ఉందని తెలిపారు. దీనివల్ల రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు రాజేంద్రనగర్‌లోని ఐసిఏఆర్ ఐఐఎంఆర్‌లో కేంద్ర మంత్రిని గురువారం మంత్రి తుమ్మల మర్యాదపూర్వకంగా కలిశారు. అదేవిధంగా.. పొద్దుతిరుగుడు పంట కొనుగోలు పరిమితిని వెంటనే పెంచాలని, లేనిపక్షంలో చిన్న, సన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. ప్రస్తుతం ఉన్న 3,690 మెట్రిక్ టన్నుల కొనుగోలు పరిమితిని 15,262 మెట్రిక్ టన్నులకు పెంచాలని కేంద్ర మంత్రిని కోరారు. ఈ ఏడాది 2026-27 ఆర్థిక సంవత్సరానికి పిఎంఆర్‌కెవిబై-పిడిఎంసి, ఎంఐడిహెచ్ పథకాల కింద ఉద్యానశాఖకు నిధుల కేటాయింపులు పెంచాలని కోరారు. ఈ పథకాల కింద ప్రస్తుతం తెలంగాణకు కేటాయించిన నిధులు సరిపోవడం లేదని తెలిపారు. ఈ రబీ సీజన్‌కు సంబంధించిన పొద్దుతిరుగుడు కొనుగోలు పరిమితిని 3,690 మెట్రిక్ టన్నుల నుండి 15,262 మెట్రిక్ టన్నులకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. పామాయిల్ పై ఉన్న దిగుమతి సుంకాన్ని పెంచేలా సంబంధిత మంత్రిత్వశాఖతో మాట్లాడాలని కోరారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు తీసుకుంటున్నామని, అయితే కొన్ని అంశాల్లో కేంద్ర ప్రభుత్వ మద్దతు అవసరమని వివరించారు. దేశవ్యాప్తంగా హెర్బిసైడ్ టోలరెంట్ (హెచ్‌టి) కాటన్ విత్తనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన జాతీయ విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. బిటి కాటన్‌పై దేశవ్యాప్తంగా సమగ్ర శాస్త్రీయ అధ్యయనం నిర్వహించి, రైతుల ప్రయోజనాలు, పర్యావరణ భద్రత, శాస్త్రీయ ప్రమాణాలు, బయోసేఫ్టీ అంశాలను పరిగణనలోకి తీసుకుని పారదర్శకమైన విధాన నిర్ణయం తీసుకోవాలని కేంద్ర మంత్రిని కోరారు. కాగా.. మంత్రి తుమ్మల ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి చౌహాన్ త్వరలోనే సమగ్ర సమీక్ష నిర్వహించి అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## కార్మికులకు తీపికబురు

>> వస్తుందని సిఎం స్పష్టం చేశారు. స్కిల్స్ పెంచుకునేందుకు అవసరమైన ప్రోత్సాహకాలను ఇస్తున్నామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నైపుణ్యాలు పెంచుకుంటేనే విదేశాల్లో రూ.2లక్షల వరకు వేతనం ఉంటుందని వివరించారు. ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించలేని చదువులు వ్యర్థమని ఆయన అభిప్రాయపడ్డారు. జర్మనీ, జపాన్, సింగపూర్‌లలో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, రాష్ట్ర యువత స్కిల్స్ పెంచుకొని విదేశీ ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలని రేవంత్ రెడ్డి సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల వైట్‌కాలర్ ఉద్యోగాలకే ముప్పు అని బ్లూ కాలర్ ఉద్యోగాలకు ఉండదన్నారు. నైపుణ్యాలు ఉన్న వారు కావాలని విదేశాలు తమను సంప్రదిస్తున్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మొదటిసారిగా కార్మికుల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయంమని, గత ప్రభుత్వం బాధ్యతను వదిలేసిందని, మా ప్రభుత్వం బాధ్యతతో వారి ప్రయోజనం కోసం నిర్ణయం తీసుకుందన్నారు. కార్మిక నాయకుడంటే వెంకటస్వామి గుర్తొస్తారని, ఆయన వారసుడిగా మంత్రి వివేక్‌వెంకటస్వామి, కార్మికుల సంక్షేమం కోసం మంచి నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. మా ప్రభుత్వం ప్రతీ అంశాన్ని దీర్ఘకాలిక దృష్టితో చూస్తుంది అందుకే కార్మికుల కనీస వేతనం పెంపు పై నిర్ణయం తీసుకున్నాంమని చెప్పారు. యువతకు నేను ఒకటే సూచన చేస్తున్నా, ఐటీ, అమెరికా అనే ఆలోచన వీడండి, ఉద్యోగాలు రాని ఉపాధి అవకాశాలు లేని చదువులు వ్యర్థం సాంకేతిక నైపుణ్యంతో జర్మనీ,జపాన్ సింగపూర్ లాంటి ఇతర దేశాల్లో అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి యువతను ప్రోత్సహిస్తుందని, ఆ దిశగా యువత దృష్టి సారించాలని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో కనీస వేతన సవరణ చేయలేదని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. కార్మికులు సంతృప్తిగా ఉన్నపుడు మాత్రమే ఉత్పత్తి బాగుంటుందని అభిప్రాయపడ్డారు. వేతనాల సవరణకు సీఎం రేవంత్‌రెడ్డి ఒక కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారని వివరించారు. కనీస వేతన సవరణ ప్రభావం 1.11 కోట్ల మందిపై ఉంటుందని తెలిపారు.

## వారం - వర్జ్యం

22-05-2026, అధికజ్యేష్ఠ శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, రోహిణి కార్తె
షష్ఠి ఉ.6.25, సప్తమి తె.5.06
ఆశ్లేష రా.2.10
వర్జ్యం : మ.3.17-సా.4.51
ఉ.ఉ.8.10-ఉ.9.02,2) మ.12.29-మ.1.21
శుభసమయం : ఉ.7.30-8.00
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** ఉన్నతస్థాయి వ్యక్తులు తగిన విధంగా ప్రవర్తించ లేదని, సాయపడలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తారు. నూతన విద్యావకాశాలు.

**వృషభం:** వర్గాలను కూడ గడతారు. భూమి సంబంధిత వ్యవహారాలు కలిసి వస్తాయి. విలువైన సమాచారం అందుకుంటారు.

**మిథునం:** సంతానవిషయంలో నిర్ణయాలు చేయడం కష్టతరంగా అనిపిస్తుంది. ఏది మంచో, ఏది చెడో తెలియదు.

**కర్కాటకం:** ఆర్థిక ఇబ్బందులు అధిగమిస్తారు. పొదుపుకు సంబంధించి పురోగతి సాధిస్తారు. వాహన సౌలభ్యం.

**సింహం:** ఇష్టపడి కొనుగోలు చేసినా వాటిని తిరిగి మార్పు చేయాలని యోచిస్తారు. మిత్రుల సలహాలు, పోరు విసుగు కలిగిస్తాయి.

**కన్య :** ఎవరు ఆప్తులో, ఎవరు నిజమైన హితులో తెల్చుకోలేరు. ఉద్యోగం పనిభారం అధికమవుతోంది. ఆరోగ్యం జాగ్రత్త.

**తుల :** రకరకాల సమస్యలు అన్నింటికీ మీరే బాధ్యత వహించాల్సిన స్థితి సంభవం. పాస్ పోర్ట్ వంటి అంశాలు సానుకూలంగా ఉంటాయి.

**వృశ్చికం:** కుటుంబ ప్రతిష్ఠ దృష్టిలో ఉంచు కొని జారిపోయిన అవకాశాలను తిరిగి అను కూలంగా చేసుకునే యత్నాలు పట్టుదలగా చేస్తారు.

**ధనుస్సు:** మీడియాను, ప్రచారాన్ని అనుకూలంగా మార్చుకుంటారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉత్సాహంగా చేస్తారు.

**మకరం:** స్త్రీల విషయంలో ఎంత దిగి వచ్చినా సయోధ్య కుదరటం కష్టం. ముఖ్యమైన వ్యవహారాలు సాఫీగా పూర్తి చేస్తారు.

**కుంభం:** కలిసి వచ్చిన, పొదుపు చేసిన ధనాన్ని పెట్టుబడి రూపంలో చూసుకోవలసి ఉంటుంది. ఆస్తుల విలువ పెరుగుతుంది.

**మీనం:** ఇతరులకు వస్తువులు ఇచ్చి విరోధి అవుతారు. ఉద్యోగంలో నిందలు, ఆరోపణలు రావచ్చు. ఆరోగ్యం జాగ్రత్త.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఎబోలా డేంజర్ బెల్స్




## భారత్‌లో అప్రమత్తత
### విమానాశ్రయాల్లో ప్రయాణికుల స్క్రీనింగ్
### ఆఫ్రికా ఫోరమ్ సదస్సు వాయిదా

**న్యూఢిల్లీ,మే 21:** ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వైరస్ వ్యాప్తి ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం అప్రమత్తమైంది. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వస్తున్న లేదా ఆయా దేశాల మీదుగా ప్రయాణిస్తున్న ప్రయాణికుల కోసం ఇవాళ ఒక హెల్త్ అడ్వైజరీని జారీ చేసింది. వ్యాధి లక్షణాలు కనిపించిన వారు వెంటనే విమానాశ్రయంలోని ఆరోగ్య అధికారులకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేసింది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ జారీ చేసిన ఈ మార్గదర్శకాలను ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ద్వారా పంచుకుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికల ఆధారంగా డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్‌లను హైరిస్క్ దేశాలుగా గుర్తించారు. ఈ దేశాల నుంచి వచ్చే ప్రయాణికుల్లో జ్వరం, వాంతులు,తీవ్రమైన నీరసం,విరేచనాలు, తలనొప్పి, కండరాల నొప్పి, గొంతునొప్పి, వివరించలేని రక్తస్రావం వంటి లక్షణాలు ఉంటే ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్‌కు ముందే ఎయిర్ పోర్ట్ హెల్త్ ఆఫీసర్‌కు లేదా హెల్త్‌డెస్క్‌కు తెలియజేయాలని సూచించారు. ఎబోలా సోకినట్లు అను మానిస్తున్న లేదా నిర్ధారణ అయిన రోగిరక్తం లేదా శరీరద్రవాలతో ప్రత్యక్షంగా సంబంధం ఉన్నవారు కూడా అధికారులకు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. భారత్‌కు వచ్చిన 21 రోజుల్లోగా ఈలక్షణాలు కనిపిస్తే, తక్షణమే వైద్య సహాయం తీసుకోవాలని, తమ ప్రయాణ వివరాలను వైద్యులకు వెల్లడించాలని అడ్వైజరీలో పేర్కొన్నారు. డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో తాజాగా 513 అనుమానిత ఎబోలా కేసులు, 131 అనుమానిత మరణాలు నమోదయ్యాయి. ఈ పరిణామాల నేపథ్యంలో జోర్డాన్ ఇప్పటికే కాంగో, ఉగాండా ప్రయాణికులపై తాత్కాలిక నిషేధం విధించింది. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఆరోగ్య తనిఖీలకు అందరూ సహకరించాలని ఢిల్లీ విమానాశ్రయం విజ్ఞప్తి చేసింది.

**ఆఫ్రికా ఫోరమ్ సదస్సు వాయిదా**

ఆఫ్రికా ఖండంలోని పలు దేశాల్లో ఎబోలా వైరస్ కలకలం రేపుతుండటంతో ఢిల్లీలో జరగాల్సిన నాలుగో భారత్ ఆఫ్రికా ఫోరమ్ సమ్మిట్ వాయిదా పడింది. మే 28 నుంచి 31 వరకు జరగాల్సిన ఈ సదస్సును ప్రస్తుత ప్రజారోగ్య పరిస్థితుల దృష్ట్యా వాయిదా వేస్తున్నట్లు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ గురువారం ప్రకటించింది. డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో , ఉగాండా దేశాల్లో ఎబోలా వ్యాప్తి తీవ్రంగా ఉండటంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇటీవల అంతర్జాతీయ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సదస్సును వాయిదా వేయడానికి ముందు భారత ప్రభుత్వం, ఆఫ్రికన్ యూనియన్ ఛైర్‌పర్సన్, ఆఫ్రికన్ యూనియన్ కమిషన్ మధ్య సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఆఫ్రికా దేశాల ప్రతినిధులు, కీలక నేతలు అందరూ పూర్తి స్థాయిలో హాజరయ్యేలా చూడటంతో పాటు, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సదస్సును మరో తేదీకి మార్చడమే మంచిదని ఇరుపక్షాలు నిర్ణయించాయి. ఆఫ్రికాలో ఎబోలాను అదుపు చేయడానికి ఆఫ్రికా సీడీసీ తీసుకుంటున్న చర్యలకు భారత్ తన పూర్తి సంఘీభావాన్ని, మద్దతును ప్రకటించింది.

## ఎన్నాళ్లీ మొద్దు నిద్ర

>> కేటీఆర్ డిమాండ్ చేశారు. తొమ్మిది న్నరేళ్ల పాటు బీఆర్ఎస్ హయాంలో కొండంత ధైర్యంతో బతికిన సాగు రంగాన్ని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం కొద్ది నెలల్లోనే కన్నీటి సేద్యంగా మార్చేసిందని ఆయన ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా పంట అమ్ముకోవడానికి వచ్చిన రైతులు కొనుగోలు కేంద్రాల వద్దే వారాల తరబడి పడిగాపులు కాస్తూ, గుండెపగిలి కుప్పకూలుతున్నా ప్రభుత్వానికి కనీస సోయి లేదని కేటీఆర్ విమర్శించారు. ముఖ్యమంత్రి తన కుర్చీని కాపాడుకోవడానికి 70 సార్లు ఢిల్లీ చుట్టూ తిరగడంపై ఉన్న శ్రద్ధలో ఒక్క శాతం కూడా రైతులపై పెట్టడం లేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్ద ఎండ తీవ్రతకు, వడదెబ్బకు తోడు ప్రభుత్వం చేస్తున్న ఆలస్యం వల్ల దాదాపు 10 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని లేఖలో పేర్కొన్నారు. వరంగల్ నుంచి ఖమ్మం దాకా ఎక్కడ చూసినా రోజుకు కనీసం ఒక్క లారీ లోడ్ కూడా ఎత్తడం లేదని, అడపాదడపా కొనే చోట కూడా క్వింటాలుకు 10 కిలోల వరకు తరుగు తీస్తూ రైతుల కడుపు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి గన్నీ బ్యాగుల కోసం రైతుల నుంచే రూ. 50 డిపాజిట్ వసూలు చేసే దుస్థితి తేవడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ మూడు నెలల ముందే ప్రణాళికలు వేసి, కరోనా కష్టకాలంలోనూ రైతుల కల్లాల వద్దకే వెళ్లి చివరి గింజ వరకు కొనుగోలు చేసేలా భరోసా ఇచ్చారని కేటీఆర్ నీపేర్కొన్నారు. రాష్ట్రంలో రోడ్డెక్కని రైతు, రాస్తారోకో జరగని రహదారి లేదన్న కేటీఆర్... ఇవాళ బూతులు తిడుతున్న రైతులే రేపు కాంగ్రెస్ సర్కారుకు వాతలు పెడతారని అన్నారు. అన్నదాతల చేతిలోనే ఈ ప్రభుత్వ కౌంట్‌డౌన్ మొదలైందని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ప్రాణాలు కోల్పోయిన రైతుల కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించాలని, లేనిపక్షంలో చరిత్రలో రేవంత్ రెడ్డి ఎప్పటికీ ఒక రైతు ద్రోహిగానే మిగిలిపోతారని హెచ్చరికలు చేశారు.



గురువారం హైదరాబాద్‌లో రాజీవ్ గాంధీకి నివాళి అర్పిస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో విహెచ్ తదితరులు

## మహిళా రిజర్వేషన్ల కోసం ప్రత్యేక పార్లమెంట్ పెట్టండి
### దేశానికి సాంకేతికతను పరిచయం చేసిన నేత రాజీవ్‌గాంధీ
### 33 శాతం మహిళా రిజర్వేషన్లకు ఇండియా కూటమి సంపూర్ణ మద్దతు
### మాజీ ప్రధాని రాజీవ్ వర్ధంతి కార్యక్రమంలో సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే21:** మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ట్యాంక్ బండ్ వద్ద గురువారం ఆ మహనీయుడి విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. దేశానికి సాంకేతికతను పరిచయం చేసి ప్రపంచంలో గుర్తింపు తెచ్చిన మహనీయుడు రాజీవ్ అని కొనియాడారు. దేశంలో సాంకేతికతను తీసుకొచ్చిన గొప్ప దార్శనీకుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. దేశంలో మహిళా రిజర్వేషన్లు తీసుకొచ్చారని తెలిపారు. సరళీకృత విధానాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన గొప్ప దార్శనీకుడు రాజీవ్ అని చెప్పుకొచ్చారు. సోనియా గాంధీ సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ కల సాకారమైందని సీఎం అన్నారు. తెలంగాణకు గాంధీ కుటుంబంతో అవినాభావ సంబంధం ఉందన్నారు. అది కుటుంబ సంబంధం కంటే ఎక్కువని తెలిపారు. తెలంగాణ ఉన్నంత వరకు ప్రజలు గాంధీ కుటుంబాన్ని గుర్తు చేసుకుంటారని అన్నారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు తీసుకురావాలన్నారు. తక్షణమే ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు ఏర్పాటు చేసి లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండి కూటమి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో రాజకీయాలు చేయాలనుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సీఎంతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు... రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు.

## ఇంధన కొరత లేకుండా తగు చర్యలు
### నాలుగున్నర గంటలకుపైగా సాగిన అత్యవసర కేబినెట్ సమావేశం

**న్యూఢిల్లీ, మే 21:** ఐదు యూరోప్ దేశాల్లో పర్యటనలు ముగించుకుని వచ్చిన ప్రధానిమోడీ గురువారంనిర్వహించిన అత్యవసర భేటీలో చమురు, గ్యాస్ కొరతరాకుండాచూడాలని ఆదేశాలు జారీచేసారు. మధ్యప్రాచ్యం ఉద్రిక్తతల ప్రభావం దేశంపై పడకూడదని ఇందుకోసంముందస్తు కార్యాచరణ అమలుచేయాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న నిల్వలు, రానున్న చమురు వనరుల ట్యాంకర్లు వంటివాటిని సమీక్షించడంతోపాటుప్రభుత్వశాఖల పనితీరు కూడా నివేదికలు కోరారు. సాయంత్రం ఐదు గంటలకు భారత్‌మండపంలోప్రారంభించిన ఈ సమావేశం సుమారు నాలుగున్నర గంటలకుపైగా సాగింది. ఈ సమావేశానికి కేంద్ర కేబినెట్ మంత్రులతో పాటు జూనియర్ మంత్రులు (సహాయ మంత్రులు) అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని, ఎవరూ ఢిల్లీ వదిలి వెళ్లకూడదని ఆకస్మిక ఆదేశాలు జారీ కావడంతో జూనియర్ మంత్రులతోసహా అందరూ హాజరయ్యారు. అత్యవసర భేటీగా పేర్కొనడంతో ఈ సమావేశంపై బిజెపివర్గాల్లో తీవ్ర ఉత్కంఠను సైతం రేకెత్తించింది. దేశభద్రత, ఆర్థిక పరిస్థితి, అంతర్జాతీయ పరిణామాలపై సీనియర్ ప్రభుత్వ అధికారులు ప్రధానికి నివేదికలు ఇచ్చారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు. అంతర్జాతీయ పరిణామాల వల్ల ముడి చమురు ధరలు పెరగడం, సరఫరా గొలుసు దెబ్బతినడం, తద్వారా దేశంలో ద్రవ్యోల్బణం పెరిగే అవకాశాలపై ప్రభుత్వం నిఘా ఉంచింది. మంత్రులు, అధికారులతో తన సమీక్షలోప్రధానిమోడీ వివిధ ప్రభుత్వశాఖల పనితీరునివేదికలను కూడా పరిశీలనచేసి అనంతరం పెండింగ్ ప్రాజెక్టులను సత్వరమే పూర్తిచేయాలని ఎప్పటికప్పుడు నివేదికలు రావాలని సూచించారు. ప్రధాని విదేశీ పర్యటనలో ఉన్న సమయంలోనే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరిలతో కూడిన ఒక ఉన్నత స్థాయి బృందం ఈ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ వచ్చింది. దేశంలో ముడి చమురు, ఎల్‌పీజీ తగినంత నిల్వలు ఉన్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాజ్‌నాథ్ సింగ్ ఇప్పటికే దేశ ప్రజలకు హామీ ఇచ్చారు.

## రాష్ట్రంలో కొర్రమీను
# అక్వా క్లస్టర్
### కరీంనగర్ జిల్లా కేంద్రంగా ఏర్పాటు
### మత్స్యకారులకు ఒకేచోట సాంకేతికత, మార్కెటింగ్ సదుపాయాలు
### తక్కువ ధరకే అందుబాటులోకి రానున్న కొర్రమీను
### దేశంతోపాటు విదేశాలకు ఎగుమతిచేసేలా ప్రణాళిక

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొర్రమీను చేపకు ఉన్న విపరీతమైన డిమాండ్‌ను గుర్తించిన మత్స్యశాఖ ప్రత్యేక అక్వా క్లస్టర్‌ను ఏర్పాటు చేసింది. కరీంనగర్ జిల్లా కేంద్రంగా కొనసాగే ఈ క్లస్టర్‌లో పొరుగున ఉన్న జిల్లాలను కూడా ఇందులో భాగస్వామ్యం చేస్తూ ఉమ్మడి ప్రణాళికను సిద్ధం చేసింది. తెలంగాణ మత్స్యశాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ప్రణాళికలతో కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పరిధిలో కొర్రమీను సాగు సరికొత్త రికార్డుల వైపు అడుగులు వేస్తోంది. దీంతో చేపల పెంపకందారులకు అవసరమైన సాంకేతికత, నాణ్యమైన మేత, మార్కెటింగ్ సదుపాయాలు ఒకే చోట లభించనున్నాయి. ఒకప్పుడు నీటి ఎద్దడితో అల్లాడిన ఉత్తర తెలంగాణ ఇప్పుడు జలకళతో ఉరకలేస్తోంది. లోయర్ మానేరు డ్యామ్, మిడ్ మానేరు, శ్రీపాద ఎల్లంపల్లి వంటి భారీ ప్రాజెక్టుల పుణ్యమా అని కరీంనగర్ చుట్టుపక్కల ప్రాంతాలు నిత్యం నీటితో కళకళలాడుతున్నాయి. ఈ అపారమైన మంచినీటి వనరులే ఇప్పుడు కొర్రమీను సాగుకు అతిపెద్ద సానుకూల అంశాలుగా మారాయి. స్థానిక చెరువులు, రిజర్వాయర్లలో ఆధునిక పద్ధతుల్లో (కేజ్ కల్చర్ వంటి విధానాల ద్వారా) ఈ చేపల పెంపకాన్ని ముమ్మరం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కొర్రమీను ధర కేజీ రూ. 300 నుంచి రూ. 600 పైమాటే. ఇతర రాష్ట్రాల నుంచి రవాణా ఖర్చులు, బార్డర్ ట్యాక్సులు తోడవడమే దీనికి ప్రధాన కారణం. ఇప్పుడు కరీంనగర్ హబ్‌లోనే స్థానికంగా టన్నుల కొద్దీ ఉత్పత్తి కానుండటంతో రవాణా ఖర్చులు తగ్గి వినియోగదారులకు తక్కువ ధరకే తాజా కొర్రమీను అందుబాటులోకి రానుంది. మరోవైపు, స్థానిక మత్స్యకారులకు, యువతకు ఉపాధి అవకాశాలు పెరిగి, వారి ఆర్థిక తల రాత మారనుంది. కేవలం తెలంగాణ మార్కెట్ అవసరాలు తీర్చడమే కాకుండా భవిష్యత్తులో ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు కూడా కొర్రమీనును ఎగుమతి చేసేలా ప్రభుత్వం పక్కా కార్యచరణను సిద్ధం చేసింది. ఇందుకోసం కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో అత్యాధునిక కోల్డ్ స్టోరేజ్ (శీతలీకరణ కేంద్రాలు), ప్యాకింగ్ యూనిట్లను కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. 2016 లోనే తెలంగాణ రాష్ట్ర చేపగా గుర్తింపును దక్కించుకున్న కొర్రమీను, ఇప్పుడు కరీంనగర్ వేదికగా సరికొత్త ఆర్థిక విప్లవానికి తెరలేపనుంది. త్వరలోనే "కరీంనగర్ కొర్రమీను" బ్రాండ్ దేశవ్యాప్తంగా మారుమోగడం ఖాయంగా కనిపిస్తోంది.

## మెగా రైల్వేస్టేషన్

>> సంస్థ జిన్హువా కథనం ప్రకారం ఈ భారీ ప్రాజెక్ట్ కోసం చైనా పెద్ద ఎత్తున రోబోల సైన్యాన్ని రంగంలోకి దించింది. లేజర్ సాయంతో నడిచే ఫోర్‌వీల్ రోబోలు మనుషుల కంటే మూడు రెట్లు వేగంగా, మిల్లీమీటర్ల కచ్చితత్వంతో కాంక్రీట్ లెవలింగ్ పనులను పూర్తి చేశాయి. ఏఐ, 5జీ సాంకేతికతతో పనిచేసిన ఈ రోబోల వల్ల కార్మిక ఖర్చులు 40 శాతం వరకు తగ్గినట్లు సమాచారం. దాదాపు 800 కిలోల బరువైన భారీ గ్లాస్ ప్యానెళ్లను అమర్చడానికి ప్రత్యేక రోబోలను ఉపయోగించారు. ఇవి ప్రమాదాల ముప్పును 90 శాతం తగ్గించడమే కాకుండా, పనులను మూడు రెట్లు వేగవంతం చేశాయని నిర్మాణ సంస్థ అధికారులు వెల్లడించారు. వీటితో పాటు రాత్రింబవళ్లు గస్తీ కాసే పెట్రోలింగ్ రోబోలు, వెల్డింగ్ రోబోలు కూడా ఈ పనుల్లో పాల్గొన్నాయి. గతేడాది మే నెలలోనే ప్రజలకు అందుబాటులోకి వచ్చిన ఈ స్టేషన్ వైశాల్యం అక్షరాలా 1.22 మిలియన్ చదరపు మీటర్లు. ఇందులో 15 ప్లాట్‌ఫామ్‌లు, 29 రైల్వే ట్రాక్‌లు ఉన్నాయి. రద్దీ సమయాల్లో గంటకు 16 వేల మంది ప్రయాణికులను చేరవేసే సామర్థ్యం ఈస్టేషన్‌కు ఉంది. ఈ ఒక్క స్టేషన్ నుంచే చైనాలోని బీజింగ్, షాంఘై వంటి 14 ప్రధాన నగరాలకు హైస్పీడ్ రైలు కనెక్టివిటీ ఉంది.



## రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి బాధ్యతలు స్వీకారం

**హైదరాబాద్ (బేగంపేట) మే 21, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. కమిషన్ కార్యదర్శి పద్మజ రమణ, సిబ్బంది ఛైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మికి వేదపండితుల మంత్రోచ్ఛారణ, ఆశీర్వచనాలతో స్వాగతం పలికారు. ముందుగా తండ్రి కె.కేశవరావు ఆశీర్వాదం తీసుకుని ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తూ ఫైలుపై సంతకం చేశారు. ఛైర్ పర్సన్‌తో పాటు సభ్యులుగా కాసోజు శంకరమ్మ, చిట్యాల శ్వేత, శశికళ యాదవరెడ్డి, సరాంక్షి, రాధాభాయ్, ఉజ్మా ఆదిల్ షాకీర్ పదవీ బాధ్యతలను స్వీకరించారని ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅతిథులుగా మంత్రులు పొన్నం ప్రభాకర్, డా.జి.వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, ఛైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ ఛైర్‌పర్సన్ కొత్తకోట సీతాదయాకర్ రెడ్డి, భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్‌యాదవ్, మహబూబాబాద్ ఎంపి పి.బలరామ్‌నాయక్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, మాజీమంత్రి గీతారెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ కల్వ సుజాత, టీజీ ఆర్థిక సంస్థ ఛైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, స్త్రీ శిశు సంక్షేమం దివ్యాంగులు వయో వృద్ధుల సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అనిత రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ నూతన ఛైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మికి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రంలో మహిళల సమస్యల పరిష్కరించడంలో మహిళా కమీషన్ ముందుంటుందని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళల రక్షణతోపాటు వారికి ప్రతి విషయంలో మహిళా కమిషన్ అండగా ఉంటుందన్నారు.

# బండి భగీరథ్ కేసుపై కెసిఆర్ మౌనమేల?

- పోక్సో కేసులో పోలీసులే అరెస్ట్ చేశారు
- ఎన్నికలవగానే రోజుకోసారి పెట్రో, డీజిల్ ధరలు పెంచుతున్నారు
- రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు 80శాతం పూర్తయింది
- కులగణన విషయంలో సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం
- సచివాలయంలో మీడియాతో మాట్లాడిన సిఎం రేవంత్‌రెడ్డి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 21:** పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్‌ను పోలీసులు చట్టప్రకారమే అరెస్ట్ చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అప్పా జంక్షన్ వద్ద అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. తనకు పోలీసులు ఇచ్చిన సమాచారం ఇదేనని.. వారి మాటలనే తాను నమ్ముతానని పేర్కొన్నారు. గురువారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పలు ప్రశ్నలపై స్పందించారు. బండి సంజయ్ తన కుమారుడిని పోలీసులకు అప్పగించారనే ప్రచారాన్ని ముఖ్యమంత్రి ఖండించారు. ఒకవేళ ఆయనే అప్పగించాలనుకుంటే పోలీసు లను ఇంటికి పిలిచి అప్పగించాల్సిందని అభిప్రాయ పడ్డారు. రోడ్డు మధ్యలో ఉన్న అప్పా జంక్షన్ వద్ద పోలీసులు పట్టుకుంటే అది సరెండర్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. అప్పా జంక్షన్ ఏమైనా బండి సంజయ్ ఇల్లా? అని ప్రశ్నించారు. ఫిర్యాదు అందిన వెంటనే ప్రభుత్వం పద్ధతి ప్రకారం చర్యలు తీసుకుందని రేవంత్ రెడ్డి వివరించారు. ఈ సున్నితమైన కేసులో బీఆర్ఎస్ నాయకులు సిగ్గు తప్పి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వారే విచారణ జరిపి, వాళ్లే తీర్పులు ఇచ్చుకుంటున్నారని ధ్వజమెత్తారు. పోక్సో కేసులో మైనర్ బాలిక వివరాలు వెల్లడిస్తే ఆ కుటుంబానికి ఎంతో ఇబ్బంది కలుగుతుందని, కేటీఆర్ రాజకీయాల కోసం ఒక బాలికను అడ్డుపెట్టుకోవడం సరికాదన్నారు. ఫోక్సో కేసులో ఏదో సాధించినట్లు బీఆర్ఎస్ నేతలు శాడిస్టుల వ్యవహరిస్తున్నారు. రాజకీయాలు చేయాలనుకుంటే ఎన్నికల్లో ఓడించాలి.. అంతే కాని దిగజారి ప్రవర్తించొద్దని కేటీఆర్ బావమరిది ఫామ్ హౌస్ లో డ్రగ్స్ దొరికినా పోలీసు ఇచ్చి విచారించాం, బండి భగీరథ్ విషయంలోనూ నోటీసులు ఇచ్చి విచారణ చేస్తున్నాం,ఫోక్సో కేసులో పోలీసులు ప్రొసీజర్ ప్రకారమే వ్యవహరిస్తున్నారని తెలిపారు. కేటీఆర్ ఇంకా కల్వకుంట్ల రాజ్యంలోనే ఉన్నానని అనుకుంటున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ దిగిపోయి చాలా రోజులైంది పార్టీ మీటింగ్ కోసం జగిత్యాలకు వెళ్లిన కేసీఆర్.. రాష్ట్రంలో ఇంత పెద్ద సంఘటన జరిగితే ఎందుకు బయటకు రాలేదు? అని ప్రశ్నించారు. కులగణన విషయంలో సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం తెలంగాణ నిర్ణయాన్ని సుప్రీం కోర్టు కూడా సమర్థించడం మాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని చెప్పారు. తెలంగాణలో జనగణనతో పాటు కులగణన చేసి అన్ని వివరాలు ప్రజల ముందుంచాం జనగణనలో కులగణన విషయంలో తెలంగాణ దేశానికి దిక్సూచిగా నిలిచింది మోదీ ప్రభుత్వం తక్షణమే జనగణనలో కులగణన చేర్చి బలహీన వర్గాలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించాలని చెప్పారు.ప్రజా సమస్యలను, దేశాల మధ్య యుద్దాన్ని బిజెపి,మోడీ ప్రభుత్వం రాజకీయ కోణంలో చూస్తుందనిఅందుకే ఎన్నికలు అవగానే పెట్రోల్, డీజిల్ ధరలను రోజుకోసారి పెంచుతున్నారని సిఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ 80 శాతం పూర్తయింది... ఇంకా 20 శాతం మిగిలి ఉంది ఆ ప్రక్రియ కూడా త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. హమాలీలు దొరకక ధాన్యం కొనుగోలు ఆలస్యమైంది. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ఉండటంతో వారంతా ఓట్లేసేందుకు వెళ్లారు. అప్పుడప్పుడే తిరిగి వస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు మానవత్వం మరిచిపోయి వ్యవహరిస్తున్నారు రైతుల విషయంలో బీఆర్ఎస్ శవ రాజకీయాలు చేయాలని చూస్తోందన్నారు. రాజకీయాల కోసం మరీ ఇంత దిగజారి వ్యవహరిస్తారా?నిజంగా రైతులపై ప్రేమవుంటే ప్రతిపక్షాలకు చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాలని చెప్పారు.

# నిప్పుల కుంపటిలా మండిపోతున్న తెలంగాణ

### 20 జిల్లాల్లో 46 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు

### రాష్ట్రవ్యాప్తంగా 45 డిగ్రీలను దాటిన ఎండలు

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:** తెలంగాణపై భానుడు ఉగ్రరూపం ప్రదర్శిస్తున్నాడు. ఉదయం తొమ్మిది దాటిందంటే చాలు బయటకు రావాలంటేనే జనం వణికి పోతున్నారు. మధ్యాహ్నం వేళల్లో రోడ్లన్నీ కర్ఫ్యూను తలపిస్తూ నిర్జనంగా మారుతున్నాయి. రాష్ట్రంలో ఎండలు, వడగాల్పుల తీవ్రత మునుపెన్నడూ లేని విధంగా పెరిగిపోతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లిలో 46.4 డిగ్రీలు, మహబూబాబాద్ జిల్లా కురవిలో 46.3 డిగ్రీలు, ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లో 46.2 డిగ్రీలు, సిద్ధిపేట జిల్లా అక్కన్నపేటలో 46.1డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని అధికారులు వెల్లడించారు. మొత్తంగా గురువారం రాష్ట్రంలోని 20 జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల ను దాటడం ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. కామారెడ్డి, జనగామ, మెదక్ జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ నెల 26వ తేదీ వరకు ఎండల తీవ్రత ఇలాగే కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రాబోయే అయిదు రోజులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించింది. వడగాల్పుల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, హనుమకొండ జిల్లాలకు వాతావరణశాఖ రెడ్ అలర్ట్‌ను జారీ చేసింది. మిగిలిన జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు.ముఖ్యంగా ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 4 గంటల వరకు ఎండ తీవ్రత అత్యధికంగా ఉంటోందని, ఆ సమయంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని వాతావరణశాఖ అధికారులు, వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎండల తీవ్రత వల్ల చిన్న పిల్లలు, వృద్ధులు త్వరగా అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని, డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండాలంటే రోజంతా తగినన్ని నీళ్ల తాగాలని సూచిస్తున్నారు. బయటకు వెళ్లేవారు తప్పనిసరిగా వెంట గొడుగు, నీళ్ల బాటిల్, గ్లూకోజ్ నీరు, కొబ్బరి బొండాల నీరు లేదా నిమ్మరసం వంటి ద్రవ పదార్థాలను ఉంచుకోవాలని గుర్తు చేస్తున్నారు.

## బాధితురాలిని నిందించడం కాదు.. నిందితుల పెంపకాన్ని ప్రశ్నించండి

### కుల పితృస్వామ్య వ్యవస్థ వల్లే మహిళల అణచివేత

### కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:** భగీరథ్ బాధితురాలిని నిందించడం కాదనీ నేరస్తుల పెంపకాన్ని ప్రశ్నించాలని కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌అన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసుపై కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్ గాంధీభవన్‌లో గురువారం స్పందిస్తూ తెలంగాణలో పోక్సో కేసు తీవ్ర ఆందోళన కలిగించడమే కాకుండా, రాజ్యాంగ బద్ధ సమానత్వానికి సమాజం ఇంకా చాలా దూరంలో ఉందని, బాధిత బాలికపై వస్తున్న వ్యాఖ్యలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నిర్భయ ఘటన నుంచి ఇప్పటి వరకు బాధితురాలినే నిందించే ధోరణి మారలేదని మీనాక్షి నటరాజన్ విమర్శించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడిపై ఫిర్యాదు నమోదవడంతో పలు ప్రశ్నలు ఎదురవుతున్నాయని తెలిపారు. కులాల ప్రకారం మహిళలపై లైంగిక దోపిడి పెరుగుతోన్నదని అన్నారు. పితృస్వామ్య వ్యవస్థ కారణంగా మహి ళలు అణిచివేతకు గురవుతున్నారని పితృస్వామ్య సమాజంలో అబ్బాయిల హింసాత్మక ప్రవర్తనను సాధారణంగా చూస్తున్నారని అన్నారు. కుల సమూహంలో నష్టపోయేది మహిళలేనని పెరియార్ వ్యాఖ్యలను గుర్తుచేశారు. బాలికల దుస్తులు, పెంపకంపై విమర్శలు చేయడం దారుణమని అభిప్రాయపడ్డారు .రాజకీయ పార్టీలలో కూడా మహిళా సురక్షిత అనుకూల పరిస్థితులతోపాటు, సోషల్ జెండర్ జస్టిస్ సెన్సిటైజేషన్ కమిటీలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆమె చెప్పారు.కాంగ్రెస్‌లో తిరోగమన ఆలోచనలకుస్థానంలేదనిమీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారు. ధర్మం, నీతి సూత్రాలు మాట్లాడేవారు మహిళల పట్ల సంకుచితంగా వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. వ్యక్తులపై నిందలు కాదని, పితృస్వామ్యంపై పోరాటమే అవసరమని వ్యాఖ్యానించారు. సామాజిక న్యాయం కోసమే కాకుండా లింగ వివక్షపై కూడా పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని ఆమె పిలుపునిచ్చారు.

## బిజెపి, బిఆర్ఎస్ అవగాహనతోనే రేవంత్‌పై విమర్శలు

### బండి భగీరథ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు తరువాత బిఆర్ఎస్ గొంతు ఎత్తింది: ప్రభుత్వ విప్ వేముల వీరేశం

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:** బిజెపి, బిఆర్ఎస్ పార్టీల మధ్య అండర్ స్టాండింగ్‌తోనే బండి భగీరథ్ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ ఐపిఎస్ ఆఫీసర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శలు చేస్తున్నారని ప్రభుత్వ విప్ వేముల వీరేశం విమర్శించారు. సిఎల్‌పిలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ బండి భగీరథ్ కేసు తామే వెలికి తీశామన్నట్లుగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతున్నాడనీ ఫోక్సో కేసులో ఎక్కడైనా స్టేషన్ బెయిల్ ఇస్తారా..? అని విమర్శించారు. కెసిఆర్ కెటిఆర్ భరతం పడతా, దొర గడీలు బద్దలు కొట్టి ఏనుగును తీసుకు పోతానని గతంలో ఆర్ఎస్ ప్రవీణ్ చెప్పారనీ ఇప్పుడు. దొర గడీల్లో ఏనుగును తాకట్టుపెట్టి బానిసలా మారాడని ఎద్దేవా చేశారు. దొర గడీలు బద్దలు కొట్టింది మా రేవంతైతే ఏనుగును దొరగడిలో తాకట్ట పెట్టింది ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేశారని గతంలో ఫిర్యాదు చేసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ దొర గడీకి పోయిన ప్రభాకర్ రావు చాలా మంచోడని ఎంతో దిగజారిపోయి స్టేట్ మెంట్ ఇచ్చాడనీ అన్నారు. ఫామ్‌హౌస్‌కు సెక్యూరిటీ ఇచ్చే పోలీస్‌గా, కెసిఆర్ దుర్మా ర్గాలను ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కాపాడటానికి మారాడనీ తెలిపారు. దేశంలోనే తెలంగాణ పోలీస్ రోల్ మోడల్ అనీ రాష్ట్రాన్ని మావోయిస్టు రహిత రాష్ట్రంగా తెలంగాణ పోలీసులు మార్చారనీ చెప్పారు..తెలంగాణ పోలీసుల మనోభావాలను దెబ్బతీస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఎలా పోలీస్ అయ్యాడనీ ప్రశ్నించారు. భగీరథ్ ను అరెస్ట్ చేసి పోలీసులు తీసుకువచ్చిన వీడియోలు ఉన్నాయనీ పోలీసులు చెప్పేది నమ్మకుండా రాజకీయ నాయకులు చెప్పే విషయాలను నమ్మే దీన స్థితిలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఉన్నాడనీ విమర్శించారు. ఆర్ఎస్ ప్రవీణ్ బిజెపి పైన మాట్లాడకుండా రేవంత్ రెడ్డి పైన విమర్శలు చేస్తున్నాడనీ ఆయన ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదనీ హితవు చెప్పారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఇంటిని మా పోలీసులు సోదా చేశారనీ చెప్పారు. బండి సంజయ్ బంధువుల ఇళ్లలో కూడా సోదాలు చేశారనీ తెలిపారు. పారదర్శకంగా మా సిఎం పనిచేస్తుంటే విమర్శలు చేస్తున్నారనీ తెలిపారు. ఎఫ్ ఐ ఆర్ అయిన తర్వాత కూడా సెక్షన్లు మార్చి కేసును మరింత బలోపేతం చేశారనీ వివరించారు. ఉడత ఊపులకు తాటి చెట్టు కదలదనీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గుర్తు పెట్టుకో తెలంగాణ సమాజానికి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తప్పుడు సమాచారాన్ని ఇస్తున్నాడనీ ఆగ్రహం వ్యక్తంచేశారు.

## బండి భగీరథ్ ముందస్తు బెయిల్ పిటిషన్ ఉపసంహారణకు అనుమతించిన హైకోర్టు

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:** బండి భగీరథ్ ముందస్తు బెయిల్ పిటిషన్ ఉపసంహారణకు హైకోర్టు అనుమతించింది. పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 8న బాలిక తల్లి మైనర్ కూతురుపై పలుమార్లు మద్యం బలవంతంగా తాగించి అత్యాచారం చేశారని భగీరథ్‌పై చేసిన ఫిర్యాదుతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. భగీరథ్ మాత్రం ఆమె మేజర్ అని తనపై హనిట్రాప్ జరుగుతోందని కరీంనగర్ టూటౌన్ పోలీసుస్టేషన్‌లో కేసు పెట్టడమే కాకుండా ఈ పోక్సో కేసులో ముందస్తు బెయిల్ కోసం భగీరథ్ పిటిషన్ దాఖలు చేశారు. శుక్రవారం మే 15న వాదనలు విన్న హైకోర్టు బాలికకు మైనార్టీ తీరలేదని నిర్ధారణ చేయడంతోపాటు ముందుస్తు బెయిల్ తీర్పు రిజర్వ్ చేసింది. శనివారంరాత్రి పోలీసులు బండి భగీరథ్‌ను తెలంగాణ పోలీసు అకాడమి సమీపంలో అరెస్ట్ చేశారు. అరెస్ట్‌తో ముందస్తు బెయిల్ పిటిషన్ ఉపసంహారణకు భగీరథ్ తరఫు న్యాయవాది అనుమతి కోరగా, న్యాయవాది విజ్ఞప్తితో భగీరథ్ ముందస్తు బెయిల్ పిటిషన్ హైకోర్టు కొట్టివేసింది. రెగ్యులర్ బెయిల్ పిటిషన్ వేసుకోవడానికి అనుమతించింది.

## ఎన్పీడిసిఎల్‌లో సహకార విద్యుత్ సరఫరా సంఘం

### ఏప్రిల్ నుండి అమల్లో ఉండేలా ఇఆర్సీ ఉత్తర్వులు

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ఏకైక సిరిసిల్లలోని సహకార విద్యుత్ పంపిణీ సంఘం ఇప్పుడు ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోకి వచ్చింది. ఈ మేరకు, తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే దీనికి సంబంధించి లైసెన్సును సవరిస్తూ ఓపీ (ఆపరేషన్) నంబర్ 8 ఆఫ్ 2026ను జారీ చేసింది. ఈ సహకార విద్యుత్ పంపిణీ సంఘం నిర్వహణ మొత్తం ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆధీనంలో గత నెల ఏప్రిల్ 1 వ తేదీ నుండి అమల్లోకి వచ్చేలా సవరించబడిందని ఈ ఉత్తర్వులలో పేర్కొంది. 1970లో జాతీయ గ్రామీణ విద్యుదీకరణ సంస్థ దేశవ్యాప్తంగా పైలట్ ప్రాతిపదికన ప్రారంభించిన కొన్ని విద్యుత్ సరఫరా సొసైటీలలో సిరిసిల్లా సహకార విద్యుత్ సరఫరా సంఘం ఒకటి. ఇది పూర్వపు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని మొదటి సొసైటీ. సిరిసిల్ల పట్టణం నుండి పనిచేస్తూ దాని పరిధిలోని గృహాలు, పరిశ్రమలు, వ్యవసాయం మరియు ఇతర రంగాలకు విద్యుత్‌ను సరఫరా చేస్తుంది. తొలుత 420 మంది వినియోగదారులతో ప్రారంభమైన ఇది ఇప్పుడు 3.46 లక్షల మంది సభ్యులను సంపాదించగలిగింది. ప్రస్తుతం ఈ సొసైటీలో 355 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. కాగా అవినీతి, పెండింగ్ బిల్లులు, నాసిరకం నిర్వహణ, పాలకవర్గం ఎన్నికలలో అవకతవకల నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చట్టం 2003లోని సెక్షన్ 86 (2) కింద సహకార విద్యుత్ సంఘాన్ని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో విలీనం చేయాలని నిర్ణయించింది.



వివరాలు వెల్లడిస్తున్న డిసిపి శిరీష రాఘవేంద్ర

## రూ.7.90 కోట్ల భారీ మోసం బట్టబయలు

### ఫైనాన్స్ హెడ్ అరెస్ట్

**కొత్తూరు, మే 21, ప్రభాతవార్త:** కొత్తూరు మండల పరిధిలోని సి.ఎం.టి.ఎల్ సమీపంలోని తీగాపూర్‌లో ఉన్న ఆర్ఎం కన్వర్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో భారీ ఆర్థిక మోసం వెలుగులోకి వచ్చింది. సంస్థలో ఫైనాన్స్, అకౌంట్ హెడ్‌గా పనిచేస్తున్న హన్మండ్ల లక్ష్మణ్‌ను కొత్తూరు పోలీస్లు గురువారం అదుపులోకి తీసుకున్నారు. డిసిపి శిరీష రాఘవేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడు సంస్థకు చెందిన రూ.7,90,27,915 (ఏడు కోట్లు తొంభై లక్షల ఇరవై ఏడు వేల తొమ్మిది వందల పదిహేను రూపాయలు) నిధులను అక్రమంగా వ్యక్తిగత బ్యాంక్ ఖాతాకు మళ్లించినట్లు విచారణలో వెల్లడైంది. అనంతరం ఆ మొత్తాన్ని షేర్ మార్కెట్‌లో పెట్టుబడుల రూపంలో వినియోగించినట్లు పోలీసులు గుర్తించారు. సంస్థ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన కొత్తూరు పోలీసులు సాంకేతిక ఆధారాలు, బ్యాంక్ లావాదేవీలను పరిశీలించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న నిందితుడిని గురువారం న్యాయస్థానం ఎదుట హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎసిపి, ఇన్‌స్పెక్టర్ నరసయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ సభ్యత్వ నమోదు కోసం ఇన్‌చార్జీల నియామకం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 21:** బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కోసం అధినేత కేసీఆర్ ఇన్‌ఛార్జిలను ప్రకటించారు. డిజిటల్ ప్రక్రియలో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు జరగనుంది. 119 నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిలను బీఆర్ఎస్ అధినేత నియమించారు. నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలకు తెలంగాణ భవన్‌లో ఐటీ నిపుణులతో డిజిటల్ శిక్షణ ఇవ్వనున్నారు. సభ్యత్వ నమోదు కోసం డిజిటల్ యాప్‌ను రూపొందించారు. తెలంగాణ భవన్‌లో శిక్షణ తర్వాత.. పార్టీ జిల్లా కార్యాలయాల్లో పార్టీ ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జిల ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నారు.పోలింగ్ బూత్‌కు ఇద్దరు చొప్పున వారం రోజుల పాటు శిక్షణ శిబిరాలు నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. డిజిటల్ సభ్యత్వ నమోదు శిక్షణ పూర్తయిన తర్వాత.. సభ్యత్వ పునరుద్ధరణను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రారంభించనున్నారు. బిఆర్ఎస్ పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు ఇంచార్జ్‌లు .. ఉమ్మడి పది జిల్లాల వారీగా నియామకం చేశారు.

## 2027 వార్షిక క్యాలెండర్‌ను ప్రకటించిన యుపిఎస్‌సి

### మే 23న సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష.

### ఆగస్టు 20 నుంచి మెయిన్స్

### జనవరి 31న ఇంజినీరింగ్ సర్వీసెస్ టెస్ట్

### ఏప్రిల్ 25న సిడిఎస్ పరీక్ష

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:** యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) 2027 వార్షిక పరీక్షల క్యాలెండర్‌ను విడుదల చేసింది. అందులో భాగంగా 2027లో నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షల లేదితోపాటు మెయిన్స్ తేదీలను ప్రకటించింది. వాటితోపాటు ముఖ్యమైన పరీక్షల తేదీలను విడుదల చేసింది. జనవరి 10న కంబైన్డ్ జియో సైంటిస్ట్ ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించనున్నారు. జనవరి 31న ఇంజనీరింగ్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షను నిర్వహిస్తారు. సీబీఐ (డిఎస్‌సి)ఎల్‌డిసిఈ పరీక్షను ఫిబ్రవరి 27 నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తా రు. సీఐఎస్ ఏసీ (ఈఎక్స్‌ఈ) ఎల్‌డిసీఈ-2027 పరీక్షను మార్చి 14న నిర్వహిస్తారు. ఎన్‌డిఏ, ఎన్ఏ పరీక్ష(1)ని సీడీఎస్ పరీక్ష(1)ని ఏప్రిల్ 11న నిర్వహించ నున్నట్టు యుపిఎస్‌సి ప్రకటించింది. సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష-2027ను, ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షను మే 23న నిర్వహించనున్నారు.

ఇంజనీరింగ్ సర్వీసెస్ మెయిన్ పరీక్షలను జూన్ 18న నిర్వహిసానతరు. ఐఈఎస్, ఐఎస్ఎస్ పరీక్షలను జూన్ 18 నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. కంబైన్డ్ జీవో సైంటిస్టు మెయిన్ పరీక్షలను జూన్ 19 నుంచి రెండు రోజులపాటు నిర్వహిస్తారు. సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్(ఏసీఏస్) పరీక్షను జులై 4న నిర్వహిసానతరు. కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ పరీక్షను జులై 18న నిర్వహిస్తారు. సివిల్ సర్వీసెస్ మెయిన్ పరీక్షలను ఆగస్టు 20 నుంచి 5 రోజులపాటు నిర్వహించనున్నారు. ఎన్‌డిఏ అండ్ ఎన్ఏ పరీక్షలను, సీడీఎస్ పరీక్ష(2)ను సెప్టెంబర్ 19న నిర్వహించనున్నారు.


ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ మెయిన్ పరీక్షలను నవంబర్ 21 నుంచి 7 రోజులపాటు నిర్వహించనున్నారు. ఎస్‌వో, స్టెనో(జీడీ-బి, జీడీ-1) ఎల్‌డిసీఈ పరీక్షలను డిసెంబర్ 18 నుంచఇ రెండు రోజులపాటు నిర్వహించనున్నట్టు యుపిఎస్‌సి 2027 వార్షిక పరీక్షల క్యాలెండర్‌లో ప్రకటించింది.

## సరస్వతి పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

### సంస్థ ఎండి వై.నాగిరెడ్డి

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా గురువారం ప్రారంభమైన సరస్వతి పుష్కరాలకు వెళ్లే భక్తుల కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు సంస్థ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 1వ వరకు ఈ ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. పవిత్ర పుష్కర స్నానాలు ఆచరించేందుకు కాళేశ్వరానికి వెళ్లే భక్తులకు ఎలాంటి రవాణా ఇబ్బందులు కలగకుండా, వారి ప్రయాణం సురక్షి తంగా, సుఖవంతంగా సాగేలా అధునాతన బస్సులను ఏర్పాటు చేసినట్లు ప్రకటనలో తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల యాక్షన్ ప్లాన్ కింద ఈ ప్రత్యేక రవాణా సౌకర్యాలను పర్యవేక్షిస్తున్నట్లు ఎండీ తెలిపారు. భక్తుల రద్దీ, అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలోని ప్రధాన ప్రాంతాల నుండి కాళేశ్వరానికి ప్రత్యేక బస్సులు నడపబడు తున్నాయని ఎండీ స్పష్టం చేశారు. అందులో భాగంగా హైదరాబాద్, నర్సంపేట, తొర్రురు, భూపాలపల్లి, మణుగూరు, కరీంనగర్, మంథని, హన్మకొండ, మహబూబాబాద్, జనగాం, పరకాల, నిజామాబాద్, గోదావరిఖని, మరియు మంచిర్యాల నుండి నేరుగా కాళేశ్వరానికి బస్సు సర్వీసులు అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. ప్రయాణికులు, భక్తుల సౌకర్యార్థం ఆయా ప్రాంతాలకు సంబంధించిన ప్రత్యేక సంప్రదింపు నంబర్లను కూడా సంస్థ విడుదల చేసిందన్నారు. హైదరాబాద్ భక్తులు సమాచారం కోసం 9959226245 నంబరులో, నర్సంపేట (9959226293), తొర్రూర్ (9959226053), భూపాలపల్లి (9959226707), మణుగూరు (9959225963), కరీంనగర్ (9959225920), మంథని (9959225923), హన్మకొండ (9959226049), మహబూబాబాద్ (9959226054), జనగాం (9959226050), పరకాల (9959226051), నిజామాబాద్ (9959226016), గోదావరిఖని (9959225922), మంచిర్యాల (9959226004) నంబర్లలో సంప్రదించి బస్సుల వేళలు, ఇతర వివరాలను తెలుసుకోవచ్చని సూచించారు. పుష్కరాలకు వెళ్లే ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్ల కొరకు టీజీఎస్ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ టిక్కెట్లను బుక్ చేసు కోవచ్చని పేర్కొన్నారు. భక్తులందరూ ఈ ప్రత్యేక బస్సు సర్వీసులను వినియోగించుకుని, సురక్షి తమైన వాతావరణంలో కాళేశ్వర సరస్వతి పుష్కరాలయాత్రను విజయవంతం చేసుకోవాలని ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి కోరారు.

## ఉద్యమకారులకు న్యాయం జరగడమే ప్రధాన లక్ష్యం : కాచం సత్యనారాయణ గుప్తా



తెలంగాణ ఉద్యమకారుల సమన్వయ కమిటీ సమన్వయ కమిటీ సమావేశంలో కేకే కమిటీ సభ్యులు రాములు నాయక్, మోతె శోభన్‌రెడ్డి, కాచం సత్యనారాయణ గుప్తా తదితరులు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), మే 21, ప్రభాతవార్త:** తెలంగాణ కోసం పోరాడిన నిజమైన ఉద్యమ కారులకు న్యాయం జరగడమే ప్రధాన లక్ష్యం అని తెలంగాణ ఉద్యమ కారుడు డాక్టర్ కాచం సత్యనారాయణ పేర్కొన్నారు. ఉద్యమ సమయం లో ప్రాణాలను పణంగా పెట్టిన వారిని గుర్తించి, వారి త్యాగాలకు గౌరవం ఇవ్వడం ప్రభుత్వ తొలి బాధ్యత కావాలని అన్నారు.

గురువారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అసలైన ఉద్యమ కారులను గుర్తించ కుండా తీసుకునే నిర్ణయాలు అన్యాయానికి దారి తీస్తాయని హెచ్చరిం చారు. ఉద్యమం కోసం కష్టపడ్డ వారికి సరైన గుర్తింపు, సంక్షేమం అందించడమే ఈ కార్య క్రమం అసలు లక్ష్యం కావాలని తెలిపారు. వ్యక్తిగత అభిప్రాయాలను పక్కనబెట్టి, ఉద్యమ కారుల హక్కుల సాధనలో అందరూ ఏకమవ్వాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో కేకే కమిటీ సభ్యులు రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి, ఉద్యమకారులు పి భరత్ రెడ్డి, నరసింహా, రాజు గౌడ్, గౌరీ గణేష్, మోత్కూరి మల్లేష్, బి మధు తదితరులు పాల్గొన్నారు.

## అట్రాసిటీ బాధితుల పరిహారంపై విచారణకు హాజరుకాలేమన్న సాంఘిక సంక్షేమ శాఖ

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు పరిహారం చెల్లించకపోవడం వంటి వివిధ అంశాలపై విచారణకు హాజరుకావాలని జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ జారీచేసిన నోటీసులపై రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ సమాధానమిచ్చింది. రెగ్యులర్ సెక్రటరీ అందుబాటులో లేనందున ఢిల్లీలో జరిగే విచారణకు రాలేమని జాతీయ కమిషన్‌కు రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి లేఖ రాశారు. ఉద్యోగుల బదిలీలతోపాటు గురుకుల విద్యార్థులకు అందించే వస్తువులకు టెండర్ల ఖరారు పనిలో నిమగ్నమై ఉన్నామని తెలిపారు. విచారణ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆ లేఖలో కోరారు. అట్రాసిటీ బాధితులకు పరిహారం చెల్లించే ప్రక్రియ పురోగతిలో ఉన్నదని, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మానిటరింగ్ కమిటీల సమావేశాల నిర్వహణ సాధ్యపడలేదని చెబుతూ త్వరలోనే సమావేశాలను నిర్వహిస్తామని వివరించారు. దీంతో తదుపరి సమావేశాన్ని తెలంగాణలోనే నిర్వహించి, విచారణ జరపాలని జాతీయ ఎస్టీ కమిషన్ సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు తెలిసింది.


వార్త

ఇరవైయేళ్ల వయసుంటేనే యువకుడి కింద లెక్కకాదు. ప్రపంచంలో ఎక్కడ అన్యాయం జరిగినా స్పందించే వారే యువకులు.

-థామస్ ఫుల్లర్

# విస్తరిస్తున్న విద్యావ్యాపారం!

ఒకనాడు ఎంతో పవిత్రంగా భావించి, ఆరాధించి పూజించిన విద్య రానురాను అంగడి సరుకుగా మారిపోతున్నది. నేడు విద్య ఒక వ్యాపారంగా రూపు దాల్చింది. విద్యనే కాదు విద్యార్థులతోసహా ఏకంగా విద్యాసంస్థలను అమ్ముకునే దురదృష్టపు రోజులు దాపురించాయి. బాలబాలికలకు పుస్తకాల బరువు, తల్లిదండ్రులకు ఫీజుల భారం మోయలేనంతగా పెరిగిపోతున్నాయి. విద్యాశాఖ అసమర్థతకు నిదర్శనంగా ఈ వ్యాపారం తెలుగు రాష్ట్రాల్లోనే కాదు ఆ మాటకొస్తే దేశ వ్యాప్తంగా మూడుపువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నది. రోజురోజుకు ప్రైవేట్ రంగంలో విద్యావ్యాపారం విస్తరించి వెర్రితలలు వేస్తున్నది. లాభసాటిగా ఉన్న ఈ వ్యాపారంలో గతంలో ఇతరులు వ్యాపారాలు చేసేవారు కాంట్రాక్టర్లు అన్నింటి కంటే ముఖ్యంగా రాజకీయనాయకులు నేరుగా భాగస్వాములు అవుతున్నారు. వాస్తవంగా చూస్తే ఒకనాడు ప్రభుత్వ పాఠశాలలే తప్ప ప్రైవేట్ బడులు లేవు. ఎక్కడో పట్టణాల్లో, నగరాల్లో నడిచేవి. వాటిల్లో కూడా ఏమాత్రం వ్యాపార ధోరణులు కన్పించేవి కావు. లాభనష్టాలతో సంబంధం లేకుండా కేవలం సేవా దృక్పథంతో విద్యాసంస్థలు సేవలందించేవి. నిర్వాహకులు సామాజిక బాధ్యతగా భావించి బడులు నడిపేవారు. అందువల్ల ఆనాటి ప్రైవేట్ పాఠశాలలను అరికట్టే అవసరం లేకుండాపోయింది. అందుకే చట్టాల అవసరం తలెత్తలేదు. ప్రభుత్వరంగంలో కూడా అంతోఇంతో పటిష్టంగా నడిచేవి. కానీ పరిస్థితులు మారిపోయాయి. పాలకుల అశ్రద్ధ, అవగాహనారాహిత్యం, అరకొర నిధులు, అవినీతి, వీటన్నింటిని మించిన రాజకీయ జోక్యంతో విద్య నానాటికీ దిగజారిపోతున్నది. భవిష్యత్తులో పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆందోళన వ్యక్తమవుతున్నది. మధ్యతరగతి ప్రజలే కాదు, బీదాబిక్కి జనం కూడా నాణ్యమైన విద్య ప్రైవేట్ పాఠశాలల్లోనే దొరుకుతుందన్న నమ్మకంతోనే ఆ వైపు మొగ్గుచూపుతున్నారు. ఏమాత్రం ఆర్థిక వసతి లేనివారు, మరో దారి లేనివారు, విధిలేని పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల బాటపడుతున్నారు. అలా పాఠశాలల్లో చేరిన వారు కూడా ఏదోరకంగా ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశం కోసం ఆరాటపడి చేరిపోతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో గత పదేళ్లలో పరిశీలించినప్రభుత్వ పాఠశాలల్లో యేడాది యేడాదికి సంఖ్య తగ్గిపోతున్నది. ఉచితంగా పుస్తకాలు, మధ్యాహ్నభోజనం పథకంలాంటివి ఎన్నో ప్రోత్సాహకాలు అందిస్తున్నా ఆ వైపు మొగ్గు చూపుడం లేదు. గతంలో పట్టణాలకు, నగరాలకు ఉన్న ప్రైవేట్ విద్య ప్రస్తుతం మండల కేంద్రాలకు, గ్రామాలకు విస్తరించింది. ఇది రానురాను ప్రభుత్వ పాఠశాలల భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేస్తుందేమోననిపిస్తున్నది. ఎందుకు ఈ పరిస్థితి దాపురిస్తున్నది? కారకులు ఎవరు? కారణాలు ఏమిటి? అనేవి అటు అధికార వర్గాలకు కానీ, ఇటు పాలకులకు కానీ తెలియంది కాదు. అయినా ఈ దుర్మార్గపు వ్యాపారానికి అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. అయితే ప్రభుత్వాలు ఏమీచేయడం లేదని చెప్పటంలేదు. ప్రభుత్వ పథకాలు, ఆశయాలు, కోట్లాది రూపాయలు, కేటాయింపులు అన్నీకాగితాల్లో బాగానే ఉంటున్నాయి. కానీ ఆచరణకు వచ్చేసరికి అసలు సమస్యకు కారణాలవుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో యేటా వేలాదికోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారు. అన్ని పాఠశాలలకు కలిపి ఒకటో తరగతిలో దాదాపు నలభై లక్షలమంది వరకు చేరుతున్నారు. వీరిలో సగం మంది కూడా ఉన్నత విద్య దశకు చేరుకోవడం లేదు. రకరకాల కారణాలతో ప్రాథమికవిద్య దశలోనే చదువుకు స్వస్తిచెప్తున్న బాలబాలికలు లక్షలాదిమందిఉన్నారు. మొన్నటి కరోనా రక్కసి సృష్టించిన బీభత్సంతో బడిబాట వదిలిపెట్టినవారు దేశవ్యాప్తంగా కోటి మందికిపైగా ఉంటారని అనధికార అంచనా. ప్రభుత్వాలు బడిబాట అంటూ మళ్లీ పాఠశాలల్లో చేర్పించేందుకు సకల ప్రయత్నాలు చేస్తున్నా ఆశించినమేరకు ఫలితాలు రావడం లేదు. అన్నింటికంటే ముఖ్యంగా పాఠశాలల్లో కనీస వసతుల కొరత తీవ్రంగా కన్పిస్తున్నది. తెలుగు రాష్ట్రాల్లో పరిశీలించినా వేలాది ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అంచనా. ఇక ప్రభుత్వ పాఠశాలల్లో మంచినీరు, మరుగుదొడ్లు వంటి కనీసవసతులు లేకపోవడంతో ముఖ్యంగా బాలికలు పడుతున్నఇబ్బందులు అన్నీఇన్నీ కావు. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా అందరికి విద్య అందించాలనే లక్ష్యం కనుచూపు మేరలో సాధించే అవకాశాలు కన్పించడం లేదు. దేశాభివృద్ధికే కాదు మానవ జాతి అభ్యున్నతికి విద్య పునాది అనేది నిర్వివాదాంశం. ఆరేళ్ల నుంచి పధ్నాలుగేళ్ల బాలబాలికలందరికి ఉచిత విద్య అందించాలని ఈ కార్యక్రమం పదేళ్లలో పూర్తి చేయాలని స్వాతంత్ర్యం రాగానే మన పెద్దలు నిర్ణయించారు. ఈ సంకల్పం కాగితాల్లోనే కన్నుమూసింది. ఇక డిపెప్, ఎపెప్, సర్వశిక్ష అభియాన్ వంటి కార్యక్రమాలు చేపట్టి దేశవ్యాప్తంగా లక్షలాది కోట్ల రూపాయలు వెచ్చించారు, వెచ్చిస్తున్నారు. కానీ లక్ష్యాన్ని చేరుకోలే కపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరవాలి. బాలబాలికలను భావిపౌరులుగా తీర్చిదిద్దాల్సిన విద్యా వ్యవస్థలను ఇంతటి దారుణ పరిస్థితుల్లోకి నెట్టడంసమంజసంకాదు. మారిన పరిస్థితులకు అనుగుణంగా చట్టాలు రూపొందించాలి. జీవనానికి ఉపయోగపడే విధంగా విద్యా విధానాన్ని రూపకల్పన చేయాలి. మరొకపక్క అదుపు తప్పుతున్న ఈ విద్యావ్యాపారాన్ని ఆపకపోతే భవిష్యత్తులో ఎలాంటి విపరీత పరిణామాలు చోటుచేసుకుంటాయో ఊహిస్తేనే భయాందోళనలు కలుగుతున్నాయి. విద్యను వ్యాపారంగా మార్చేవారిపై ఉక్కుపాదం మోపాలి. కొత్త చట్టాల సంగతి అలా ఉంచితే ఉన్న చట్టాలను త్రికరణశుద్ధిగా అమలు చేసేందుకు కృషి జరగాలి.



ఆకలి రుచి ఎరగనట్లే మనకు అత్యవసరమైన దాంట్లో తప్పులు కన్పించవు.

ఆస్కార్‌వైల్డ్



కీర్తి కాంక్ష లేకుండా చేసేదేదో చక్కగా చేయడమే విజయానికి మూలం.

హరివంశ రాయ్ బచన్

## ప్రజావాక్కు



### శిశు విక్రయాలు

రెండు తెలుగు రాష్ట్రాలలో దత్తత పేరిట యధేచ్ఛగా సాగుతున్న శిశు విక్రయాలను అడ్డుకోవడం అత్యవసర సామాజిక బాధ్యతగామారింది. ఇటీవలి కాలంలో వెలుగు చూస్తున్నఅక్రమ దత్తతలు, మధ్యవర్తుల మోసాలు, అంతరాష్ట్ర శిశు విక్రయ ముఠాల ఉదంతాలు ఈ సమస్య తీవ్రతకు అద్దం పడుతున్నాయి. సంతానం లేని దంపతుల ఆరాటాన్ని, పేదరికాన్ని ఆసరాగా చేసుకుని దళారులు రూ.లక్షల్లో వ్యాపారం చేస్తున్నారు. సాంకేతికతను వాడుకుంటూ రహస్య సంప్రదింపుల ద్వారాఅక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. పిల్లల దత్తతకు చట్టబద్ధమైన మార్గం ఒక్కటే. కేంద్ర ప్రభుత్వ సంస్థ కారా మహిళా, శిశు సంక్షేమ శాఖల ద్వారానే ఈ ప్రక్రియ జరగాలి. అక్రమ దత్తతలను అనుమతిస్తే బాలల అక్రమ రవాణా విపరీతంగా పెరిగిపోతుందని అత్యున్నత న్యాయస్థానం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### కపట నాటకం

కాంగ్రెస్ పార్టీలో ప్రధాన మంత్రిగా, రాష్ట్ర ముఖ్యమంత్రులుగా, గవర్నర్లుగా లోక్‌సభ స్పీకర్‌గా, పార్టీ అధ్యక్షులుగా ఇంకా వివిధ హోదాల్లో మహిళలు పనిచేసారు. మొదటి నుంచి మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇద్దరు మహిళలకు మంత్రి పదవులను ఇచ్చింది. గతంలో జి.హెచ్.ఎమ్‌సి, మేయర్, ఇప్పుడు కమిషనర్‌లు కూడా మహిళలే. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించింది. మహిళల కోసం కాంటీన్లు, పెట్రోలు బంకులు వడ్డీలేని రుణాలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఉచితంగా సెల్‌ఫోన్లు అందించడం ఇలా ఇంకా ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి కాంగ్రెస్‌ప్రభుత్వం అంటేమహిళా ప్రభుత్వం అన్నట్లుగా పనిచేస్తోంది.

- రాశి, హైదరాబాద్

### దైవ చింతన అలవర్చుకోవాలి

ప్రతి మానవుడు దేవుడిపై భక్తితో దైవచింతన, మానవత దృక్పథం కలిగి ఉండాలి. దైవ భక్తి ఉంది కదా ఇక అని నెరవేరుతాయి అంటే అదివిచిత్రం. దైవచింతనతో పాటు పట్టుదల కఠోర శ్రమ ఉంటేనే నిజజీవితంలో ఆయురారోగ్యాలతో ఉంటూ విజయాలను సాధిస్తాం. కాలక్రమేణ ప్రశాంతత, నిశ్చల తత్వం అనేది క్రమతరంగా వస్తుంది.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### ఆధ్యాత్మికంతో హైటెక్ పనిచేయదు

పది సంవత్సరాలక్రితం ఈ రవి శంకర్ బాబా యమునా నది ఒడ్డున 20 లక్షల మందితో జాతర జరిపాడు. మోడీ రిబ్బన్ కటింగ్‌చేశారు. జల సంపదను, వృక్షసంపదను నాశనం చేసినందుకు పర్యావరణ పరిరక్షణ వారు వంద కోట్లు జరిమానా వేశారు. చెల్లించలేదు. అరెస్ట్ చెయ్యలేదు. ఇలాంటి బాబాలను సమాజం దూరంగా పెట్టాలి. నెహ్రూ కాలంలో బాబాలు పుట్టలలో దాక్కున్నారు. ఆధ్యాత్మికతతో సమాజం ఆటవికానికి పోతుంది. ఒక ప్రక్క హైటెక్, ఇంకొక ప్రక్క ఆధ్యాత్మికం. ఆధ్యాత్మికంతో హైటెక్ పనిచేయదు చంద్రబాబు గారూ. ఆధ్యాత్మికత అంటేనే అంటరానితనం, మూఢ నమ్మకాలు. మనం ఆధునిక జీవితాన్ని అనుభవిస్తున్నాము. రెండు నావల ప్రయాణం మంచిది కాదు. హైదరాబాద్‌ను హైటెక్ సిటీగా చేసింది నేను అంటారు. అమరావతిని కూడా హైటెక్ సిటీచేస్తామంటున్నారు. ఈగడ్డంబాబాలతో ఏమి సాధిస్తారు?

- నార్నెవెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### ఆధార్ పేరిట మోసాలు

ఆధార్ పేరు పెట్టి ప్రభుత్వాలు ప్రజలతో ఆడుకుంటూ ఉన్నారు. డేట్ ఆఫ్ బర్త్ చేంజ్ ఒకసారి, నేమ్ చేంజ్ లేదా స్పెల్లింగ్ కరెక్షన్స్ రెండుసార్లు పరిమితి పెట్టారు. టు యెర్ ఈజ్ హ్యూమన్ అంటారు. మానవ తప్పిదాలు సహజంగా జరుగుతాయి. స్పెల్లింగ్ మిస్టేక్స్ రావడం ప్రింట్ పొరపాట్లు జరగడానికి అవకాశాలుంటాయి. దేశంబోర్డర్లో ఉన్న ప్రజలకు కఠినమైన నిబంధనలు ఉండడం అర్థం ఉంటుందేమో కానీ అందరికీ ఇలా ఇబ్బంది పెట్టడం తగదు. అన్నింటికీ ఆధార్ ఉపయోగిస్తున్నారు. అన్నింటితో ఆధార్‌ని లింక్ చేస్తున్నారు. ప్రజలందరూ డేటా సెంటర్లు చుట్టూ తిరగడానికే సరిపోతూ ఉన్నది. వారు సంపాదించిన డబ్బు చాలా మొత్తంలో డేటా సెంటర్లకి ఇచ్చి పెంచి పోషిస్తున్నారు. ఓటు వేయడానికి మాత్రం ఆధార్‌ను కన్సిడర్ చేయడం లేదు. అయితే దొంగ ఓట్లు వేయడానికి అసలు అవకాశం ఉండదు.

- వీరగంట రూపవతి, బొబ్బిలి

### చెత్త సేకరణలో కొత్త పద్ధతులు

మన పర్యావరణ పరిరక్షణ ఇప్పుడు మన ప్రధాన కర్తవ్యంగా మారింది. భూమి, గాలి, వృక్షాలు ప్రాణరక్షణకు చెందినవి. ఏపిలో పొడివ్యర్థాలు, గృహాల నుండి వసూలు చేసినప్పుడే వాటి స్థానంలో వాటికి నిత్యావసరాలు ఇచ్చే పద్ధతి బాగుంది. ఈ గ్రీన్ షాపుల నిర్వహణకు నగరాల్లో వాహనం ద్వారానే ప్రచారం సులువు.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# పసిడిని మించిన పొదుపు లేదిక!

**వినియోగదారులు తమ పాత బంగారానికి సరైన విలువ ఆపాదించుకోగలగటం వారి చేతుల్లోనే ఉంది. చివరికి ప్రభుత్వం స్పష్టమైన నియమాలు, విశ్వసనీయ ధ్రువీకరణ వ్యవస్థలు, అందుబాటులో ఉండే మౌలిక వసతులను కల్పించాలి. కార్పొరేట్ సంస్థలు సాంకేతికత, సరఫరా గొలుసులను అభివృద్ధి చేయాలి. ప్రజలు తమ బంగారాన్ని కేవలం అలంకార వస్తువుగా కాకుండా ఒక ఆర్థిక వనరుగా చూడాలి. ఈ మూడు ఒకే దిశలో వేగంగా ముందుకు సాగితే బంగారం పట్ల భారతీయుల భావోద్వేగంతో కూడిన అనుబంధాన్ని దెబ్బతీయకుండా, విదేశీ మారకాన్ని ఆదా చేసే సమతుల్య విధానం సాధ్యమవుతుంది.**



కృష్ణబాలాజి పల్లపోతు

పశ్చిమాసియా సంక్షోభం ప్రపంచ వ్యాప్తంగా ఆర్థికవ్యవస్థలపై తీవ్రమైన ప్రభావం చూపింది. భారత ప్రభుత్వం తీసుకున్న అనేక ముందుచూపు చర్యలు, సాహసోపేత నిర్ణయాల వల్ల మన దేశ ఆర్థిక పరిస్థితి ఆ స్థాయిలో దెబ్బతినకపోయినా, భారీగా పెరిగిన ముడిచమురు ధరలు, సరఫరా అంతరాయాలు మన విదేశీ మారక నిల్వలపై, రూపాయివిలువపై ఒత్తిడిని పెంచాయి. ఈ నేపథ్యంలో, ప్రధాని మోడీ సికింద్రాబాద్ వేదికగా సూచించిన పొదుపు చర్యలు దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. కార్‌పూలింగ్, ఇంటి నుంచి పనిచేయడం, పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహించడం వంటి సూచనలు ముఖ్యంగా మధ్య, ఉన్నత వర్గాల్లోను, విద్యాధికుల్లోను ప్రత్యామ్నాయమార్గాల అన్వేషణ దిశగా ఆలోచింపజేశాయి. దిగుమతి చేసుకునే రసాయన ఎరువుల వినియోగాన్ని పరిమితం చేయాలన్న సూచనలు, వ్యవసాయ వర్గాల్లో కొంత ఆందోళనతో పాటు ఆత్మవిశ్వాసాన్నీ కలిగించాయి. అయితే సామాజిక, ఆర్థిక స్థాయిలను, గ్రామీణపట్టణ అంతరాలను దాటి వివిధ వర్గాల భారతీయులనూ ఎంతో కొంత ఆలోచింపజేసిన అంశం మాత్రం బంగారం కొనుగోళ్లను వాయిదా వేయాలి అన్న సూచనే. ఎందుకంటే, పాశ్చాత్య దేశాల్లో లాగా భారతీయులకు బంగారం అంటే కేవలం మరో మదుపు ప్రత్యామ్నాయం కాదు, కొందరికి భవిష్యత్తు భద్రత కూడా. ఒక విధంగా భారతీయులు ముఖ్యంగా ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజల నిత్యజీవితంతో బంగారంపై పెట్టుబడులు పెనవేసుకుపోయాయి. అలా అని, కీలకమైన గణాంక వాస్తవం దాగి ఉన్న ప్రధాని సూచనను కూడా కొట్టిపారేయలేం. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రాథమిక అంచనాల ప్రకారం, కేవలం బంగారం దిగుమతులపైనే మన దేశం దాదాపు 72 బిలియన్ డాలర్ల అమూల్యమైన విదేశీ మారక ద్రవ్యాన్ని వెచ్చించింది. దేశాభివృద్ధికి ఇంధనమైన ముడి చమురు తర్వాత అత్యధిక స్థాయిలో విదేశీ మారక ద్రవ్యం ఖర్చువుతున్న రంగం ఇదే. దాదాపు అనుత్పాదక వ్యయంగా పరిగణించబడే పసిడి దిగుమతులను కొంతవరకైనా నియంత్రించగలిగితే, విదేశీ మారక నిల్వలు, రూపాయి విలువలలో కొంత స్థిరత్వం ఏర్పడే అవకాశం ఉంది. కాబట్టి ఇప్పుడు భారతదేశం ముందున్న పెద్ద సందిగ్ధత ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి అలుముకున్న ఈతరుణంలో విదేశీ మారక ద్రవ్యాన్ని పదిలపరచుకోవాలా? లేక దశాబ్దాలుగా కొనసాగుతున్న బంగారం కొనుగోళ్లను కొనసాగించాలా? సమాధానం అంత సులభం కాదు. సమగ్రంగా విశ్లేషిస్తే, ఈ రెండింటినీ సమతుల్యం చేయడం అసాధ్యం కాదనిపిస్తోంది. అప్పులవాడి అప్పు, అల్లుడి కోరిక రెండూ తీర్చవచ్చు. ప్రధాని విజ్ఞప్తిని గౌరవిస్తూనే, పరిమితంగా బంగారం కొనుగోళ్లను కొనసాగించవచ్చు. ఉదాహరణకు తాళిబొట్టు వంటి కొన్ని మంగళకర వస్తువుల్లో తప్ప, పూర్తిగా కొత్త ఆభరణాలనే ఉపయోగించాలన్న నియమం దాదాపుగా ఏ సామాజిక వర్గంలోనూ లేదు. కాబట్టి, ఎవరి మనోభావాలు దెబ్బతినకుండానే పాత బంగారు ఆభరణాల పునర్వినియోగాన్ని ప్రోత్సహించవచ్చు. విశ్వసనీయ అంచనాల ప్రకారం భారతీయ గృహాల్లో సుమారు 4 ట్రిలియన్ డాలర్లకు పైగా విలువ చేసే 30,000 టన్నుల బంగారు ఆభరణాలు పోగుపడి ఉన్నాయి. వీటి పునర్వినియోగం ద్వారా అనేక ప్రయోజనాలు చేకూరుతాయి. ముఖ్యంగా విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుంది. చేతులు మారడం ద్వారా, నిష్క్రియగా పడివున్న బంగారం ఆర్థిక వ్యవస్థలో మరలా భాగస్వామిగా మారుతుంది. ఆభరణాల కొనుగోళ్లను పూర్తిగా వాయిదా వేసుకోవాల్సిన అవసరం ఉండదు. అలాగే



నగల వ్యాపారులు సాధారణంగా విధించే తరుగు, మజూరీ, విలువ ఆధారిత అదనపు ఛార్జీల భారం కూడా చాలావరకు తగ్గుతుంది. అంతేకాదు ఎన్నో దశాబ్దాల క్రితం మన కళాకారులు అపారశ్రమతో తీర్చిదిద్దిన నగిషీ ఆభరణాలను కరిగించకుండా, వారి కళానైపుణ్యాన్ని తదుపరి తరాలకు సజీవంగా అందించినట్లవుతుంది. ఇంట్లో ఉన్న ఆభరణాలను ఏకారణం చేతైనా విక్రయించాలనుకునే వారికి కూడా, కొంత వెసులుబాటు కలుగుతుంది. అయితే ఈ ప్రత్యామ్నాయం ఆచరణలో అనేక ఇబ్బందులు ఎదురవుతాయి. మొట్టమొదటిది హాల్‌మార్కింగ్ సమస్య. బీఐఎస్ వంటి విశ్వసనీయ సంస్థ బంగారం స్వచ్ఛతను నిర్ధారించి, ప్రామాణీకరించడాన్ని హాల్‌మార్కింగ్ అంటారు. ఉదాహరణకు, 22 క్యారెట్ల నాణ్యతను 916ప్రమాణంతో సూచిస్తారు. అంటే, ప్రతి 1000 గ్రాముల ఆభరణం బరువులో, 916 గ్రాముల చొప్పున మేలిమి బంగారం ఉన్నదన్నమాట. కొత్తగా తయారైన ఆభరణాల హాల్‌మార్కింగ్ వ్యవస్థ మనదేశంలో ఇప్పటికే వేళ్లూనుకుంది. దానికి స్పష్టమైన మార్గదర్శకాలు, వినియోగదారుల్లో తగినంత అవగాహనఉన్నాయి. వాడిన ఆభరణాలకు హాల్‌మార్కింగ్ సాధ్యమేనా అనే ప్రశ్నకు సమాధానం 'అసాధ్యం మాత్రం కాదు'. అమెరికా, యూరప్, మధ్యప్రాచ్య దేశాల్లో పాతఆభరణాల కొనుగోలు- అమ్మకాల కోసం ప్రత్యేక ధ్రువీకరణ వ్యవస్థలు, నాణ్యత పరీక్షా కేంద్రాలు, ప్రామాణిక ప్రాథమిక విలువ నిర్ధారణ విధానాలు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా ఎక్స్‌రే ఫ్లోరసెన్స్ వంటి పద్ధతుల ద్వారా, ఆభరణాలను కరిగించకుండానే వాటి స్వచ్ఛతను నిర్ధారిస్తున్నారు. స్విట్జర్లాండ్ వంటి దేశాల్లో బంగారు ఆభరణాల పునర్వినియోగం, వాటి నాణ్యత ధ్రువీకరణకు ప్రత్యేకప్రమాణాలు అమలులో ఉన్నాయి. అనేక రంగాల్లో అధునాతన సాంకేతికత అందుబాటులో ఉన్న భారత్, ఆయావిధానాలను సమగ్రంగా అధ్యయనంచేయాలి. ఎక్స్‌రే ఫ్లోరసెన్స్ యంత్రాలు సుమారు 15 మైక్రాన్ల కంటే తక్కువమందం కలిగిన పైపొర వరకే దృష్టి సారించగలవు. లోపల మరోపదార్థం ఉండే అవకాశాన్ని పూర్తిగా తోసిపుచ్చలేం. అందుకే, అనేక ప్రాంతాల్లో ఇటువంటి పరీక్షలను తుది నిర్ధారణగా కాకుండా, సుమారు అంచనాగా మాత్రమే పరిగణిస్తారు. అందువల్లే, పాత ఆభరణాలకు పూర్తిస్థాయి హాల్‌మార్కింగ్ చేసే వ్యవస్థను అమలు చేసే దిశగా, అనేక దేశాలు ఇప్పటికీ ఆచితూచి అడుగులు వేస్తున్నాయి. అయితే, భారతదేశంలో ఇందుకు పునాదులు పూర్తిగా లేవనడం సరైందికాదు. బీఐఎస్ గుర్తింపు పొందిన కేంద్రాల్లో హాల్‌మార్క్ ఉన్నవాటితో పాటు, హాల్‌మార్క్ లేని పాత ఆభరణాలను కూడా పరీక్షించే సౌకర్యం ఇప్పటికే ఉంది. ఈ కేంద్రాలు పాత ఆభరణాలకు ప్రధానంగా పరీక్షా నివేదికలనే ఇస్తున్నాయి. వాటికి కొత్త ఆభరణాల మాదిరిగా సమగ్రమైన హాల్‌మార్కింగ్ చేసే వ్యవస్థ ఇంకా పరిపక్వత చెందలేదు. ప్రతి ఆభరణానికి ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయించే హ్యూఐడీ ఆధారిత డిజిటల్ గుర్తింపు విధానం విస్తరిస్తున్నప్పటికీ, అది ఇప్పటికీ ప్రధానంగా కొత్త ఆభరణాలకే పరిమితమై ఉంది. అయితే, ఇప్పటికే దేశంలోని తమిళనాడు వంటి కొన్ని ప్రాంతాల్లో స్వయంచాలిత కియోస్క్‌ల వంటి యంత్రాలు పని చేస్తున్నాయి. వాటి సహాయంతో పాత బంగారు ఆభరణాల స్వచ్ఛతను ప్రాథమికంగా పరీక్షించి, వినియోగదారుల గుర్తింపును ధ్రువీకరించి, వాటిపై క్షణాల్లో రుణాలు మంజూరు చేసేవ్యవస్థలు అమలులోకి వస్తున్నాయి. ఒక యంత్రం ఆభరణం క్యారెట్ విలువను సుమారుగా నిర్ధారించి రుణవితరణ చేయగలుగుతున్నప్పుడు 'వాడిన ఆభరణాల స్వచ్ఛతను ధ్రువీకరించే వ్యవస్థను అభివృద్ధి చేయడం ఎందుకు సాధ్యపడదు' అన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. అయితే, రుణాల మంజూరుకు ఉపయోగించే ప్రాథమిక స్వచ్ఛత అంచనా, చట్టపరమైన బాధ్యతతో కూడిన అధికారిక హాల్‌మార్కింగ్ రెండూ ఒకటి కావు. వినియోగదారులు తమ పాత బంగారానికి సరైన విలువ ఆపాదించుకోగలగటం వారి చేతుల్లోనే ఉంది. చివరికి ప్రభుత్వం స్పష్టమైన నియమాలు, విశ్వసనీయ ధ్రువీకరణ వ్యవస్థలు, అందుబాటులో ఉండే మౌలిక వసతులను కల్పించాలి. కార్పొరేట్ సంస్థలు సాంకేతికత, సరఫరా గొలుసులను అభివృద్ధి చేయాలి. ప్రజలు తమ బంగారాన్ని కేవలం అలంకార వస్తువుగా కాకుండా ఒక ఆర్థిక వనరుగా చూడాలి. ఈమూడు ఒకే దిశలో వేగంగా ముందుకు సాగితే బంగారం పట్ల భారతీయుల భావోద్వేగంతో కూడిన అనుబంధాన్ని దెబ్బతీయకుండా, విదేశీ మారకాన్ని ఆదా చేసే సమతుల్య విధానం సాధ్యమవుతుంది. ●

# కులవృత్తి నుంచి విముక్తే అభివృద్ధి

పాపని నాగరాజు

కర్ణాటకలోని హాసన్ జిల్లాలో స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని ఒక ప్రాంతీయ సమస్యగా చూడటం సరైంది కాదు. ఇది దేశవ్యాప్తంగా చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కోట్లాది కుటుంబాలు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక సంక్షోభానికి ప్రతీక. స్వర్ణకారులు, వడ్రంగులు, కమ్మరులు, కుమ్మరులు, కంసాలీలు, చేనేత కార్మికులు, మత్స్యకారులు, క్షురకులు, ధోబీలు ఇలా అనేక వర్గాలు నేడు మార్కెట్ మార్పులు, కార్పొరేట్ పోటీ, సాంకేతిక పరిణామాల ఒత్తిడిలో నిలదొక్కుకోవడానికి పోరాడుతున్నాయి. ఈ పరిస్థితిని కేవలం మార్కెట్ మందగమనం, ధరల పెరుగుదల లేదా కార్పొరేట్ పోటీతో మాత్రమే అర్థం చేసుకోవడం సరిపోదు. దీని వెనుక భారతీయ సమాజాన్ని శతాబ్దాలుగా నియంత్రించిన కులాధారిత వృత్తి నిర్మాణం ఉంది. ఇది కేవలం ఆర్థిక వ్యవస్థ సంక్షోభం కాదు, సామాజిక నిర్మాణ సంక్షోభం. భారతదేశంలో అనేక చేతివృత్తులు అనువంశికంగా కులాలకు కట్టబెట్టబడ్డాయి. బ్రాహ్మణీయభూస్వామ్య వ్యవస్థ ఈ కులానికి ఈ వృత్తి అనే భావజాలాన్ని కేవలం సామాజిక నియమంగా మాత్రమే కాకుండా మానసిక పరిమితిగా కూడా ప్రజలలో నిక్షిప్తం చేసింది. ఫలితంగా తరతరాలుగా అనేక వర్గాలకు వృత్తి మార్పు, కొత్త రంగాల వైపు అడుగులు వేయడం, మారుతున్న ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా తమను తాము మలుచుకోవడం అనే ఆలోచనే దూరమైంది. ఇదే సమయంలో సమాజంలోని ఆధిపత్య వర్గాలు, అగ్రవర్ణాలు, విద్యా ఆర్థిక అవకాశాలు పొందిన కొన్ని శూద్ర వర్గాలు మారుతున్న ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకుని తమ వృత్తులను మార్చుకున్నాయి. ప్రపంచంలోని అనేక దేశాల్లో సంప్రదాయ వృత్తులు కాలానుగుణంగా కొత్త రూపాలను దాల్చగా, మన దేశంలో కులంవృత్తి అనుబంధం దీర్ఘకాలంగా కొనసాగింది. అందుకే మార్పు అవకాశాలు అందరికీ సమానంగా అందలేదు. ఆధునికీకరణ పేరుతో కుల పునర్నిర్మాణం కొన్ని ప్రాంతాల్లో ఈ బంధనాలు కొంతవరకు బలహీనపడ్డాయి. చీరాల, సిరిసిల్ల, పోచంపల్లి, ధర్మవరం వంటి చేనేత కేంద్రాల్లో వృత్తి కులపరిమితిని దాటి సామాజిక ఉత్పత్తిగా మారింది. పట్టణాల్లో సెలూన్లు, లాండ్రీలు, ఇతర సేవారంగాల్లో కులాంతర ప్రవేశం పెరిగింది. ఇవి సానుకూల సంకేతాలే. భారతదేశం వంటి భారీ జనాభా దేశంలో ఆర్థికాభివృద్ధిని కొద్దిమంది కార్పొరేట్ లాభాలతో కొలవడం తీవ్రమైన పొరపాటు. మెజారిటీ ప్రజల జీవనోన్నతి, వారి నైపుణ్యాల విస్తరణ, వారి ఆర్థిక స్వావలంబన పెరగడమే నిజమైన అభివృద్ధి. ఈదేశంలో చేతి వృత్తులపై, శ్రమఆధారిత రంగాలపై ఆధారపడి జీవిస్తున్న వారే విస్తృత జనాభా. అందువల్ల వారి అభివృద్ధే దేశ అభివృద్ధికి అసలు ప్రమాణం కావాలి. నేడు సాంకేతికత, కృత్రిమమేధస్సు, ఆటోమేషన్ వంటి మార్పులు కొద్దిమందికి లాభం చేకూర్చేందుకు కాదు, చేతివృత్తుల ప్రజలను కొత్త నైపుణ్యాలతో శక్తివంతులుగా మార్చేందుకుఉపయోగపడాలి. వారికి ఆధునిక విద్య, సాంకేతిక శిక్షణ, మార్కెట్ అనుసంధానం, ప్రత్యా మ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించడం పాలకులబాధ్యత. పాలకులు అనుసరించాల్సింది కులాన్ని నిలబెట్టే విధానంకాదు, కులబంధనాలను అధిగమించేప్రజా కేంద్రిక అభివృద్ధి. హాసన్ స్వర్ణకారుల సమస్య మనకు ఒక స్పష్టమైన పాఠం చెబుతోంది. చేతివృత్తుల సంక్షోభం కేవలంమార్కెట్ సంక్షోభం కాదు. అది కులాధారిత వృత్తి నిర్మాణం, అస మాన అభివృద్ధి, విముక్తిలేని ఆధునీకరణ కలిపి సృష్టించిన జాతీయ సంక్షోభం. దీనికి పరిష్కారం కులాన్ని ఆధునికీ కరించడం కాదు, కులాన్ని అధిగమించి, వృత్తిని స్వేచ్ఛా ఎంపికగా మార్చే సామాజిక, ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని నిర్మించడం. వ్యక్తి తన జన్మతో కాదు, తన ఎంపికతో వృత్తిని నిర్ణయించుకునే స్వేచ్ఛను కల్పించడమే నిజమైన అభివృద్ధి. కులవృత్తి నుంచి విముక్తే అభివృద్ధి. ●

# 'చెత్త' సమస్యకు శాశ్వత పరిష్కారం ఎప్పుడు?

డివిబి శ్రీ హరిన్

భారత్‌లో ప్లాస్టిక్ నిషేధంపై ప్రతి సంవత్సరం కొత్త ప్రకటనలు వస్తుంటాయి. కొన్ని ఉత్పత్తులపై నిషేధాలు, ప్రత్యేక తనిఖీలు, జరిమానాలు, అవగాహన కార్యక్రమాలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. అయినప్పటికీ మార్కెట్‌లో ప్లాస్టిక్ వినియోగం ఆశించిన స్థాయిలో తగ్గడం లేదు. దీనికి ప్రధాన కారణం, భారత్ ఇప్పటికీ ప్లాస్టిక్ సమస్యను కేవలం ఒక 'చెత్త సమస్య'గా మాత్రమే చూడడం. కానీ ప్రపంచంలోని అనేక అభివృద్ధి చెందిన దేశాలు ఇప్పటికే దీనిని ఉత్పత్తి, మార్కెట్ రూపకల్పన సమస్యగా గుర్తించి, ఆ దిశగా అడుగులు వేయడం ప్రారంభించాయి. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి అంచనాల ప్రకారం, దేశంలో ప్రతి సంవత్సరం సుమారు 34 లక్షల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఈ సంఖ్యలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాటా చాలా పెద్దది. అయితే అసలు ప్రమాదం కేవలం సంఖ్యలో మాత్రమే లేదు. భారత మార్కెట్‌లో వేగంగా పెరుగుతున్న తక్కువ విలువ గల ప్లాస్టిక్‌లో ఉంది. చిప్స్ ప్యాకెట్లు, స్నాక్ ర్యాపర్లు, షాంపూ సాచెట్లు, పలుచని క్యారీ బ్యాగులు వంటివి తక్కువ ఖర్చుతో భారీగా ఉత్పత్తి అవుతున్నాయి. కానీ రీసైక్లింగ్ వ్యవస్థకు ఇవి దాదాపు ఉపయోగం లేని వ్యర్థాలు. అంటే ఇవి మార్కెట్‌కు లాభాన్ని చేకూరుస్తుండగా, వ్యర్థాల నిర్వహణ వ్యవస్థకు పెను భారంగా మారుతున్నాయి. భారత్‌లో ప్లాస్టిక్ వినియోగం పెరగడానికి కేవలం జనాభా మాత్రమే కారణం కాదు. గత పదేళ్లలో వినియోగ ఆర్థిక వ్యవస్థ స్వభావమే పూర్తిగా మారిపోయింది. ఈకామర్స్, ఫుడ్‌డెలివరీ, తక్కువ ధర కలిగిన ఎఫ్ఎమ్‌సిజి (ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్) ఉత్పత్తులు, వేగవంతమైన రిటైల్ మోడల్స్ ప్లాస్టిక్‌ను ఒక అనివార్యమైన సౌకర్యంగా మార్చేశాయి. ఒక సాధారణ ఆన్‌లైన్ ఆర్డర్ వినియోగదారుడి ఇంటికిచేరేలోపు మూడు లేదా నాలుగు రకాల ప్లాస్టిక్ పొరలలో చుట్టబడి వస్తోంది. నేడు ప్లాస్టిక్ అనేది మార్కెట్‌లో ఒక ఎంపిక మాత్రమే కాకుండా అది ఒక డిఫాల్ట్ వ్యవస్థగా మారిపోయింది. ఈనేపథ్యంలో 2022లో కేంద్రప్రభుత్వం 19రకాల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులపై నిషేధం అమలు చేసింది. చట్టపరంగా ఇది ఒక ముఖ్యమైన అడుగు అయినప్పటికీ, అమలు స్థాయిలో ఒక పెద్ద వైరుధ్యం కనిపిస్తోంది. మెట్రోనగరాల్లో తనిఖీలు, జరిమానాలు కనిపిస్తున్నా, చిన్న పట్టణాల్లో, గ్రామీణ మార్కెట్లలో అదేప్లాస్టిక్ ఇంకా సులభంగా లభిస్తోంది. దీనికి కారణం కేవలం అమలు లోపం మాత్రమే కాదు, తగిన ప్రత్యామ్నాయ మార్కెట్ ఇంకా



పూర్తిగా సిద్ధం కాకపోవడం ప్రపంచ దేశాల అనుభవాలు భారత్‌కు స్పష్టమైన పాఠాలను నేర్పుతున్నాయి. రువాండా, కెన్యా వంటి ఆఫ్రికన్ దేశాలు ప్లాస్టిక్ బ్యాగులపై అత్యంత కఠినమైన నిషేధాన్ని అమలు చేశాయి. కెన్యాలో ప్లాస్టిక్ బ్యాగుల ఉత్పత్తి, విక్రయం లేదా నిల్వ చేయడం కూడా శిక్షార్హమైన నేరాలుగా మార్చారు. ప్రారంభంలో తీవ్ర వ్యతిరేకత, అక్రమ రవాణా పెరిగినప్పటికీ ప్రభుత్వం అమలు విషయంలో వెనక్కితగ్గలేదు. ఫలితంగా కొన్ని సంవత్సరాల తర్వాత అక్కడ పట్టణ పరిశుభ్రతలో అద్భుతమైన మార్పులు వచ్చాయి. అయితే ఆఫ్రికన్ దేశాల మోడల్‌ను భారత్‌లో నేరుగా అమలు చేయడం దాదాపు అసాధ్యం. దీనికి కారణం భారత మార్కెట్ నిర్మాణం. దేశంలోని లక్ష లాది చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులు, చిన్న ప్యాకేజింగ్ యూనిట్లు ఇప్పటికీ చౌకైన ప్లాస్టిక్‌పైనే ఆధారపడి ఉన్నాయి. ఒక చిన్న టీ దుకాణం లేదా కూరగాయల వ్యాపారికి పేపర్ లేదా బయోడిగ్రేడబుల్ ప్రత్యామ్నాయాలు వెంటనే భరించగల ఖర్చుతో కూడుకున్నవి కావు. కాబట్టి భారత్‌లో కేవలం కఠిన నిషేధం మాత్రమే పరిష్కారం చూపలేదు. యూరోపియన్ యూనియన్ ఈ సమస్యను ఎదుర్కోవడానికి ఎక్స్టెండెడ్ ప్రొడ్యూసర్ రెస్పాన్సిబిలిటి (ఇపిఆర్) అనే విధానాన్ని అనుసరించింది. మార్కెట్‌లో ప్లాస్టిక్ ఉత్పత్తులను విడుదలచేసే కంపెనీలే వాటివ్యర్థాల నిర్వహణ బాధ్యతను కూడా తీసుకోవాలని ఈ విధానం చెబుతుంది. ప్లాస్టిక్ వల్ల కలిగే పర్యావరణ నష్టానికి అయ్యే ఖర్చును కేవలం సమాజం మాత్రమే కాకుండా, దాని ద్వారా లాభపడుతున్న పరిశ్రమలు కూడా భరించాలన్నదే దీని వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. మనదేశంలో కూడా ఇపిఆర్ విధానం ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో దీనిఅమలు ఇంకా బలహీనంగా ఉంది. అనేక కంపెనీలుకాగితాలపై రీసైక్లింగ్ లక్ష్యాలను చూపిస్తున్నావాటి వాస్తవ ధృవీకరణ వ్యవస్థ పరిమితంగానే ఉంది. ముఖ్యంగా మల్టీలేయర్ ప్లాస్టిక్ విషయంలో పరిస్థితి క్లిష్టంగా ఉంది. చిప్స్ ప్యాకెట్లు, బిస్కెట్ ర్యాపర్లు వంటివి సాంకేతికంగా రీసైకిల్ చేయగలిగినా ఆర్థికంగా అవి లాభదాయకం కావు. అందుకే ఇవి చివరికి డంప్ యార్డులు, కాలువలు లేదా కాల్చివేత కేంద్రాలకే చేరుతున్నాయి. దీనికి తోడు పట్టణ వ్యర్థాల నిర్వహణలో ఉన్న లోపాలు సమస్యను మరింత పెంచుతున్నాయి. మూలస్థాయిలో చెత్త వర్గీకరణ సరిగ్గా జరగకపోవడం వల్ల రీసైక్లింగ్ సామర్థ్యం దెబ్బతింటోంది. 'కేవలం ప్లాస్టిక్‌ను నిషేధించడం కంటే, అందుబాటులోఉన్న ప్లాస్టిక్‌ను సమర్థవంతంగా తిరిగి వినియోగించుకునేలా మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం అత్యవసరం. ఇందులో భాగంగా నగరాల్లోని ప్రతి వార్డులోనూ ఆధునిక 'మెటీరియల్ రికవరీ ఫెసిలిటీస్' ఏర్పాటు చేసి, ప్లాస్టిక్‌ను శాస్త్రీయంగా వర్గీకరించి పరిశ్రమలకు ముడిసరుకుగా అందించాలి. దీనివల్ల వ్యర్థాల పరిమాణం గణనీయంగా తగ్గుతుంది. అలాగే రీసైకిల్ చేయలేని ప్లాస్టిక్‌ను తారురోడ్ల నిర్మాణంలో వాడటంలేదా ప్లాస్టిక్‌నుండి ఇంధనాన్నితయారు చేసే ప్లాంట్లను ఏర్పాటు చేయడంద్వారా పర్యావరణ కాలుష్యాన్ని అరికడుతూనే వ్యర్థాలనుండి సంపదను సృష్టించవచ్చు. ●

తెలంగాణ ప్రభుత్వం

## రెవెన్యూ (LA) శాఖ

రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయం వికారాబాద్,
వికారాబాద్ జిల్లా

### ఫారం-VII

**(చట్టం-30/2013లోని రూల్-25లో గల సబ్-రూల్ (1) మరియు సెక్షన్ 19(1)ను చూడండి)**

### డిక్లరేషన్

జిల్లా కలెక్టర్ కార్యాలయం ఫైల్ నంబర్.: ఇ/2754/2025 తేది: 19.05.2026
రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం ఫైల్ నెంబర్.: బి/16545/2025 తేది: .05.2026
గజెట్ నంబర్.: వికెబి-56/2026 తేది: 19.05.2026

వికారాబాద్ జిల్లా, దోమ మండలం, మోత్కూర్ గ్రామంలో గల మొత్తం **Ac. 28.3750 Gts** ఎకరాల భూమి NH-167N పై బుద్వేల్ వద్ద గల ఔటర్ రోడ్ (ORR) నుండి నాచారం వరకు 81 కిమీ పొడవు రేడియల్ రోడ్ -2 ఏర్పాటు కొరకు ప్రజా ప్రయోజనార్థం అవసరమై ఉన్నదని తెలంగాణ ప్రభుత్వం / కలెక్టర్ వారు భావిస్తున్నారు.

అందువలన, వికారాబాద్ జిల్లా, దోమ మండలం, మోత్కూర్ గ్రామంలో పై సదరు ప్రాజెక్ట్ కొరకు సేకరణ క్రింద భూమి **Ac. 28.3750 Gts** అనగా 11.48 హెక్టార్లు ప్రామాణిక కొలతలతో ఎక్కువ లేదా తక్కువ భూమి యొక్క సవివర వివరణ దిగువ విధంగా ఉన్నది.

### షెడ్యూలు

జిల్లా : వికారాబాద్ మండలము : దోమ గ్రామం : మోత్కూర్

| క్రమ సంఖ్య | సర్వే నెంబర్ | భూ స్వభావం | భూమి రకం | భూ సేకరణ క్రింద తీసుకోబడిన విస్తీర్ణం (ఎకరములలో) | పట్టాదారుని పేరు | సరి హద్దులు | | | | చెట్లు | | కట్టడములు | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | తూర్పు | పడమర | ఉత్తరం | దక్షిణం | రకం | సంఖ్య | కట్టడము | పునాది విస్తీర్ణం |
| 1 | 58/ఈ/2 | పట్టా | ఖుష్కి | 1.10 | పట్టాదారులు : చింతలరాజేష్ కుమార్ తండ్రి : ప్రభులింగం సాగుదారు: 1. కొత్త రాములు 2. కొత్త ఆంజనేయులు | 62 | వి.బి పాలేపల్లి | 69 | 57 | - | - | - | - |
| 2 | 64 | పట్టా | ఖుష్కి | 0.01 | పట్టాదారులు : 1. శేమీమ్ బేగం భర్త : బషిరోద్దీన్ 2. పొరల్లా మంజుల భర్త : శ్రీనివాస్, 3. బంటారం యల్లమ్మ భర్త : పెద్దమల్లయ్య 4. గాజుల సాజిద బేగం భర్త : మునిరోద్దీన్ సాగుదారు: పిచకుంట్ల అంజిలయ్య | 78 | 68 | 65 | 63 | - | - | - | - |
| 3 | 65 | పట్టా | ఖుష్కి | 1.10 | పట్టాదారులు : 1.పొరల్లా మంజుల భర్త: శ్రీనివాస్ 2. శేమీమ్ బేగం భర్త: బషిరోద్దీన్ 3. గాజుల సాజిద బేగం భర్త: మునీరుద్దీన్ 4. బంతారం యల్లమ్మ భర్త : పెద్దమల్లయ్య, సాగుదారు: పిప్పకుంట్ల శ్రీను, నర్సిములు, శ్రీకాంత్ | 75 | 68 | 66 | 64 | - | - | - | - |
| 4 | 66 | పట్టా | ఖుష్కి | 0.15 | పట్టాదారులు : 1. పొరల్లా మల్లయ్య తండ్రి: బసప్ప 2. శేమీమ్ బేగం భర్త : బషిరోద్దీన్ 3. గాజుల సాజిద బేగం భర్త : మునిరోద్దీన్ 4. పరిదా బేగం భర్త :పయాజ్అలి సాగుదారు: పిప్పకుంట్ల అంజిలయ్య, శ్రీను, నర్సిములు, శ్రీకాంత్ | 75 | 67 | 72 | 65 | - | - | - | - |
| 5 | 67 | పట్టా | ఖుష్కి | 0.005 | పట్టాదారులు : 1. పొరల్లా మల్లయ్య తండ్రి: బసప్ప 2. శేమీమ్ బేగం తండ్రి: బషిరోద్దీన్ 3. గాజుల సాజిదబేగం భర్త : మునిరోద్దీన్ 4. పరిదా బేగం భర్త :పయాజ్అలి, సాగుదారు: పిప్పకుంట్ల అంజిలయ్య, శ్రీను, నర్సిములు, శ్రీకాంత్ | 66 | 69 | 71 | 68 | - | - | - | - |
| 6 | 68 | పట్టా | ఖుష్కి | 0.30 | పట్టాదారులు : పిప్పకుంట్ల శ్రీనివాస్ తండ్రి : నర్సిములు, సాగుదారు: 1. పిప్పకుంట్ల శ్రీను, 2. పిప్పకుంట్ల నర్సిములు, 3. పిప్పకుంట్ల శ్రీకాంత్, 4. పిప్పకుంట్ల అంజిలయ్య | 70 | 58 | 67 | విబి ఖమ్మం నాచారం | మర్రి చెట్టు | 1 | బోరు బావి పైపు లైను | 1, 200 Mts |
| 7 | 69/2 | పట్టా | ఖుష్కి | 2.33 | పట్టాదారులు : మహమూద్ మహబూబ్ తండ్రి : ఫయాజలీ సాగుదారు: 1. ప్రభు లింగం 2. రాజేష్ | 67-68 | వి.బి పాలేపల్లి | 70 | 58 | - | - | - | - |
| 8 | 69/4 | పట్టా | ఖుష్కి | 2.09 | బంటారం చిన్నయ్య తండ్రి: పెద్ద మల్లయ్య | 67-68 | వి.బి పాలేపల్లి | 70 | 58 | - | - | - | - |
| 9 | 69/ఇ/1 | పట్టా | ఖుష్కి | 0.26 | పిప్పకుంట్ల నర్సింలు తండ్రి: యల్లప్ప | 67-68 | వి.బి పాలేపల్లి | 70 | 58 | - | - | బోరు బావి | 1 |
| 10 | 74/7 | పట్టా | ఖుష్కి | 0.22 | గునిగారి రాములు తండ్రి: గునిగారి సాయన్న | 76 | 73 | వి.బి ఖమ్మం నాచారం | 75 | - | - | - | - |
| 11 | 74/ఔ | పట్టా | ఖుష్కి | 0.09 | పట్టాదారు : పొరల్ల అనంతయ్య తండ్రి: సాయన్న సాగుదారు: దేశపోగుల సత్యమ్మ | 76 | 73 | వి.బి ఖమ్మం నాచారం | 75 | - | - | - | - |
| 12 | 74/2 | పట్టా | ఖుష్కి | 0.21 | సలీం సాబ్ తండ్రి:మహబూబ్ సాబ్ | 76 | 73 | వి.బి ఖమ్మం నాచారం | 75 | మామిడి చెట్లు | 20 | బోరు బావి | 1 |
| 13 | 74/అ | పట్టా | ఖుష్కి | 1.14 | పొరల మల్లమ్మ భర్త: సారంగి | 76 | 73 | వి.బి ఖమ్మం నాచారం | 75 | - | - | - | - |
| 14 | 74/4 | పట్టా | ఖుష్కి | 0.06 | సైదుపల్లి నర్సింలు తండ్రి :పాపయ్య | 76 | 73 | వి.బి ఖమ్మం నాచారం | 75 | - | - | - | - |
| 15 | 74/ఆ | పట్టా | ఖుష్కి | 0.08 | పొరల్ల అనంతయ్య తండ్రి : సాయన్న | 76 | 73 | వి.బి ఖమ్మం నాచారం | 75 | - | - | - | - |
| 16 | 75/ఆ/4 | పట్టా | ఖుష్కి | 0.04 | పిప్పకుంట్ల నర్సింలు తండ్రి : యల్లప్ప | 77 | 66-65 | 74 | 78 | - | - | - | - |
| 17 | 75/ఆ/5/1 | పట్టా | ఖుష్కి | 0.24 | గుండాల మల్లమ్మ భర్త: దస్తయ్య | 77 | 66-65 | 74 | 78 | మామిడి చెట్లు చింత చెట్లు కొబ్బరి చెట్లు | 15, 14, 1 | బోరు బావి షెడ్డు | 1, 1 |
| 18 | 75/ఆ/5/2 | పట్టా | ఖుష్కి | 2.20 | గుండాల హనుమంతు తండ్రి : దస్తప్ప | 77 | 66-65 | 74 | 78 | - | - | - | - |
| 19 | 75 | పట్టా | ఖుష్కి | 0.04 | పట్టాదారులు : 1.పొరల మల్లమ్మ భర్త : సారంగి, 2. చెన్నమ్మ భర్త : సవ్వర్ల మొగులయ్య, 3. మజ్జిగా మల్లమ్మ భర్త : సత్యయ్య, 4.సావ్వర్ల చెంద్రమ్మ భర్త : పెంటయ్య, 5. పిప్పకుంట్ల నర్సింలు తండ్రి : యల్లప్ప, 6. దేశపోగుల సత్యమ్మ భర్త : బిచ్చయ్య, 7.పొరల్ల అనంతయ్య తండ్రి : సాయన్న, 8. మజ్జిగా మల్లమ్మ భర్త : సత్యయ్య. సాగుదారు: 1.గుండాల మల్లమ్మ భర్త : దస్తయ్య, 2. గుండాల హనుమంతు తండ్రి : దస్తప్ప | 77 | 66-65 | 74 | 78 | - | - | - | - |
| 20 | 75/అ | పట్టా | ఖుష్కి | 0.09 | పట్టాదారు : పొరల్ల అనంతయ్య తండ్రి : సాయన్న సాగుదారు : సలీం | 77 | 66-65 | 74 | 78 | - | - | - | - |
| 21 | 75/అ | పట్టా | ఖుష్కి | 0.03 | పట్టాదారు : పొరల్ల అనంతయ్య తండ్రి : సాయన్న సాగుదారు : పొరాల రాములు | 77 | 66-65 | 74 | 78 | - | - | - | - |
| 22 | 75/ఆ/4అ | పట్టా | ఖుష్కి | 0.05 | దేశపోగుల సత్యమ్మ భర్త : బిచ్చయ్య | 77 | 66-65 | 74 | 78 | - | - | - | - |
| 23 | 76/ఇ/1/1 | పట్టా | ఖుష్కి | 0.22 | పొరల మల్లమ్మ భర్త : సారంగి | 514 | 74 | 77 | విబి ఖమ్మం నాచారం | - | - | - | - |
| 24 | 76/ఉ/1/1/1 | పట్టా | ఖుష్కి | 0.30 | పొరల్ల అనంతయ్య తండ్రి : సాయన్న | 514 | 74 | 77 | విబి ఖమ్మం నాచారం | - | - | బోరు బావి | 2 |
| 25 | 76/ఈ/1/1 | పట్టా | ఖుష్కి | 2.02 | పట్టాదారు : పొరల్లా మల్లయ్య తండ్రి : బసప్ప సాగుదారు : పొరల్ల అనంతయ్య తండ్రి : సాయన్న | 514 | 74 | 77 | విబి ఖమ్మం నాచారం | - | - | - | - |
| 26 | 76 | పట్టా | ఖుష్కి | 0.01 | రోడ్డు | 514 | 74 | 77 | విబి ఖమ్మం నాచారం | - | - | - | - |
| 27 | 112 | పట్టా | ఖుష్కి | 0.04 | కాలువ | 114 | విబి ఖమ్మం నాచారం | విబి ఖమ్మం నాచారం | 109 | - | - | - | - |
| 28 | 112/అ/1/2 | పట్టా | ఖుష్కి | 0.03 | పట్టాదారు : గోగ్గి రాములమ్మ భర్త : గోగ్గి రాములు సాగుదారు : మేడిపల్లి రామచంద్రయ్య | 114 | విబి ఖమ్మం నాచారం | విబి ఖమ్మం నాచారం | 109 | - | - | - | - |
| 29 | 112/అ/1/1/1 | పట్టా | ఖుష్కి | 0.17 | మేడిపల్లి నర్సమ్మ భర్త : మల్లయ్య | 114 | విబి ఖమ్మం నాచారం | విబి ఖమ్మం నాచారం | 109 | - | - | - | - |
| 30 | 112 | పట్టా | ఖుష్కి | 0.12 | పట్టాదారులు : 1. మేడిపల్లి నర్సమ్మ భర్త : మల్లయ్య 2. మేడిపెల్లి అంజిలయ్య తండ్రి :మొగులయ్య మేడిపల్లి 3. పవార్ సీతా బాయి భర్త : పవార్ గోపాల్, 4. ఎం.డి. సర్దార్, తండ్రి : ఎం.డి.జహంగీర్, 5. మేడిపల్లి రాములమ్మ భర్త : మేడిపల్లి అనంతయ్య, 6. మేడిపల్లి శ్రీనివాస్ తండ్రి : మేడిపల్లి దస్తయ్య, 7. ఎం నర్సింహ్మలు తండ్రి : మేడిపల్లి ఆశప్ప, 8. వాదిత్యవత్ సోనా భర్త : వాదిత్యవత్ సోమలు, 9. వద్యా పికిలి బాయి భర్త : అంజిలయ్య, 10. కె మానికిబాయి భర్త : దేవా, 11. దొరిశెట్టి శివకుమార్ తండ్రి : బుచ్చిలింగం, 12. మేడిపల్లి రాములు తండ్రి : మేడిపల్లి దస్తయ్య, 13. కొత్త వెంకట్ రెడ్డి తండ్రి : కొత్తయాదిరెడ్డి, 14. గోగ్గి రాములమ్మ భర్త : గోగ్గి రాములు, 15. మేడిపల్లి రాములు తండ్రి : మేడిపల్లి దస్తయ్య, 16. మేడిపల్లి శ్రీనివాస్ తండ్రి : మేడిపల్లి దస్తయ్య, సాగుదారు: మేడిపల్లి రామచంద్రయ్య | 114 | విబి ఖమ్మం నాచారం | విబి ఖమ్మం నాచారం | 109 | - | - | - | - |
| 31 | 112/అ/1/1/2 | పట్టా | ఖుష్కి | 0.14 | మేడిపెల్లి అంజిలయ్య తండ్రి : మొగులయ్య మేడిపల్లి | 114 | విబి ఖమ్మం నాచారం | విబి ఖమ్మం నాచారం | 109 | - | - | - | - |
| 32 | 112/అ/1/2 | పట్టా | ఖుష్కి | 1.05 | గోగ్గి రాములమ్మ భర్త : గోగ్గి రాములు | 114 | విబి ఖమ్మం నాచారం | విబి ఖమ్మం నాచారం | 109 | - | - | ఆర్ సి సి ఇల్లు | 1 |
| 33 | 112 | పట్టా | ఖుష్కి | 0.01 | రోడ్డు | 114 | విబి ఖమ్మం నాచారం | విబి ఖమ్మం నాచారం | 109 | - | - | - | - |
| 34 | 113/అ | పట్టా | ఖుష్కి | 1.08 | పట్టాదారులు : గోగ్గి మొగులయ్య తండ్రి : చంద్రయ్య సాగుదారు : రాములమ్మ భర్త : రాములు | 116 | విబి ఖమ్మం నాచారం | 128 | 114 | - | - | బోరు బావి | 1 |
| 35 | 113 | పట్టా | ఖుష్కి | 0.015 | రోడ్డు | 116 | విబి ఖమ్మం నాచారం | 128 | 114 | - | - | - | - |
| 36 | 113/ఇ | పట్టా | ఖుష్కి | 1.055 | పట్టాదారులు : అంజిలయ్య జి తండ్రి: చంద్రయ్య, సాగుదారు: జి. రాములమ్మ భర్త : రాములు | 116 | విబి ఖమ్మం నాచారం | 128 | 114 | - | - | - | - |
| 37 | 113 | పట్టా | ఖుష్కి | 0.07 | రోడ్డు | 116 | విబి ఖమ్మం నాచారం | 128 | 114 | - | - | - | - |
| 38 | 113/అ | పట్టా | ఖుష్కి | 0.09 | నేనవాత్ గంగ్యా తండ్రి : గోబ్య | 116 | విబి ఖమ్మం నాచారం | 128 | 114 | - | - | - | - |
| 39 | 114 | పట్టా | ఖుష్కి | 0.32 | పట్టాదారులు : 1. తన్వీర్ అహ్మద్ ముహమ్మద్ తండ్రి : ముహమ్మద్ మొహియుద్దీన్ అహ్మద్ 2. గాండ్ల యాదయ్య తండ్రి : వెంకటయ్య 3. దొరిశెట్టి శివకుమార్ తండ్రి : బుచ్చిలింగం 4. మేడిపెల్లి అంజిలయ్య తండ్రి : మొగులయ్య మేడిపల్లి 5. అబ్దుల్ ఖాదీర్ తండ్రి : అబ్దుల్ మజీద్ 6. మేడిపల్లి నర్సమ్మ భర్త : మల్లయ్య 7. గణేమోని వేణుగోపాల్ తండ్రి : నర్సిములు 8. ఆక్కలి అంజనేయులు తండ్రి : కిస్తయ్య 9. బైండ్ల పోచయ్య తండ్రి : రామయ్య 10. మేడిపల్లి శ్రీనివాస్ తండ్రి : మేడిపల్లి దస్తయ్య 11. బైండ్ల పోచయ్య తండ్రి : రామయ్య 12. వడ్డే పద్మమ్మ భర్త : వడ్డెవెంకట్ రాములు 13. మేడిపల్లి పెంటమ్మ భర్త : జంగయ్య 14. వడ్డె శ్రీనివాస్ తండ్రి : భీమయ్య 15. మేడిపల్లి రాములు తండ్రి : మేడిపల్లి దస్తయ్య 16. ఎం. నర్సింహ్మలు తండ్రి : మేడిపల్లి ఆశప్ప 17. అబ్దుల్ ఖాదీర్ తండ్రి : అబ్దుల్ మజీద్ 18. ఆక్కలి అంజనేయులు తండ్రి : కిస్తయ్య 19. బైండ్ల అనంతయ్య తండ్రి : రామయ్య 20. బైండ్ల లక్ష్మి భర్త: బైండ్ల మొగులయ్య 21. మేడిపల్లి రాములు తండ్రి : మేడిపల్లి దస్తయ్య 22. మేడిపల్లి శ్రీనివాస్ తండ్రి : మేడిపల్లి దస్తయ్య 23. బుద్దారం వెంకటమ్మ భర్త : కృష్ణయ్య 24. చెక్కల మైలాయ్య తండ్రి : అనంతయ్య 25. గుజ్జ రాజశేఖర్‌రెడ్డి తండ్రి : గుజ్జ లక్ష్మారెడ్డి (సాగుదారు ): జి. రాములమ్మ భర్త : రాములు | 115 | 112 | 114 | 109 | - | - | - | - |
| 40 | 114 | పట్టా | ఖుష్కి | 0.11 | రోడ్డు | 115 | 112 | 114 | 109 | - | - | - | - |
| 41 | 121/2 | పట్టా | ఖుష్కి | 0.29 | ముదావత్ దేవి భర్త : ముదావత్ రమేష్ | 122 | విబి దొర్నపల్లి | విబి దొర్నపల్లి | 525 | - | - | - | - |
| 42 | 122/ఇ2/1/1 | పట్టా | ఖుష్కి | 0.13 | కుంభవత్ ముత్యాలి భర్త : హంమ్య | 120 | 121 | విబి దొర్నపల్లి | 119-120 | - | - | - | - |
| 43 | 132/9 | పట్టా | ఖుష్కి | 0.05 | మాటూరి వెంకటయ్య తండ్రి : లక్ష్మయ్య | 129 | 131 | 129 | 127 | - | - | - | - |
| 44 | 132/5 | పట్టా | ఖుష్కి | 0.05 | ముదావత్ హీరమాన్ తండ్రి : పోంలా | 129 | 131 | 129 | 127 | - | - | - | - |
| 45 | 132/7 | పట్టా | ఖుష్కి | 0.03 | నర్సయ్య తండ్రి : పెద్ద తిరుమల | 129 | 131 | 129 | 127 | - | - | - | - |
| 46 | 132/అ2 | పట్టా | ఖుష్కి | 0.02 | ఎదిరే సత్యనారాయణ తండ్రి : మల్లయ్య | 129 | 131 | 129 | 127 | - | - | - | - |
| 47 | 132/10 | పట్టా | ఖుష్కి | 0.02 | ఎదిరే రామయ్య తండ్రి: చిన్న తిరుమలయ్య | 129 | 131 | 129 | 127 | - | - | - | - |
| 48 | 132/3 | పట్టా | ఖుష్కి | 0.03 | ఎదిరే రాములమ్మ భర్త : చంద్రయ్య | 129 | 131 | 129 | 127 | - | - | - | - |
| 49 | 132/4 | పట్టా | ఖుష్కి | 0.05 | ఎదిరే ప్రవీణ్ కుమార్ తండ్రి: ఎదిరే అంగయ్య | 129 | 131 | 129 | 127 | - | - | - | - |
| 50 | 132/1 | పట్టా | ఖుష్కి | 0.03 | నర్సయ్య తండ్రి : పెద్ద నర్సయ్య | 129 | 131 | 129 | 127 | - | - | - | - |
| 51 | నద్ది వాగు | పట్టా | ఖుష్కి | 1.19 | కాలువ | 129 | 131 | 129 | 127 | - | - | - | - |
| మొత్తం విస్తీర్ణం | | | | Ac 28.3750 Gts | | | | | | | | | |

చట్టం నం. 30/2013 లోని సెక్షన్ 15 క్రింద ఏర్పాటు చేసిన విధంగా ఆసక్తి గల వ్యక్తులు అభ్యంతరాలు విన్న తరువాత మరియు తగు విచారణ జరిపిన మీదట ఈ డిక్లరేషన్ ఇవ్వబడినది. భూ సేకరణ కారణం వల్ల ఇట్టి కుటుంబాలకు పునరావాసం కల్పించబడలేదు. అందువలన, పునర్నాశ్రయం తలెత్తదు.

ప్రాజెక్ట్ నిర్మాణ దశలో అవసరమైన త్రవ్వబడే లేదా తొలగించబడే లేదా వినియోగించబడే గనులు మరియు ఖనిజాల వంటివి బదులుగా, సదరు భూమిలో ఉన్న బొగ్గు, ఇనుప రజను, పలక లేదా ఇతర ఖనిజాలు ఉన్నయెడల, అవి అవసరం లేదు.

భూమి యొక్క ప్లాన్ భూ సేకరణ అధికారి & జిల్లా వికారాబాద్ వారి కార్యాలయంలో ఏదేని పని దినమున తనిఖీ చేసుకోవచ్చును.

| సం/-. | సం/- | సం/-. | సం/- |
|---|---|---|---|
| తహశీల్దార్ దోమ మండలం | రెవెన్యూ డివిజనల్ అధికారి /L.A.O. వికారాబాద్ డివిజన్ | అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వికారాబాద్ జిల్లా | కలెక్టర్ వికారాబాద్ జిల్లా |

DIPR RO.NO: 226/LA/PP/Advt/Agency/2026-27

## నాన్నా.. మీరు కలలుకన్న భారతావనిని సాధిస్తా!

### దివంగత ప్రధాని రాజీవ్ వర్ధంతి రోజున రాహుల్ పోస్టు



**న్యూఢిల్లీ, మే 21:** శక్తివంతమైన నవభారత్ నిర్మాణానికి మీ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లే బాధ్యత నాది నాన్నా అంటూ ఎఐసిసి నాయకుడు ఎంపి రాహుల్ గాంధీ దివంగత ప్రధాని తండ్రి రాజీవ్‌గాంధీకి ఉద్వేగ భరిత నివాళి అర్పించారు. గురువారం దివంగత ప్రధాని వర్ధంతి కావడంతో రాహుల్ సోషల్ మీడియాలో ఉద్వేగభరితమైన పోస్టు పెట్టారు. నాన్నా నైపుణ్యాల గనిగా భారత్‌ను తీర్చిదిద్దడంలో మీరుచేసిన కృషిని నాబాధ్యతగా ముందుకు తీసుకెళతానని, మీరు కలలు కన్న భారత్‌ను సాధిస్తానని, మీ కలలను సాకారం చేస్తానంటూ అంటూ పోస్టుచేసారు. మీ బోధనలు, మీరు పాటించిన విలువలు, మీ తీపిగుర్తులు నా వెంట నిరంతరం తోడుగా ఉంటాయని పేర్కొన్నారు. అంతకుముందు రాయ్‌బరేలి ఎంపి రాహుల్ మాజీ ప్రధానికి 35వ వర్ధంతి సందర్భంగా నగరంలోని వీర్‌భూమిలో నివాళి అర్పించారు. కాంగ్రెస్‌లోని అగ్రనాయకులు సోనియాగాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, మల్లిఖార్జున్ ఖర్గే, కెసి వేణుగోపాల్ తదితరులు కూడా మాజీ ప్రధానికి నివాళి అర్పించారు. దేశప్రగతికి రాజీవ్ చేపట్టిన విలువైన ప్రణాళికలను ఈసందర్భంగా గుర్తుచేసుకున్నారు. నవీన భారతావని రూపశిల్పి రాజీవ్‌గాంధీ అని కొనియాడారు. ప్రధాని మోడీ కూడా నివాళి అర్పించారు.

## జార్ఖండ్‌లో 27 మంది మావోలు లొంగుబాటు




**రాంచి, మే 21:** జార్ఖండ్‌లో గురువారం డీజీపీ తదాషా మిస్త్రీ సమక్షంలో 27మంది మావోయిస్టులు ఆయుధాలతో లొంగిపోయారు. ఇది జార్ఖండ్ చరిత్రలోనే రికార్డు. వీరిలో చాలామంది మోస్ట్ వాంటెడ్ మావోయిస్టులు కూడా ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ నవజీవన్‌కు ప్రభావితమై వీరు జనజీవన స్రవంతిలోకి వచ్చినట్లు వెల్లడించారు. 2026లో రాష్ట్రంలో 22 మంది మావోయిస్టులను మట్టుబెట్టగా 44మందిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. 29 మంది లొంగిపోయారన్నారు. మిగిలినవారు జనజీవన స్రవంతిలోకి చేరినట్లు పేర్కొన్నారు. లొంగిపోయిన 27 మందికి పునరావాసం కల్పిస్తామని అధికారులు వెల్లడించారు. లొంగిపోయిన వారిలో మావోయిస్టు పార్టీ చివరి యాక్టివ్ పోలిట్ బ్యూరో సభ్యుడు మిశ్ర్ బస్త్ర అలియాస్ సాగర్‌జీ కూడా ఉండే అవకాశం ఉందని తొలుత వార్తలు వెలువడినా ఇప్పటివరకు అధికారుల నుంచి వెలువడిన ప్రకటనలో ఆయన పేరు ప్రస్తావన లేదు. తాజాగా లొంగిపోయిన వారిలో ఆయన సన్నిహిత బృందంలోని టాప్ కమాండర్‌లు, స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, ఏరియా కమిటీ సభ్యులు ఉన్నట్లు తెలుస్తోంది.

### ఇఎంఐకు డివైస్ లాకింగ్ అనుసంధానం

## వాయిదా చెల్లించకపోతే ఫోన్ డెడ్




**ముంబయి, మే 21:** భారతదేశంలో కోట్లాది తక్కువ ఆదాయం ఉన్న ప్రజలకు స్మార్ట్‌ఫోన్ ఇప్పుడు విలాస వస్తువు కాదు అది అవసరం. డిజిటల్ పేమెంట్లు, ఆన్‌లైన్ సేవలు, కుటుంబంతో సంబంధాలు అన్నింటికీ స్మార్ట్‌ఫోన్ కీలకంగా మారింది. కానీ సంజయ్ లాంటి చాలా మందికి ఆ అవకాశం క్రమంగా దూరమవుతోంది. బీహార్‌కు చెందిన కాంట్రాక్ట్ కార్మికుడు సంజయ్ ఇటీవల ఒక మొబైల్ షాప్‌కు వెళ్లి ఈఎంఐపై స్మార్ట్‌ఫోన్ కొనాలని అనుకున్నాడు. కానీ అతనికి సిబిల్ స్కోర్ లేకపోవడంతో ఒక్కో లెండర్ అతని లోన్ అప్లికేషన్‌ను తిరస్కరించింది. దీంతో ఫోన్ కొనాలంటే ఇంకా చాలా నెలలు డబ్బు సేవ్ చేయాల్సిందేనని భావించాడు. అయితే సంజయ్‌కు తెలియని విషయం ఏమిటంటే.. పరిస్థితులు మారిపోయాయి. కొన్ని సంవత్సరాల క్రితం వరకు బ్యాంకర్లు ఈఎంఐలు చెల్లించకపోతే మొబైల్ ఫోన్‌ను లాక్ చేసే సదుపాయం కలిగి ఉండేవారు. దీంతో రిస్క్ తగ్గి, క్రెడిట్ హిస్టరీ లేని కస్టమర్లకూ సులభంగా స్మార్ట్‌ఫోన్ లోన్లు ఇచ్చేవారు. కానీ ఆర్బీఐ గతంలో డివైస్ లాకింగ్‌పై పరిమితులు విధించడంతో బ్యాంకర్లు జాగ్రత్తగా మారారు. ఫలితంగా తక్కువ ఆదాయం ఉన్న సిబిల్ స్కోర్ లేని చాలా మంది కస్టమర్లకు లోన్లు ఆగిపోయాయి. ఇప్పుడు ఆర్బీఐ మళ్లీ మార్గదర్శకాలను సవరించి, నియంత్రిత పరిస్థితులలో డివైస్‌లాకింగ్‌కు అనుమతి ఇచ్చింది. ఈ నిర్ణయం వల్ల బ్యాంకర్లు మళ్లీ అల్పాదాయ వర్గాల కస్టమర్లకు లోన్లు ఇవ్వడానికి ముందుకు వచ్చే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. సంజయ్‌లాంటి లక్షలాది మందికి ఇది కేవలం ఒక పాలసీ మార్పు కాదు డిజిటల్ ప్రపంచంలోకి అడుగుపెట్టే అవకాశం. స్మార్ట్‌ఫోన్ ఇప్పుడు కేవలం ఒకగాడ్జెట్‌కాదు అది వారి భవిష్యత్తుతో కలిపే వంతెనఅని నిపుణులు పేర్కొంటున్నారు.

# వినూత్న చర్యలతో ముందుకెళుతున్న సెర్ప్

## పేదరికం నుంచి ప్రగతి వైపు

## మహిళా రైతులకు గ్లోబల్ మార్కెట్ అవకాశాల కల్పన

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త :** గ్రామీణ పేదరిక నిర్మూలనకు అసలైన అర్థం చెబుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని సన్న, చిన్నకారు రైతులకు వ్యవసాయాన్ని లాబసాటిగా మార్చే దిశగా సెర్ప్ (తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ) వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోంది. ముఖ్యంగా మహిళా రైతుల ఆదా యం పెంచే లక్ష్యంతో రైతులను నేరుగా మార్కెట్‌కు అనుసంధానం చేస్తూ మధ్య దళారుల వ్యవస్థకు చెక్ పెడుతోంది. రైతులు పండించిన పంటలను మధ్యవర్తులు లేకుండా నేరుగా మార్కెటింగ్ వ్యవస్థను సెర్ప్ ఏర్పాటుచేసింది. అంతేకాకుండా ఆన్‌లైన్ మార్కెటింగ్, ఆధునిక రిటైల్ సంస్థలు, జాతీయ, అంతర్జాతీయ మార్కె ట్లతో రైతులను అనుసంధానం చేస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపునిస్తోంది. సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'భేనిశాన్' రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య రాష్ట్రం లోని మామిడి రైతులకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. వనపర్తి జిల్లా పెబ్బేరు గ్రామానికి చెందిన రైతు బాలకృష్ణ దంపతులు ఈ సీజన్‌లో మల్లిక రకం మామిడి పండ్లను విదేశాలకు ఎగుమతి చేయడం చిన్న రైతులకు కొత్త ఆశలు నింపింది. దీంతో ఇప్పటి వరకు మామిడి రైతులకు రూ.151 కోట్ల వ్యాపారం జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ విధానం ద్వారా రైతులకు అదనంగా 15 నుంచి 20 శాతం వరకు అధిక ఆదాయం లభిస్తోందన్నారు. గతంలో కొద్దిపాటి ఉత్పత్తి ఉన్న రైతులకు జాతీయ అంతర్జాతీయ మార్కెట్లలకు ఎగుమతులు అసాధ్యంగా భావించేవారు. కానీ "బేనిశాన్" ద్వారా సమీకరణ, గ్రేడింగ్, ప్యాకింగ్, రవాణా, సప్లై చైన్ సదుపాయాలు కల్పించడం వల్ల చిన్న రైతులు కూడా దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు చేరుకునే అవకాశం లభిస్తోంది. రిలయన్స్, ఫ్లిప్‌కార్ట్, బిగ్‌బాస్కెట్, మెట్రో క్యాష్ అండ్ క్యారీ, మోర్, స్టార్ బజార్, రత్నదీప్ వంటి ఆధునిక రిటైల్ సంస్థలతోపాటు పలు అగ్రో ప్రాసెసింగ్ కంపెనీలతో భేనిశాన్ ఒప్పందాలు కుదుర్చుకుంది.

గతంలో చిన్న సన్న కారు రైతులు తక్కువ పంట ఉత్పత్తి చేయడం వల్ల పెద్దవ్యాపారులు వారిని పట్టించు కునే పరిస్థితి ఉండేది కాదు. దీంతో దళారులకు తక్కువ ధరలకు అమ్ముకోవాల్సి వచ్చేది. ఇప్పుడు ఎఫ్‌పివోల ద్వారా రైతుల ఉత్పత్తులను సమీకరించి పెద్ద మార్కెట్లకు విక్రయించడం వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోంది. ప్రస్తుతం భేనిశాన్ సమాఖ్య పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా 84 రైతు ఉత్పత్తిదారుల సంస్థలు పని చేస్తున్నాయి. ఇవి 30 జిల్లాలు, 404 మండ లా లు, 3,072గ్రామాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తు న్నాయి. మొత్తం 1.09 లక్షల మంది సన్న, చిన్నకారు రైతులు సభ్యులుగా ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులే కావడం విశేషం. ఈ అంశంపై సెర్ప్ ప్రధాన నిర్వహణ అధికారి రజిత నారెడ్ మాట్లాడుతూ.. ఎగుమతులకు వెళ్లే ప్రతి పండును నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ప్రత్యేకంగా ఎంపిక చేసి ప్రాసెస్ చేస్తున్నామని తెలిపారు. మామిడి పండ్ల నాణ్యత కాపాడేందుకు శాస్త్రీయ పద్ధతుల్లో తెంపడం, గ్రేడింగ్ వంటి ప్రక్రియలపై రైతులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని వివరించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన అంటే కేవలం పథకాల అమలు మాత్రమే కాదని, గ్రామీణ కుటుంబాలకు స్థిరమైన ఆదాయం వచ్చే వ్యవస్థను నిర్మించడమే అసలు లక్ష్యమని, మంత్రి సీతక్క ఆలోచనలకు అనుగుణంగా సెర్ప్ ద్వారా రైతులకు అవకాశం కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రైతు పండించిన పంటకు మార్కెట్ కల్పించడం, మధ్యదళారుల ఆధిపత్యాన్ని తగ్గించడం, మహిళా రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడం దిశగా సెర్ప్ తీసుకుంటున్న చర్యలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.



## ప్రపంచశాంతికి రాజీవ్ కృషి

### దేశాన్ని అమెరికా కాళ్ల వద్ద పెట్టిన పిఎం మోడీ: ఎఐసిసి కార్యదర్శి సావంత్

### దేశం కోసం ప్రాణాలర్పించిన నేతలు బిజెపిలో ఒక్కరైనా ఉన్నారా?: ప్రభుత్వ సలహాదారు విహెచ్

### గాంధీభవన్‌లో రాజీవ్ వర్ధంతి.. నివాళి అర్పించిన కాంగ్రెస్ నేతలు

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:** ప్రపంచ శాంతికి రాజీవ్‌గాంధీ కృషి చేస్తూ బలైపోయాడని ప్రధాన మంత్రి మోడీ మాత్రం ఆదాని కేసు కొట్టివేయడదానికి దేశా న్ని అమెరికా పాదలవద్ద పెట్టారని ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్ అన్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీభవన్‌లో పెద్దఎత్తున నివా ళులు అర్పించారు. ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షులు మోతె రోహిత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భం గా సచిన్ సావంత్ మాట్లాడుతూ దేశంలో ఐటి సెక్టార్ ను ప్రవేశ పెట్టిన మహనీయుడు రాజీవ్ గాంధీ దీనివల్ల ఎంతో మంది యువతకు ఉపాధి లభిస్తోందని చెప్పారు, 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కును కల్పించారనీ దేశం కోసం టెర్రరిస్ట్ ల చేతిలో రాజీవ్ గాంధీ ప్రాణాలు కోల్పో యారనీ ఆవేదన చెందారు,.దేశం కోసం ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ లు ప్రాణ త్యాగం చేశారనీ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో బిజెపి అల్లర్లు సృష్టిస్తున్నారనీ తెలిపారు. సర్ తీసుకొచ్చి రాజ్యాంగాన్ని తూట్లు పొడుస్తున్నారనీ చెప్పారు. దేశం ఆర్థిక సంక్షోభంలో కి పోతుంది అని ఈనెల 9న రాహుల్ గాంధీ చెప్పారనీ, మోడీ పట్టించుకోలేదనీ విమర్శించారు.ఇప్పుడు దేశం ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటే ఆమన మాత్రం మనలను విదేశాలకు వెళ్ళవద్దని తను మాత్రం వెళ్లుతున్నారనీ ఎద్దేవా చేశారు.ఆధాని మీద అమెరికా లో కేసు అయితే హడావిడిగా కేసును కొట్టివేయాల్సిన పరిస్తితి ఏంటి అని ప్రశ్నించారు ప్రశ్నిస్తున్న ప్రతి పక్షాలను లేకుండా చేస్తున్నారనీ ఆవేదన చెందారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు మాట్లాడుతూ రాజీవ్‌గాంధీకి నాకు చాలా సన్నిహిత బంధం ఉంది నన్ను ముఖ్య మంత్రి చేస్తానని హామీ ఇచ్చి చనిపోవడం అది నా దురదృష్టం అని గుర్తు చేసుకొన్నారు. దేశం కొరకు ప్రాణాలు అర్పించిన వారిని కుటుంబ పార్టీ అంటారా? బిజెపి లో దేశం కొరకు ప్రాణాలు అర్పించిన ఒక్కరైనా ఉన్నారా? అని ఆయన ప్రశ్నించారు. ఈరోజు మన చేతిలో సెల్ ఫోన్ ఉందంటే ఆనాటి ప్రధాని రాజీవ్ గాంధీ చొరవే అని ఆయన చెప్పారు. బంగారం కొనొద్దని మోదీ ఉచిత సలహా మాకెందుకు? అని ఆయన నిలదీశారు. పెట్రోల్, డీజిల్ ఎగుమతి చేస్తున్న అదానీ, అంబానీలకు సలహాలు ఇవ్వు మాకు కాదు నీ తప్పుడు సలహాలు మాకు అవసరం లేదు అని విమర్శించారు. అదానీకి అంబానీకి లక్షల కోట్లు సహాయం చేశారు కావాలంటే వారి నుంచి కొంత ఇప్పించు అని అన్నారు. బిసి లకు అన్యాయం జరుగుతుందనీ బిసి క్యాస్ట్ సెన్సెస్ చేయాలనే మొదటి ఆలోచన రాజీవ్ గాంధీ అని చెప్పారు. 60 కోట్ల బిసి లు మనుషులు కాదా?మేము ఓట్ల కొరకే పనికి వస్తామా? మా పిల్లలు చదువుకోవద్దా? చీఫ్ జస్టిస్ సూర్యకాంత్‌కు ధన్యవాదాలు అన్నారు. రాహుల్, రేవంత్ కమిట్మెంట్ వల్లే తెలంగాణలో కులగణన జరిపాం అని చెప్పారు. రాబోయేది మన ప్రభుత్వమే అంబేద్కర్ మా దేవుడు.. అలాంటి అంబేద్కర్ ను అమిత్ షా అవమాన పరిచారని అన్నారు.

## వడ్లు, ధాన్యం, మొక్కజొన్న సేకరణను వేగవంతం చేయాలి

### సిఎంకు ఎంపి ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త :** రాష్ట్రంలో రైతులు కష్టపడి పండించిన వడ్లు, ధాన్యం, మొక్కజొన్న సేకరణలో ప్రభుత్వం తీవ్ర నిరక్ష్యం వహిస్తోం దని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే జోక్యం చేసుకుని అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. గురువారం వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన వందలాది మంది రైతులు బీసీ భవన్‌లో ఆయనను కలిసి తాము ఎదుర్కొం టున్న కష్టాలను, బాధలను విన్నవించుకున్నారు. తమ పక్షాన పోరాటం చేయాలని కోరారు. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా అంచనాలకు మించి వరి పంట విపరీతంగా పండిందని, అయితే ప్రభుత్వ యంత్రాంగం, అధికారులు పంట సేకరణను ఒక సవాల్‌గా తీసుకోకుండా అలసత్వం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. రైతులు పండించిన వడ్లను తూకం వేసి తరలించడంలో అధికారులు నెలల తరబడి ఆలస్యం చేస్తున్నారు. రెండు నెలలుగా ధాన్యం పొలాల్లోనే పేరుకుపోవ డంతో, గాలి, వాన, వడగండ్ల వానలకు తడిసి ముద్దయి రైతులు కోట్లాది రూపాయలు నష్టపోతున్నారు. రాత్రింబవళ్లు పంటను కాపాడుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. సరిపోను లారీలు లేక వారాలు, నెలల తరబడి కొనుగోళ్లు నిలిచిపోతున్నాయి. వెంటనే ప్రైవేట్ లారీలు, ట్రాక్టర్లను అద్దెకు తీసుకొని, వారికి రెమ్యునరేషన్ పెంచి రవాణాను వేగవంతం చేయాలి. రాష్ట్రవ్యాప్తంగా రైతాంగం తీవ్ర అసంతృప్తి, ఆందోళనలో ఉన్నారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి అన్ని జిల్లాల కలెక్టర్లతో అత్యవసరంగా మాట్లాడాలని డిమాండ్ చేశారు.

## కొత్త విద్యుత్‌వైర్లు వేయడానికి డి.సిఎం భట్టి శ్రద్ధ తీసుకోవాలి

### రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో 50 యేళ్ల క్రితం విద్యుత్ వైర్లను తొలగించి కొత్త వైర్లు వేయడానికి ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క శ్రద్ధ తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు సలహా ఇచ్చారు. గాంధీభవన్‌లో గురువారం విలేఖరులతో మాట్లాడుతూ కొన్నిచోట్ల నిజాం ఉన్నప్పటి కరెంట్ వైర్లు ఉన్నాయనీ తెలిపారు. పాత కరెంట్ వైర్ల వల్ల షార్ట్ సర్క్యూట్ జరుగుతున్నాయనీ కొత్త వైర్లను వేసేలా భట్టి విక్రమార్క చర్యలు తీసుకోవాలని కోరారు. ఇన్సూరెన్స్ లేని వాళ్లకి చాలా నష్టం కలుగుతుందనీ ఆవేదన చెందారు. కొత్త వైర్లను వేయాలని వ్యాపారస్తులకు సూచిస్తున్నారనీ ఆయన చెప్పారు. కొత్త వైర్లతో ప్రమాదాలు తగ్గిపోతాయి ప్రమాదాలను అరికట్టడం వల్ల ప్రాణనష్టం, ఆస్తినష్టం తగ్గించ వచ్చని అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో భట్టి విక్రమార్కకు లేఖ రాస్తున్నానని చెప్పారు.

## ప్రశాంతంగా ముగిసిన డిఇఇ సెట్-2026

### 76.87 శాతం హాజరు.. 25న ప్రాథమిక కీ విడుదల

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:**డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టిజిడీఈఈ సెట్)-2026 పరీక్ష గురువారం ప్రశాంతంగా జరిగింది. దరఖాస్తు చేసుకున్న వారిలో 76.87 శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరైనట్టు డీఈఈ సెట్ కన్వీనర్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక కీని ఈ నెల 25న విడుదల చేయనున్నట్టు తెలిపారు. ప్రాథమిక కీపై అభ్యంతరాలను రెండు రోజులపాటు స్వీకరించనున్నట్టు తెలిపారు. ఈ నెల 26 వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నట్టు ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షకు 32,592 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 25,054 మంది హాజరయ్యారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన తెలుగు మీడియం పరీక్షకు 12,373 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 9612 మంది(77.69శాతం) మంది పరీక్షకు హాజరయ్యారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన ఇంగ్లీష్, ఉర్దూ మీడియం పరీక్షకు 20,219 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 15,442 మంది(76.37 శాతం) మంది హాజరయ్యారు. 2026-27 విద్యా సంవత్సరం కోసం తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ డైట్స్, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ ఎలిమెంటరీ టీచర్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ (డీఈఎల్.ఈడీ) (మైనారిటీ,నాన్‌మైనారిటీతో సహా)లో రెండేళ్ల కోర్సులో ప్రవేశానికి డీఈఈ సెట్‌ను నిర్వహిస్తున్న విదషయం తెలిసిందే. టిజి డీఈఈ సెట్-2026 ద్వారా డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్.ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్(డీపీఎస్ఈ)లో ప్రవేశాలను తీసుకోనున్నారు.

## ఆర్‌ఎస్‌ఎస్‌పై దుష్ప్రచారం చేస్తే చర్యలు

### ప్రాంత సంఘ చాలక్ బర్ల సుందర్‌రెడ్డి

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్ఎస్)పై దుష్ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆర్‌ఎస్ఎస్ ప్రాంత సంఘచాలక్ బర్ల సుందర్‌రెడ్డి హెచ్చరించారు.కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి సంబంధించిన వ్యవహారంలో ఆర్‌ఎస్ఎస్ కార్యకర్తలను, సంఘాన్ని అనవసరంగా వివాదాల్లోకి లాగుతూ కొన్ని మీడియా సంస్థలు బద్నాం చేయడానికి ప్రయత్నించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.సదరు వ్యవహారంలో ఆర్‌ఎస్ఎస్ కార్యకర్తలు ప్రాంత కార్యవాహ కాచం రమేష్, ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్‌ల పేర్లను ప్రస్తావించడం, వారికి బండి సంజయ్ గారితో ఆర్థిక లావాదేవిలు ఉన్నాయని, అందుకే వారిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారంటూ అసత్య నిరాధార కథనాలు అల్లి కొన్ని మీడియా వర్గాలు వాస్తవ విరుద్ధమైన అంశాలను ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమాజంలో నిరంతరం నిస్వార్థంగా, ప్రజా సేవలో నిమగ్నమయ్యే లబ్ధ ప్రతిష్ఠ కలిగిన కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని, వారి ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కొన్ని మీడియా సంస్థలు ఉద్దేశపూర్వకంగా ఈ దుష్ప్రచారానికి ఒడిగట్టారని తెలి పారు. ఇలాంటి నిరాధారమైన వార్తలతో సం ఘాన్ని, కార్యకర్తలను బద్నాం చేయాలని చూస్తే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భారతీయ జనతా పార్టీ అంతర్గత వ్యవహారాలతో ఆర్‌ఎస్‌ఎస్‌కు సంబంధం లేదని ప్రాంత సంఘచాలక్ బర్ల సుందర్‌రెడ్డి

## 25 నుంచి 31 వరకు మహిళా వారోత్సవాలు



### మహిళలను ఆర్థిక శక్తులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం: గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:** మహిళల ఆర్థిక స్వావలంబనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మహిళా సాధికారత కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 25 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా 'మహిళా వారోత్సవాల్ను'ను నిర్వహించనుంది. ఈ వారోత్సవాల్లో భాగంగా గ్రామీణ మహిళలు, స్వయంసహాయక సంఘాలు, యువతులు, బాలికలకు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. జీవనోపాధి యూనిట్లు, రుణమేళాలు, అవగాహన సదస్సులను నిర్వహించనున్నారు. మే 29న హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభంకానుంది. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే దిశగా ఈ కార్యక్రమం జరగనుంది. స్వయం సహాయక సంఘాల మహిళలతో 450 ఆర్టిసి బస్సుల ప్రారంబోత్సవం, 0.5 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ల ప్రారంభం, మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు, వడ్డీలేని లోన్లు విడుదల తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు. గ్రామాల్లో యుక్తవయస్సు బాలికలతో మాక్ పార్లమెంట్ నిర్వహణ, మహిళా సంఘ భవనాలు, గోదాములకు శంకుస్థాపనలు, కోళ్ల పెంపకం, సూక్ష్మ పరిశ్రమల యూనిట్ల గ్రౌండింగ్ వంటి కార్యక్రమాలు కూడా జరగనున్నాయి. దివ్యాంగులకు బ్యాటరి వాహనాల పంపిణీ, తేనేటీగల పెంపకం, బయో ఇన్‌పుట్ సెంటర్ల ఏర్పాటు, మహిళల భద్రత కోసం ప్రత్యేక కార్యక్రమాలు, టీనేజి బాలికలకు సైకిళ్ల పంపిణీ, ఆరోగ్య శిబిరాలు, ఉచిత ఆరోగ్య పరీక్షలను నిర్వహించనున్నారు. మహిళా వారోత్సవాల్లో భాగంగా పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయనున్నారు.

**మహిళలను ఆర్థిక శక్తులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం: సీతక్క**

మహిళా సంఘాలను గ్రామీణ ఆర్థిక శక్తులుగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఈ వారోత్సవాల ద్వారా మహిళలు ఆర్థికంగా, సామాజికంగా సాధికారత సాధించడానికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ స్థాయిల్లో ఈ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు ప్రకటించారు.

## ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

### 3,98,358 మంది ఫీజు చెల్లింపు

### 889 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

### ప్రారంభమైన మూల్యాంకనం ప్రక్రియ

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:** ఈ నెల 13 నుంచి నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం(మే 21)తో ముగిశాయి. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్టు ఇంటర్ బోర్డు అధికారులు ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా 3,98,358 మంది విద్యార్థులు పరీక్షలకు ఫీజు చెల్లించారు. వారి కోసం 889 పరీక్షా కేంద్రాలను ఇంటర్ బోర్డు ఏర్పాటు చేసింది. మొదటి సంవత్సరం పరీక్షలకు 2,67,285 మంది విద్యార్థులు ఫీజు చెల్లించగా.. సెకండియర్ పరీక్షలకు 1,31,073 మంది ఫీజు చెల్లించారు. ఫస్టియర్ విద్యార్థుల్లో 1,43,322 మంది బాలురు ఉండగా, 1,23,949 మంది బాలికలు ఉన్నారు. సెకండియర్ విద్యార్థుల్లో 83,692 మంది బాలురు కాగా, 47,371 మంది బాలికలున్నారు. మొదటి సంవత్సరం పరీక్షలను ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, సెకండియర్ పరీక్షలను మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించారు. 889 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా.. వాటిలో 327 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, 102 ప్రభుత్వరంగ జూనియర్ కాలేజీలు, 460 ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణ కోసం 10,685 మంది ఇన్విజిలేటర్లను నియమించగా 75 టీమ్స్ సిట్టింగ్ స్క్వాడ్స్‌ను మరో 75 టీమ్స్ ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. మూల్యాంకనాన్ని రాష్ట్ర వ్యాప్తంగా 17 కేంద్రాల్లో గురువారం నుంచే ప్రారంభించారు. మూల్యాంకనాన్ని రెండు విడతల్లో నిర్వమించ నున్నారు. మొదటి విడతలో గురువారం సంస్కృతం, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, పొలిటికల్ సైన్స్ పేపర్-1,2తోపాటు గణితం పేపర్ 1(ఏ), 1(బి), 2(ఏ), 2(బీ) మూల్యాంకనం ప్రారంభిం చారు. సెకండ్ సెల్‌ను ఈ నెల 24న ప్రారంభిం చనున్నారు. అందులో ఫిజిక్స్, ఎకనామిక్స్, బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, కామర్స్, హిస్టరీ పేపర్-1, 2 పేపర్ల మూల్యాంకనం చేపట్టనున్నారు.

## కేంద్ర అనాలోచిత విధానాలతో సామాన్యుడు కుదేలు

### నీట్ రద్దు నిరంకుశ నిర్ణయం

### తెలంగాణ బిసి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ అనాలోచిత విధానాలతో సామాన్య మానవుడు కుదేలు అవుతున్నాడని బిసి స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ విమర్శించారు. గురువారం గౌడ్ మీడియాతో మాట్లాడుతూ కేంద్రం పెట్రోల్, డీజిల్, సిఎన్జి రేట్లు పెంపు సమర్థించాల్సిన అంశం కాదని అన్నారు. ధరల పెంపు నిర్ణయం అనేక రంగాలపై వ్యతిరేకత చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యవసర వస్తువుల ధరలు అమాంతంగా పెరిగి సగటు జీవి బతుకులో పిడుగుపాటుగా మారిందని వివరించారు. ఆత్మ నిర్భర పథకం కేవలం ఓట్లు రాజకీయ పథకం మాత్రమే తప్ప సామాన్యుడికి మేలు చేసే పథకం కాదని విమర్శించారు. ఓట్లకు ముందు ఓటర్లు ఓడమల్లయ్య అంటూ సంభోదించినట్లుగా పెట్రోల్ డీజిల్ ధరలు పెంచమని పదేపదే చెప్పి ఎన్నికలు అయిపోగానే ఓటర్లు బోడ మల్లయ్యలు చిత్రీకరించి ధరలు పెంచారనీ ఎద్దేవా చేశారు. చమురు ధరల పెంపుతో చిన్నాచితక మధ్యతరహా పరిశ్రమలు తీవ్ర సంక్షోభాన్ని ఎదురుకుంటున్నాయని చెప్పారు. యువతకు ఉపాధి గ్యారెంటీ లేకుండా పోయిందని, రైతులను రాజులను చేస్తాం వారి ఆదాయం రెట్టింపు చేస్తాం అన్న మాటలు నీటి మూటలుగా మిగిలిపోయాయని అన్నారు. ఇరాన్, ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపించి రేట్లు పెంచడం పేదల నడ్డి విరవడం కాదా అని ప్రశ్నించారు. పెట్రోల్ ధరల భారం ఎప్పుడూ పెట్రోల్ బంకుల దగ్గరే ఆగిపోదని ప్రతి వంటగది, ప్రతి పంట పొలం ప్రతి కుటుంబం బడ్జెట్లోనూ చొరబడుతుందని ఇప్పటికే మధ్య తరగతి పేద ప్రజలు వంట గ్యాస్ కే అధికంగా ఖర్చు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్,యు జి 2026 రద్దు నిర్ణయం నోట్ల రద్దు లాంటిదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం వల్ల యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవస్థీకృతంగా పేపర్ లీకులు దేశ యువతను అనిచిత నిరాశలోకి నెట్టిందని ఏళ్ల కొద్ది విద్యార్థులు చదివిన చదువులు కన్న కలలు కల్లలు అయ్యాయని అన్నారు కేంద్ర ప్రభుత్వ 10 ఏళ్ల పాలనలో 93 పేపర్లు లీక్ అయ్యాయని నూతి శ్రీకాంత్‌గౌడ్ ఎద్దేవా చేశారు.

## మాజీ ఐపిఎస్ అధికారి వినయ్‌రంజన్ రే కుటుంబంలో హత్య-దోపిడి కేసులో పోలీసుల పురోగతి

### ముంబైలో దాక్కున్న నిందితుడు సునీల్ పరియార్ అరెస్టు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), మే 21, ప్రభాతవార్త :** మాజీ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే కుటుంబంలో జరిగిన హత్య-దోపిడి కేసులో పోలీసులు పురోగతి సాధించారు. జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లో నివసిస్తున్న విశ్రాంత ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే ఇంట్లో పని చేసే నేపాల్‌కు చెందిన కల్పన అలియాస్ ధర్మ అనే మహిళ, సురేష్ షాహీ అలియాస్ సృజన షాహీ, గణేష్ బికాస్, కంచా లామాతో కలిసి ఇంట్లోకి ప్రవేశించి ఈ నేరానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. సంఘటన జరిగిన రోజున ఇంటి సమీ పంలో నేత్ర షాహి, సునీల్ పరియార్, గణేష్ బయట ఉన్నట్లు పోలీసులు ఇప్పటికే గుర్తించారు. కొద్ది రోజుల క్రితం వినయ్ రంజన్ రే భార్య తనుజ రంజన్ రే హత్యకు గురై, ఇంట్లోని బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన ఘటన నగరంలో సంచలనం సృష్టించింది. కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న తెలంగాణ పోలీసులు విస్తృత దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో భాగంగా ముంబైలో దాక్కున్న సునీల్ పరియార్ అనే నిందితుడిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దర్యాప్తులో మొత్తం 7 నుంచి 8 మంది ఈ కుట్రలో పాల్గొన్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. మరోవైపు, ముగ్గురు నింది తులు ఇప్పటికే సరిహద్దులు దాటి నేపాల్‌కు పారిపోయినట్లు అనుమానిస్తున్నారు. మరికొందరు ముంబైలోనే తలదాచుకున్నట్లు సమాచారం. ఈ నేపాలి ముఠాను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను పశ్చిమ బెంగాల్, లక్నో తదితర ప్రాంతాలకు పంపించినప్పటికీ ఇప్పటివరకు పెద్దగా ఫలితం లభించలేదని తెలుస్తోంది. ప్రస్తుతం మిగిలిన నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు



సునీల్ పరియార్

# బిసి గురుకులాలు బ్రాండ్‌ను క్రియేట్ చేయాలి

### 8వ తరగతి నుంచే నీట్, ఎప్‌సెట్ పరీక్షలకు ప్రిపేర్ చేయాలి

### 100 శాతం ఉత్తీర్ణత రాని పాఠశాలలకు హెచ్చరిక

### సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న బీసీ గురుకులాలు బ్రాండ్‌ను క్రియేట్ చేయాలని బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. విద్యార్థులకు సమగ్ర విద్యాబోధన జరగాలన్నారు. 8 వ తరగతి నుండే నీట్, జేఈఈ మెయిన్, ఎప్ సెట్ వంటి పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయాల పనితీరుపై మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం ప్రజాభవన్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమయాదేవి, మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల సెక్రటరీ సైదులు, ఆర్సీవో లు, ప్రిన్సిపల్‌లు పాల్గొన్నారు. సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలలు వచ్చే విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉండాలని ఆదిశగా అధ్యాపక బృందం పని చేయాలని మంత్రి సూచించారు. విద్యార్థులకు చదువులతోపాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సైన్స్, ఏఐ, తదితర అంశాలపై ఉన్నత స్థానాలకు ఎదిగేలా ప్రోత్సహిం చాలన్నారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలను అభిందిం చడంతో పాటు ఉత్తీర్ణత శాతం తక్కువగా వచ్చిన పాఠశాలల ప్రిన్సిపాల్ లను మంద లించారు. వచ్చే విద్యాసంవత్సరంలో మంచి ఫలితాలు రాబట్టాలని సూచిం చారు. గతంలో 327 స్కూల్‌లలో 301 స్కూల్‌లో ప్రైవేట్ భవనాల్లో ఉన్నాయని, ప్రజా ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇవ్వడంతో గురుకులాలు అద్భుతంగా పని చేస్తున్నాయన్నారు. 2026-27 సంవత్సరానికి రాష్ట్రంలోని అన్ని బీసీ సంక్షేమ శాఖ గురుకులాలు మరింత సమర్థవంతంగా విజయాలు సాధించాలన్నారు.

చిన్న చిన్న కారణాలతో గురుకులాల్లో సూసైడ్ జరుగుతున్నా యని, విద్యార్థుల్లో మనో ధైర్యాన్ని కల్పించాలని, వారిలో మోటివేటివ్ కల్పించాలన్నారు. జిల్లాల్లో ఉన్న స్కూల్స్ వారీగా సమీక్షలు చేస్తూ 100 శాతం ఫలితాలు వచ్చిన స్కూల్స్ అభినందిస్తూ.. తక్కువ ఫలితాలు వచ్చిన స్కూల్స్ ఆత్మపరిశీలిన చేసుకోవాలనీ సూచించారు.

10వ తరగతిలో 98.45 శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల సెక్రెటరీ సైదులుతో పాటు ప్రిన్సిపల్‌లను అభినందిం చారు. 500పైన మార్కులు 9788 మంది విద్యార్థులకు వచ్చాయనీ, 204 ఎంజేపీ గురుకులాలు 100 శాతం ఫలితాలు సాధించాయనీ సంతోషం వ్యక్తం చేశారు. 65 స్కూల్స్ వెనుకబడి ఉన్నాయనీ ఆ స్కూల్స్ ఆత్మపరిశీలిన చేసుకోవాలి ఉత్తీర్ణత తక్కువగా వస్తె మంచిది కాదనీ హెచ్చరించారు. ఫెయిల్ అయిన విద్యార్థులు తెలుగు సబ్జెక్ట్ లో ఎక్కువగా కనిపిస్తున్నారనీ తెలుగులో ఫెయిల్ కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

ప్రతి స్కూల్ లో ర్యాంకర్ల ఫోటో లతో ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలనీగ్రామాల్లో గురుకులాల్లో వచ్చిన మార్కులు ఫలితాలు విస్తృతంగా ప్రచారం కల్పించాలన్నారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 90.31 శాతం, ప్రథమ సంవత్సరం లో 85.80 శాతం, 900 పైన మార్కులు సాధించిన విద్యార్థులు 4183 మంది విద్యార్థులు, 980 మార్కులు పైన 496 మంది విద్యార్థులు సాధించారన్నారు. 35 విద్యా సంస్థలు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాయని, ప్రథమ సంవత్సరంలో 8 విద్యా సంస్థలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయన్నారు. ఎంజేపీ లో చదివిన పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులకు నేరుగా ఇంటర్మీడియట్ తరగతులకు అడ్మిషన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.



# అబద్ధాల రాజకీయాలకు బిఆర్ఎస్ పెట్టింది పేరు

## ధాన్యం రవాణా కోసం 13,000 వాహనాల వినియోగం

## అందుబాటులో 18.3 కోట్ల గన్నీ బ్యాగులు

## పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:** అర్థసత్యాలు, అబద్ధాల ప్రచారానికి బిఆర్ఎస్ పెట్టింది పేరని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దుయ్యబట్టారు. రైతుల సంక్షేమంపై కె.టి. రామారావు విడుదల చేసిన లేఖపై గురువారం ఆయన ఒక ప్రకటనలో ఘాటుగా స్పందించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో పది మంది రైతులు మృతి చెందారని కేటీఆర్ పేర్కొన్న దాంట్లో అనువంతైనా నిజం లేదని కొట్టిపారేశారు. ఇది రాజకీయాలకోసం బురద చల్లే ప్రయత్నం తప్ప మరోటి కాదని విరుచుకుపడ్డారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఇప్పటి వరకు ఏ ఒక్క రైతు చనిపోలేదని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణా నీటిపారుదల రంగాన్ని కుంభకోణాల కూపంగా మార్చిన బిఆర్ఎస్ నేతలు రైతు సంక్షేమం గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే రికార్డుస్థాయిలో ధాన్యం దిగుబడి వచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న రబీ సీజన్‌లోనూ రాష్ట్ర ప్రభుత్వం 8,575 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, కేంద్రాలకు 54.29 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రాగా ఇప్పటి వరకు ప్రభుత్వం 46.21లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు ఆయన వెల్లడించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రూ. 7,841 కోట్ల రూపాయల చెల్లింపులు జరిగాయన్నారు. మొత్తం ధాన్యం కొనుగోలు ప్రక్రియలో 6.3 లక్షల మంది రైతులు ప్రయోజనం పొందారని ఆయన వివరించారు. అంతేకాకుండా ధాన్యం కొనుగోలుకు నిమిత్తం 18.3 కోట్ల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించేందుకు వీలుగా 13,000 వాహనాలను వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. గణాంకాలు వాస్తవాన్ని ప్రస్ఫుటంగా వెల్లడిస్తుంటే రైతులను తప్పు దోవ పట్టించేందుకే కెటిఆర్ లేఖ రూపంలో అవాస్తవాలు రాశారని ఆయన విమర్శించారు. వాస్తవానికి బిఆర్ఎస్ పాలనలో ధాన్యం కొనుగోళ్లలో పెద్ద ఎత్తున అక్రమాలు, మిల్లర్లతో లాలూచి, చెల్లింపుల్లో ఆలస్యం జరిగిందని దుయ్యబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఏటీఎంలా వాడుకుని బిఆర్ఎస్ ప్రభుత్వం వేల కోట్లు దోచుకున్న అంశం దేశ వ్యాప్తంగా తెలుసున్నారు. మేడిగడ్డ, అన్నారం ,సుందిళ్ల బ్యారేజీల ప్రస్తుత పరిస్థితి బిఆర్ఎస్ అవినీతి పాలనకు అద్దం పడుతోందన్నారు.నీటి వనరులను రైతుల భవిష్యత్ కోసం వినియోగించే విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందన్నారు.

## ప్రాంతీయ పార్టీల ప్రాధాన్యత పెరుగుతోంది

### న్యూజెర్సీలో మీట్ అండ్ గ్రీట్‌లో హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 21:** బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రం వ్యవసాయ రంగంలో విశేష ప్రగతి సాధించిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. పంజాబ్‌ను మించి ధాన్యం ఉత్పత్తి చేసి తెలంగాణ రికార్డులు సృష్టించిందని పేర్కొన్నారు. న్యూజెర్సీలోని మోంట్ లారెల్ ప్రాంతంలోని హిల్ వేదికగా నిర్వహించిన 'మీట్ అండ్ గ్రీట్ విత్ హరీశ్‌రావు' కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హరీశ్‌రావుకు బీఆర్ఎస్ ఎన్నారై ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తెలంగాణ సమకాలీన రాజకీయాలు, అభివృద్ధి, ఆర్థిక పరిస్థితులపై విస్తృతంగా చర్చ జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా అమెరికాలోని తెలంగాణ ఎన్నారైలు, బీఆర్ఎస్ నాయకుల మధ్య మరింత సన్నిహిత సంబంధాలు బలపడినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అనంతరం హరీశ్‌రావు మాట్లాడారు. ప్రతి రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టడం వల్లే తెలంగాణ అభివృద్ధి సాధ్యమైందని తెలిపారు. అయితే ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని పాలనపై విమర్శలు చేశారు. విజన్ లేని పాలన కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. తెలంగాణలో ప్రస్తుతం పెట్టుబడుల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని అన్నారు. కనీసం ఒక్క ఫ్లాట్ కొనుగోలు చేయాలన్నా ఎన్నారైలు భయపడుతున్న పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడిదారులకు నమ్మకం కలిగించే పరిస్థితులు అవసరమని తెలిపారు. అలాగే దేశ రాజకీయాలపై మాట్లాడారు. ప్రాంతీయ పార్టీల ప్రాధాన్యం పెరుగుతోందని వ్యాఖ్యానించారు. కేంద్ర రాజకీయాల్లో ప్రాంతీయ పార్టీలే కీలక పాత్ర పోషిస్తున్నాయని, భవిష్యత్తులో కూడా వాటి ప్రభావం కొనసాగుతుందని హరీశ్‌రావు పేర్కొన్నారు.



## కెటిఆర్‌తో కెబిఆర్ పార్క్ రోడ్ విస్తరణ ప్రభావిత యాజమానుల ఫోరం భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 21:** కేబీఆర్ పార్క్ రోడ్ విస్తరణ ప్రభావిత యజమానుల ఫోరం ప్రతినిధులు ఈరోజు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావును కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో కేబీఆర్ పార్క్ చుట్టూ భారీగా చెట్లను నరికివేసే ప్రయత్నాలను వ్యతిరేకించాలని, హైదరాబాద్ నగరానికి ఊపిరితిత్తుల్లాంటి కేబీఆర్ పార్క్‌ను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రతినిధుల విన్నపాన్ని విన్న కేటీఆర్ మాట్లాడుతూ, కేబీఆర్ పార్క్ హైదరాబాద్ నగరానికి అత్యంత విలువైన 'లంగ్స్ స్పేస్' అని పేర్కొన్నారు. వేగంగా విస్తరిస్తున్న మహానగరంలో పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడటంలో కేబీఆర్ పార్క్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఇలాంటి పచ్చదనాన్ని నాశనం చేసే ఏ చర్యనైనా ప్రజాస్వామ్యబద్ధంగా, చట్టబద్ధంగా అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేబీఆర్ పార్క్ ఉనికి, చెట్లకు ఏ మాత్రం ఇబ్బంది కలగకుండా అండర్‌గ్రౌండ్ ప్రతిపాదికన ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధం చేశామని కేటీఆర్ తెలిపారు. ఆ ప్రణాళికలు ఇప్పటికీ మున్సిపల్ శాఖ వద్ద అందుబాటులో ఉన్నాయని గుర్తుచేశారు. అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని ధ్వంసం చేయడం సరైన విధానం కాదని, సాంకేతిక పరిజ్ఞానం మరియు సమగ్ర ప్రణాళికలతో అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండింటినీ సమన్వయం చేయవచ్చని పేర్కొన్నారు. కేబీఆర్ పార్క్ చుట్టూ చెట్ల నరికివేతకు వ్యతిరేకంగా ప్రజలు వ్యక్తం చేస్తున్న ఆందోళనను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాల్సి అవసరం ఉందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు.

## అధికారంలో ఉండగా ఎప్పుడైనా రైతులు గుర్తుకు వచ్చారా?

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు ప్రభుత్వ విప్ విజయరమణారావు లేఖ

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:** అధికారంలో ఉన్నప్పుడు రైతులు ఏనాడైనా గుర్తుకొచ్చారా? అంటూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కు ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు బహిరంగ లేఖ రాశారు. గురువారం సిఎల్‌పి కార్యాలయంలో లేఖను ఆయన విడుదలచేస్తూ అందులోని అంశాలను విలేకరులకు వివరిస్తూ సూటూ బూటు వేసుకొని కార్పొరేట్లతో చట్టాపట్టాలు వేసుకొని, ఫైవ్ స్టార్ హోటళ్లలో జల్సాలు చేస్తూ మీరుతిరిగేవారనీ విమర్శించారు. ఖాళీ దొరికితే విదేశాలలో తిరుగుతూ ఫోటోలకు ఫోజులిస్తూ దసరా బుల్లోడి మాదిరిగా వ్యవహరించేవారని దుయ్యబట్టారు. ఫామ్‌హౌస్‌లలో సినిమా వాళ్లతో పార్టీలు చేసుకుంటూ కాలక్షేపం చేసేవారనీ ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు ఏనాడైనా రైతు సమస్యల గురించి మీరు మాట్లాడారా? చర్చించారా? సమీక్ష చేశారా? అధికారం దూరమవటంతో మీకు సాధారణ ప్రజలు గుర్తుకొస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు మీ జీవితం మొత్తం కార్పొరేట్ స్టైల్‌లో నడిచిందనీ గుర్తుచేశారు. ఇప్పటికైనా మీకు వ్యవసాయం, రైతులు గుర్తుకు రావటం సంతోషం కలిగిస్తోందనీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వడ్లు, మక్కలను శరవేగంగా కొనుగోలు చేస్తోందనీ తెలిపారు. కలెక్టర్లు ప్రతిరోజూ ధాన్యం కొనుగోళ్లపై పర్యవేక్షణ చేస్తున్నారు. మే 20, 2026 నాటికి రాష్ట్రంలో 45.02 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారనీ గణాంకాలతో వివరించారు. గత ప్రభుత్వంలోని 2021-22 రబీలో మీ ప్రభుత్వం కేవలం 21.79 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు ఈసారి మేము 45 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని అన్నారు.

## యంగ్ ఇండియా గురుకులాలకు

# రూ.4,049 కోట్ల రుణానికి గ్రీన్‌సిగ్నల్

### రాష్ట్ర ప్రతిపాదనకు ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదం

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త :** తెలంగాణలో మౌలిక సదుపాయాలకు భారీ ఊతమిస్తూ, రెండు ప్రధాన విద్యా ప్రాజెక్టుల కోసం ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ), ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబి)ల నుంచి నిధులను సమీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం తెలిపింది.

కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక వ్యవహారాల విభాగం (డీఈఏ), ఏడీబీ సహాయంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సంబంధించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకులాల (వైఐఐఆర్ఎస్) ప్రాజెక్టుకు రూ.4,049.11 కోట్ల నిధులను, ఏఐఐబీ మద్దతుతో తెలంగాణ విద్యా మౌలిక సదుపాయాల ఉన్నతీకరణ మిషన్‌కు రూ.4,903.44 కోట్ల నిధులను ఆమోదించింది.

రాష్ట్ర అభివృద్ధి, విద్యా రంగంలో పెట్టుబడులు, మూలధన వ్యయం, విద్యా మౌలిక సదుపాయాల విస్తరణకు సంబంధించిన కీలక అంశాలపై రాష్ట్ర సర్కార్ చేసిన ప్రతిపాదనలకు కేంద్రం సుముఖత కనపరచింది. ఆర్థిక బాధ్యత, బడ్జెట్ నిర్వహణ చట్టం కింద రాష్ట్ర పరిమితుల నుండి ఈ రుణాలను మినహాయింపు ఇవ్వాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఇవి సాధారణ ఖర్చులు కాదని, ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనారిటీ వర్గాల మానవ వనరుల అభివృద్ధి, విద్యా సాధికారతను లక్ష్యంగా చేసుకున్న దీర్ఘకాలిక మూలధన పెట్టుబడులని పేర్కొంది. విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న భారీ పెట్టుబడులకు సంబంధించి కేంద్ర ఆర్థిక మంత్రికి మరో వినతిపత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం సమర్పించింది. ఈ నేపథ్యంలో ఈ పథకం కింద రాష్ట్రాలకు 50 యేళ్ల వడ్డీ లేని రుణాలు అందించనుంది.

## జిఒ ప్రకారమే బదలీలు చేపట్టాలి

### ఫోకల్-నాన్ ఫోకల్ అంశాన్ని కదిలించొద్దు

### తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం డిమాండ్

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:** వైద్య, ఆరోగ్య శాఖలో బదలీలను జీవో ఎంఎస్ నంబర్ 38 ప్రకారమే చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం(టిజిజిడిఏ) డిమాండ్ చేసింది. బదలీల ప్రక్రియలో జరుగుతున్న జాప్యం పట్ల, జీవో ఎంఎస్ నంబర్ 38 నిబంధనలకు విరుద్ధంగా ప్రత్యేక మార్గదర్శకాలను రూపొందించడానికి జరుగుతున్న ప్రయత్నాల పట్ల అసోసియేషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గురువారం హైదరాబాద్‌లోని కోఠిలో ఉన్న డీఎంఈ కార్యాలయం వద్ద అసోసియేషన్ నేతలు మీడియాతో మాట్లాడారు. టిజిజిడిఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నరహరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్. లాలు ప్రసాద్ రాథోడ్, రాష్ట్ర కోశాధికారి డాక్టర్ ఎం. కె. రౌఫ్‌రాష్ట్ర మీడియాతో మాట్లాడారు. బదిలీలను జీవో 38 ప్రకారం మాత్రమే నిర్వహించాలని, ఎటువంటి మార్పులు, వక్రీకరణలు, లేకుండా నిర్వహించాలన డిమాండ్ చేశారు. ప్రత్యేకంగా ఫోకల్- నాన్ లోకల్ ప్రాంతాల నిర్వచనాలను మార్చడానికి జరుగుతున్న ప్రయత్నాలను సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఇటువంటి మార్పులు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వైద్యులలో తీవ్ర అసంతృప్తి, అనుమానాలు, వివక్ష భావనలకు దారితీసే ప్రమాదం ఉందన్నారు. ఫోకల్-నాన్ ఫోకల్ అంశం తేనే తుట్టే వంటిందన్నారు. ఆ అంశాన్ని అనవసరంగా కదిలించకూడదన్నారు. వైద్య ఆరోగ్యశాఖ గురువారం విడుదల చేసిన మెమో నంబర్ 1274/ఐ/2026 ద్వారా తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టిజిజిడిఏ) ప్రభుత్వ గుర్తింపు పొందిన సంఘంగా స్పష్టత రావడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైద్యులు సంతోషం వ్యక్తం చేశారు.

## జూన్ 2 నుంచి 2 లక్షల మందికి కొత్తగా పెన్షన్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 21:** జూన్ 2 నుంచి దాదాపు 2 లక్షల మందికి కొత్తగా పెన్షన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. జిల్లాల వారీగా అర్హుల జాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్లను ఆదేశించింది. తొలుత దివ్యాంగులు, తర్వాత వృద్ధులు, వితంతువులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. మరోవైపు సెర్ప్ రాష్ట్ర వ్యాప్తంగా పెన్షనర్ల వివరాలను ఫేషియల్ రికగ్నిషన్ యాప్‌లో నమోదు చేస్తోంది. మృతులను జాబితా నుంచి తొలగించనుంది.

# గోవధ నిషేధ చట్టం అమలులో పోలీసులు విఫలం

### గో రక్షకులు, బిజెపి కార్యకర్తలపై కేసులు అమానుషం

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆగ్రహం

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో చట్ట విరుద్ధంగా గోవులను తరలించడం, గోవధకు పాల్పడటం అత్యంత దారుణమని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో గోవధ నిషేధ చట్టాలు అమలులో ఉన్నప్పటికీ కొందరు కావాలనే చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. పవిత్రమైన గోమాతను కాపాడుకోవడానికి, చట్టాన్ని రక్షించడానికి శాంతియుతంగా ప్రయత్నిస్తున్న గోరక్షకులను, బిజెపి కార్యకర్తలను పోలీసులు అక్రమంగా అరెస్టులు చేయడం తగదన్నారు. గో అక్రమరవాణాను అడ్డుకుంటారన్న నెపంతో బైండోవర్లు చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని విరుచుకుపడ్డారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిని వదిలేసి, గోవులను కాపాడాలని చూస్తున్న రక్షకులపై, బిజెపి కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని, బైండోవర్లను రద్దు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో గోవధ నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గోవుల అక్రమ రవాణాను అడ్డుకోవడానికి రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీ కేంద్రాలను ఏర్పాటుచేయాలన్నారు. చట్టాన్ని ధిక్కరించి గోవధకు పాల్పడే వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులు ఒక వర్గానికి కొమ్ముకాస్తూ గోరక్షకులను వేధించడం సరికాదని ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. " గోమాత హిందువుల జీవన విధానంలో ఒక పవిత్రమైన భాగం. పండుగల పేరుతో గోవధను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదు. శాంతియుత వాతావరణానికి భంగం కలిగించాలని చూసే శక్తులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. అని డిమాండ్ చేశారు. తక్షణమే అరెస్టు చేసిన బిజెపి కార్యకర్తలను విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కాగా.. సినీ, టెలివిజన్ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు రాంచందర్‌రావు సమక్షంలో బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా సినీ సెల్ కోకన్వీనర్ వైభవ సూర్య మాట్లాడుతూ.. దేశభక్తి భావజాలం, అభివృద్ధి రాజకీయాల పట్ల ఆకర్షితులై పలువురు కళాకారులు బిజెపిలో చేరుతున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఇంకా అనేక మంది సినీ, టీవీ రంగ ప్రముఖులు పార్టీలో చేరనున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటులు మనోహర్, సీనియర్ నటుడు శరత్, సీనియర్ నటి పద్మరేఖ, సినీ సెల్ సభ్యురాలు పూజిత తదితరులు బీజేపీలో చేరారు.

## కనీస వేతనం చెల్లించండి

### మంత్రి వాకిటి శ్రీహరికి గోపాలమిత్రల వినతి

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త :** కనీస వేతనం రూ.26వేలు చెల్లించడంతోపాటు, కుటుంబ సభ్యులకు హెల్త్ ఇన్స్యూరెన్స్ కల్పించాలని రాష్ట్ర పశుసంవర్థకశాఖ మంత్రి వాకిటి శ్రీహరిని గోపాల మిత్రలు కోరారు. ఈ విషయమై గురువారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన గోపాలమిత్ర కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం కల్పించాలని విన్నవించారు. అదే విధంగా రూ.10 లక్షల పరిహారాన్ని అందించాలని కోరారు. కాగా తమ వినతులపై మంత్రి సానుకూలంగా స్పందించారని గోపాలమిత్ర అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సింగం రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేరుకు శ్రీనివాస్, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, గొడ్డు కృష్ణయ్య, అశోక్ శివకుమార్ గోకుల్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రానికి రూ.5681 కోట్ల యుసిఎఫ్ నిధులు

### వరంగల్‌కు రూ.4674 కోట్లు, కరీంనగర్‌కు రూ.840 కోట్లు, ఖమ్మం-కరీంనగర్ కారిడార్ డిజిటల్ గవర్నెన్స్‌కు రూ.166 కోట్లకు ఆమోదం: కేంద్రమంత్రి బండి సంజయ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 21:** తెలంగాణ, ఏపీసహా దేశవ్యాప్తంగా 6 రాష్ట్రాలు యూసీఎఫ్ కింద 17 ప్రాజెక్టుల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపాయి. ఈప్రాజెక్టుల విలువ మొత్తం రూ.14,867.88 కోట్లు. వీటికి కేంద్రం ఆమోదం తెలిపింది. తెలంగాణ విషయానికొస్తే....3 ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం పంపగా వాటికి ఆమోదం తెలిపింది. వీటిలో 1.ఖమ్మం వరంగల్ కరీంనగర్ కారిడార్, 2.వరంగల్ మురుగునీటి ఆధునీకరణ, 3.కరీంనగర్ మోడల్ రోడ్లు, స్కై వాక్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, నాన్ మోటరైజ్డ్ ట్రాన్స్ పోర్ట్ (మోటార్, ఇంధనం ఉపయోగించే రవాణా వాహనాలు) వంటివి ఉన్నాయి. ఈ మూడు ప్రాజెక్టుల విలువ మొత్తం రూ.5681.04 కోట్లు. ఇందులో కేంద్రం 25 శాతం నిధులను ఇవ్వనుంది. అందులో భాగంగా రూ.1420.26 కోట్లను విడుదల చేసింది. అట్లాగే రాష్ట్ర ప్రభుత్వం సైతం తన వాటాగా 25 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా, మిగిలిన మొత్తాన్ని హడ్కో రుణం రూపంలో కేంద్రం నిధులను సమకూర్చనుంది. ఈ మేరకు కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ కార్యదర్శి హీరాలాల్ మిశ్రా నుండి తాజాగా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ అందింది. తొలుత రాష్ట్ర ప్రభుత్వం పంపిన యూసీఎఫ్ ప్రతిపాదనల జాబితాలో కరీంనగర్ లేదు. వరంగల్ కార్పొరేషన్ ప్రతిపాదనలను మాత్రమే యూసీఎఫ్ స్కీంలో చేర్చారు. ఖమ్మం వరంగల్ కరీంనగర్ కారిడార్ ను కూడా ఈ స్కీంలో చేర్చారు. అందులో భాగంగా ఆయా ప్రతిపాదనలకు సంబంధించి డీపీఆర్ (సమగ్ర ప్రాజెక్టు నివేదిక)ను కూడా కేంద్రానికి పంపారు. ఈ విషయం తెలుసుకున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ను సైతం యూసీఎఫ్ జాబితాలో చేర్చాల్సిందేనని పట్టుపట్టారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కరీంనగర్ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్న వెంటనే కరీంనగర్ అభివృద్ధి, ఆధునీకరణలో భాగంగా చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఆగమేఘాల మీద ప్రతిపాదనలు రూపొందించి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రానికి పంపారు. ఇదే అంశంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్ లను కలిసి ఈ ప్రతిపాదనలను ఆమోదించాలని కోరారు. పలుమార్లు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతోనూ చర్చించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కరీంనగర్ ప్రతిపాదనలను ఆమోదించాలంటూ పట్టుపట్టారు. బండి సంజయ్ పట్టుదల నేపథ్యంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్ ఆదేశాల మేరకు తెలంగాణ నుండి వచ్చిన 3 ప్రతిపాదనలకు యూసీఎఫ్ నేషనల్ అపెక్స్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కు నిధుల వరద రానుంది. యూసీఎఫ్ స్కీం ద్వారా రానున్న రూ.840 కోట్ల నిధులతో కరీంనగర్ లో స్కై వాక్ లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు, మోడల్ రోడ్లను నిర్మించనున్నారు. డ్రైయిన్లను పునరుద్ధరించనున్నారు. వరద నీటి నివారణ చర్యలకు సంబంధించిన కార్యక్రమాలను అమలు చేయనున్నారు. మొత్తంగా ఈ నిధులు సద్వినియోగమైతే కరీంనగర్ రూపురేఖలే మారబోతున్నాయి.

## పాతబస్తీ ఎస్‌వైజె కాంప్లెక్సులో భారీ అగ్నిప్రమాదం

### కోట్లాది రూపాయల వస్త్రాల బూడిద

**హైదరాబాద్ (చార్మినార్), మే 21, ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ మదీనా సమీపంలోని ఎస్‌వైజె కాంప్లెక్సులో గురువారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. కోట్లాది రూపాయల విలువ చేసే వస్త్రాలు అగ్ని ప్రమాదంలో కాలి పోయాయి. తమ కళ్ల ముందే షాపులు కాలిపోతుంటే వ్యాపా రులు భోరున విలపిం చారు. ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో షాపులు తెరవక పోవటం తో పెద్ద ప్రమాదం తప్పింది. చార్మినార్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. చార్మినార్ పోలీసులు, స్థానిక వ్యాపారుల కథనం ప్రకారం.. పాతబస్తీ మదీనా సమీపంలో ఉన్న ఎస్‌వైజె కాంప్లెక్సులో మలక్‌పేట్‌కు చెందిన మహ్మద్ ఫైజల్ హుస్సేన్ యూనుస్ కిడ్స్ వస్త్రాల షాపును నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో యూనుస్ కిడ్స్ వస్త్రాల షాపులో అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. పక్కనే ఉన్న షాపులకు కూడ మంటలు రావటంతో మూడు వస్త్రాల షాపులు కాలిపోయాయి. అదే భవనంలోని రెండవ అంతస్తులో కెనరా బ్యాంక్, ఎస్‌బిఐతో పాటు మరో బ్యాంక్ ఉంది. ఎనిమిది ఫైర్ ఇంజన్లు వచ్చి మంటలను ఆర్పివేయటంతో మూడు బ్యాంకులు వరకు మంటలు వేళ్ల లేదు. ఈ అగ్నిప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని పోలీసులు తెలిపారు. చార్మినార్ జోన్ డిసిపి ఖరే కిరణ్ ప్రభాకర్, బహదూర్‌పుర ఎమ్మార్వో బాల శంకర్, చార్మినార్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ రంబాబుతో పాటు పలువురు అధికారులు అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సందర్శించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లనే అగ్ని ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. కాగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరగలేదని టిజిఎస్‌పిడిసిఎల్ చార్మినార్ డిఈ ఎం.శ్రీధర్, చార్మినార్, ఏడిఈ సయ్యద్ మక్సూద్ తెలిపారు. కాగా గత సంవత్సరం పాతబస్తీ దివాన్ దేవిడిలోని ఒకాంప్లెక్సులో జరిగిన అగ్ని ప్రమాదంలో పెద్ద ఎత్తున వస్త్రాలు షాపులు కాలి పోయిన విషయం విధితమే. గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు కోట్ల వరకు ఆస్థి నష్టం జరిగి ఉండవచ్చునని అధికారులు భావిస్తున్నారు. ఈ కేసును చార్మినార్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.




పాతబస్తీ మదీనా సమీపంలోని ఎస్‌వైజె కాంప్లెక్సులోని దుకాణాలు కాలిపోతున్న దృశ్యం

## ఉక్కుపాదం మోపుతున్న పోలీసు శాఖ

### పలు జిల్లాల్లో పెద్దఎత్తున పట్టుబడుతున్న ఫేక్ సీడ్స్

### విత్తనాలు కొనేముందు జాగ్రత్తలు పాటించాలంటున్న వ్యవసాయ శాఖ

# ఖరీఫ్ సీజన్ ముంగిట నకిలీ విత్తనాల బెడద

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:** ఏటా మాదిరిగానే ఈ సారి కూడా రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ముంగిట విత్తన దందాకు అడ్డుకట్టపడటం లేదు. తెలంగాణలో వాన కాలం సీజన్ సమీపించడంతో రైతన్నల కళ్లల్లో సాగుపై ఆశలు చిగురిస్తున్నాయి. ఈ ఏడాది రుతుపవనాలు చురుకుగా కదులుతున్న నేపథ్యంలో జూన్ మొదటివారంలో రాష్ట్రంలోకి ప్రవేశించనున్నాయని వాతావరణశాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో వానాకాలం సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. ఈ నెల 25 నుండి రోహిణి కార్తె ప్రారంభం కానున్న నేపథ్యంలో పత్తి, వరి విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. అయితే సరిగ్గా ఇదే సమయాన్ని కొందరు కేటుగాళ్లు తమకు కాసుల కురిపించే సీజన్‌గా మార్చుకుంటున్నారు. అమాయక రైతుల నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని నకిలీ విత్తనాల మాఫియా కోట్లకు పడగలెత్తుతోంది. మొలకెత్తని విత్తనాలతో రైతన్నల జీవితాలను నడిరోడ్డుపై నిలబెడుతోంది. రాష్ట్రంలో విత్తన మాఫియా నెట్‌వర్క్ చాలా పకడ్బందీగా సాగుతోంది. బ్రాండెడ్ కంపెనీల పేర్లను పోలిన నకిలీ ప్యాకెట్లను తయారు చేయడం ఈ కేటుగాళ్లకు వెన్నతో పెట్టిన విద్య. పొరుగు రాష్ట్రాల సరిహద్దుల గుండా, ఎలాంటి బిల్లులు లేకుండా లూజ్ విత్తనాలను తెచ్చి, ఇక్కడి స్థానిక ఏజెంట్ల ద్వారా గ్రామాల్లోకి జొప్పిస్తున్నారు. తాము విక్రయించే విత్తనాలు సాగు చేస్తే ఎకరానికి 20 క్వింటాళ్ల దిగుబడి గ్యారెంటీ అంటూ నమ్మబలికి అమాయక రైతులకు అంటగడుతున్నారు. ఈ ఏడాది వానా కాలం సాగు విస్తీర్ణం కోటి 30 లక్షల ఎకరాలుగా రాష్ట్ర వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో నకిలీ విత్తనాల మాఫియా పంజా విసురుతోంది. పత్తి, మిర్చి, వరి విత్తనాలు పెద్ద మొత్తంలో పక్క రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుని గ్రామాల్లో ఎరువుల దుకాణాలు నిర్వహించే వ్యాపారుల వద్ద నిల్వలు చేస్తున్నారు. రైతులకు ఆఫర్లు ఇస్తూ హాట్‌కేక్‌లా అమ్ముడుపోయేలా ఎత్తులు వేస్తున్నారు. ఆదిలాబాద్, భూపాలపల్లి, ములుగు, నారాయణపేట, సిరిసిల్ల, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం వంటి జిల్లాల్లో నకిలీ విత్తనాల విక్రయాలు సాగుతున్నట్టు అధికారులు గుర్తించారు. 12 ప్యాకెట్లు ఒక రైతు కొనుగోలు చేస్తే రెండు ప్యాకెట్లు ఉచితం, పక్క రైతులకు విక్రయాలు చేయిస్తే ప్యాకెట్ల ధరలో 10 శాతం కమీషన్ ఇస్తామని గుట్టుగా ప్రచారం చేస్తున్నారు. తొలకరి పడకముందే తమ వ్యాపారాన్ని ముగించి రూ.కోట్లు సంపాదించుకునేందుకు తంటాలు పడుతున్నారు. స్థానిక వ్యాపారులు తమ వద్ద ఎరువులు తీసుకునే రైతులకు అట్టగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతీ వానాకాలం సీజన్‌లోలాగానే ఈ ఖరీఫ్ సీజన్‌లో పత్తి విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం ఉండటంతో విత్తనాలకు అమాంతం గిరాకీ పెరిగిపోయింది. పత్తి విత్తనాలు బలంగా ఉంటేనే రైతుకు పంట దిగుబడి అధికంగా వస్తుంది. అలాంటి విత్తనాలు కలుషితం చేయడంతోపాటు అసలైన వాటి స్థానాల్లో నిషేధిత, నకిలీ విత్తనాలను కేటుగాళ్లు అమ్ముతున్నారు. ఈ ఏడాది దాదాపు 50లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని వ్యవసాయశాఖ అంచనా. మార్కెట్లో పత్తిలో హెచ్‌టీ (బీజీ-3) రకానికి దేశంలో అనుమతి లేదు. గడ్డి, పురుగు మందులను తట్టుకునే ఈ రకాన్ని సాగు చేయడంతో అధిక రసాయన మందులు చల్లి రైతులు రోగాల బారిన పడుతున్నారని గమనించి ప్రభుత్వం ఇటీవలే నిషేధం విధించింది. కానీ దిగుబడి ఎక్కువగా ఉంటుందని కొందరు గుట్టుగా ఈ రకం విత్తనాలను విక్రయిస్తున్నారు. ఏపి, మహారాష్ట్ర పొరుగు రాష్ట్రాల నుంచి గుట్టు చప్పుడు కాకుండా రాష్ట్రంలోకి నకిలీ విత్తనాలను తరలించి విక్రయిస్తున్నారు. మరికొందరు దళారులు నేరుగా విత్తనాలు విక్రయిస్తే పోలీసులకు దొరుకుతామని ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నట్టు తెలిసింది. ఎకరానికి 2 ప్యాకెట్ల చొప్పున విత్తనాలు కావాలి. 450 గ్రాములుండే ప్యాకెట్‌ను దాదాపు రూ.900కు విక్రయించాలని సర్కారు ఆదేశాలు ఇచ్చింది. కానీ ఊరూపేరూ లేని కంపెనీలు, డీలర్లు, వ్యాపారులు ఏజెంట్ల సాయంతో గ్రామాల్లో తిరుగుతూ అధిక ధరలకు అవి నకిలి పత్తి విత్తనాలను అంటగట్టేందుకు సిద్ధమయ్యారన్న ఆందోళనను రైతు సంఘాలు వ్యక్తం చేస్తున్నాయి. వానాకాలం సాగు సమీపిస్తుండడంతో నకిలీ విత్తనాల విక్రయాలపై రాష్ట్ర పోలీసుశాఖ ఉక్కుపాదం మోపుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రధానంగా సరిహద్దు జిల్లాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. ఆదిలాబాద్, వరంగల్‌తోపాటు హైదరాబాద్ నగర శివార్లలో, మంచిర్యాలజిల్లాల్లో ఇటీవల పెద్ద ఎత్తున నకిలీ విత్తనాల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. అయితే విత్తనాల దుకాణదారులు నేరుగా దుకాణాల్లో నకిలీల తంతు నడుపుతున్నా క్షేత్రస్థాయిలో మండల వ్యవసాయాధికారి, మండల విస్తరణాధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని, మామూళ్లు అందుతుండటంతో అటువైపు కనీసం కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నకిలీ విత్తనాల బారినపడకుండా ఉండేందుకు గుర్తింపు పొందిన ఫర్టిలైజర్ షాపులు లేదా ప్రభుత్వ డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనాలని, విత్తనాలు కొన్నప్పుడు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. రశీదుపై విత్తనాల రకం, లాట్ నంబర్, గడువు తేదీ స్పష్టంగా ఉండాలని, సీల్ వేసిన ప్యాకెట్లను మాత్రమే తీసుకోవాలని, ప్యాకెట్‌పై క్యూఆర్ కోడ్ ఉంటే దానిని స్కాన్ చేసి నాణ్యతను ధృవీకరించుకోవాలని గుర్తు చేస్తున్నారు. ప్యాకింగ్ లేని విడి విత్తనాలు తక్కువ ధరకే వస్తున్నాయని దళారుల వద్ద విత్తనాలను కొనుగోలు చేయొద్దని హెచ్చరిస్తున్నారు.

# 23 మందితో సిఎం విజయ్ కేబినెట్




## కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం

**చెన్నై,మే 21:** తమిళనాడులో సిఎం విజయ్ తన టివికె కూటమి ఆధ్వర్యంలో 23 మందితో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో 21 మంది టివికె ఎమ్మెల్యేలు కాగా ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు. చెన్నైలోని లోక్‌భవన్‌లో గురువారం ఉదయం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథన్ ఆర్లేకర్ నూతన మంత్రులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కొత్త మంత్రివర్గంలో కూటమిలోని కాంగ్రెస్‌కు మాత్రమే చోటు దక్కింది. కూటమిలో ఉన్న విసికె, ఐయుఎంఎల్ పార్టీలకు ఎలాంటి పదవులూ కేటాయించలేదు. కాంగ్రెస్ నుంచి రాజేష్ కుమార్, విశ్వనాథన్‌లు మంత్రులుగా ప్రమాణం చేశారు. తమిళనాడులో 59 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో భాగస్వామ్యం కలిగి ఉంది. గతంలో అధికార డిఎంకెతో కూటమిలో ఉన్నప్పటికీ కాంగ్రెస్‌కు మంత్రి పదవులు మాత్రం దక్కలేదు. సిఎన్ అన్నాదురై 1967లో డిఎంకే పార్టీని స్థాపించి, అప్పటి అధికార కాంగ్రెస్ పార్టీపై ఘన విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత నుంచి ఎప్పుడూ అక్కడ కాంగ్రెస్ గెలవలేదు. ఇతర పార్టీలతో కలిసి పోటీ చేసి, కొన్ని స్థానాలు సాధించినా మంత్రి పదవులు మాత్రం దక్కలేదు. తాజాగా ఎంపికైన 23 మంది మంత్రులకు శాఖలను కూడా కేటాయిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

23 మంది మంత్రుల జాబితాలో ఎ. శ్రీనాథ్, కమాలి ఎస్.సి విజయ లక్ష్మి, ఆర్‌వి. రంజిత్ కుమార్, ఆర్ వినోద్, రాజీవ్, బి.రాజ్ కుమార్, వి.గంధిరాజ్, మదన్ రాజా, జగదేశ్వరి, విజయ్ బాలాజీ, లోగేష్ తమిళ్ సెల్వన్, విజయ్ తమిళన్ పార్తీబన్, రమేష్, ఆర్ కుమార్, కే తెన్నారసు, వి సంపత్ కుమార్, మొహమ్మద్ ఫర్వాస్, డి శరత్ కుమార్, ఎన్ మారీ విల్సన్, కే విగ్నేష్ టీవీకే నుంచి మంత్రి పదవులు పొందగా, రాజేష్ కుమార్, విశ్వనాథన్ కాంగ్రెస్ నుంచి మంత్రులుగా ప్రమాణం చేశారు.

**సమయపాలన,క్రమశిక్షణకు కట్టుబడిన సిఎం**

తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి సచివాలయంలో పని సంస్కృతి పూర్తిగా మారుతోంది. ఆయన సమయపాలనను కచ్చితంగా పాటించడం ప్రభుత్వ శాఖలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో పలు విభాగాల్లో ఉద్యోగుల హాజరుపై కఠిన నిబంధనలు అమల్లోకి వస్తున్నాయి. కార్యాలయాల్లో క్రమశిక్షణను పెంపొందించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అధికార వర్గాల సమాచారం ప్రకారం ముఖ్యమంత్రి విజయ్ పదవి చేపట్టినప్పటి నుంచి ప్రతిరోజూ ఉదయం 9:45 నుంచి 10 గంటలమధ్య సచివాలయానికి చేరుకుంటున్నారు. అధికారిక కార్యక్రమాలు ముగించుకుని సాయంత్రం 4:30 లేదా 5గంటల వరకు కార్యాలయంలోనే ఉంటున్నారు. సిఎం అనుసరిస్తున్న ఈ విధానం ఇతర శాఖల అధికారులను, సిబ్బందిని సైతం అప్రమత్తం చేస్తోంది. పని వేళలు ప్రారంభం కాకముందే ఉద్యోగులందరూ విధుల్లో ఉండేలా పరిపాలన విభాగాలపై ఒత్తిడి పెరుగుతోంది. ఈ క్రమంలో ఆహార, పౌరసరఫరాల శాఖ మొట్టమొదటగా అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. అదనపు ప్రధాన కార్యదర్శి పి.బి. శరవణకుమార్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం ఉద్యోగులందరూ ఉదయం 9:50 గంటల కల్లా విధులకు హాజరు కావాలి. ఆఫీస్ అసిస్టెంట్లు ఉదయం 9:30 గంటలకే రావాలని స్పష్టం చేశారు. అండర్ సెక్రటరీలు ఉదయం 10 గంటలలోపు హాజరు రిజిస్టర్లను మూసివేసి, నివేదికను అదనపు ప్రధాన కార్యదర్శి కార్యాలయానికి పంపాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ నిబంధనలు పాటించని వారిపై క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇదే తరహా ఆదేశాలు ఇతర శాఖల్లోనూ జారీ అవుతున్నాయని సచివాలయ వర్గాలు చెబుతున్నాయి. పాలనా సామర్థ్యాన్ని, క్రమశిక్షణను మెరుగుపరిచేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. కొంతమంది ఉద్యోగుల నుంచి ఆందోళన ఈ కొత్త నిబంధనలపై కొంతమంది ఉద్యోగుల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా కామరాజర్ సాలై, మెరీనా రోడ్డు మార్గంలో ప్రయాణించే వారు ఇబ్బందులు పడుతున్నారు. సిఎం కాన్వాయ్ వెళ్లే సమయంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తుండటంతో కార్యాలయాలకు సమయానికి చేరుకోవడం కష్టంగా ఉందని వారు వాపోతున్నారు.

గతంలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన ఎం. కరుణానిధి, జె. జయలలిత, ఎం.కె. స్టాలిన్ వంటి వారు కాస్త ఆలస్యంగా కార్యాలయానికి వచ్చేవారని, అప్పుడు ప్రయాణం సులువుగా ఉండేదని గుర్తుచేస్తున్నారు. మెరుగైన పాలన అందించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ కొత్త క్రమశిక్షణ చర్యలు చేపట్టినట్లు స్పష్టమవుతోంది.



## ఇటలీ ప్రధానికి మోడీ విలువైన కానుకలు

**రోమ్, మే 21:** ప్రధాని నరేంద్ర మోడీ తన ఇటలీ పర్యటనలో భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని, కళా నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, అధ్యక్షుడు సెర్గియో మట్టారెల్లాకు ఆయన అందించిన ప్రత్యేక కానుకలు ఇరు దేశాల మధ్య సాంస్కృతిక బంధాన్ని ప్రతిబింబించాయి. ఈ పర్యటనలో భాగంగా భారత్, ఇటలీ తమ ద్వైపాక్షిక సంబంధాలను ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి పెంచుకున్నాయి. ప్రధాని మోడీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీకి అస్సాంకు చెందిన ప్రఖ్యాత ముగా సిల్క్ శాలువా, మణిపూర్‌కు చెందిన శిరుయి లిల్లీ సిల్క్ శాలువాను బహుమతిగా అందించారు. అస్సాంలోని బ్రహ్మపుత్ర లోయలో మాత్రమే లభించే ముగా సిల్క్‌ను బంగారు పట్టుగా పిలుస్తారు. ఎలాంటి కృత్రిమ రంగులు లేకుండా సహజసిద్ధమైన బంగారు వర్ణంలో మెరిసిపోయే ఈ పట్టుకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. మణిపూర్‌లోని శిరుయి పర్వతాల్లో మాత్రమే పూసే అరుదైన శిరుయి లిల్లీ పువ్వు స్ఫూర్తితో రూపొందించిన శాలువాను కూడా మోడీ అందించారు. ఆసక్తికరంగా ఇటలీ సంస్కృతిలో కూడా లిల్లీ పువ్వుకు పవిత్రత, సౌందర్యానికి ప్రతీకగా ప్రత్యేక స్థానం ఉంది. అధ్యక్షుడికి కళా, సంగీత కానుకలు ఇటలీ అధ్యక్షుడు సెర్గియో మట్టారెల్లాకు ఆగ్రా కళాకారుల నైపుణ్యానికి అద్దం పట్టే మార్బుల్ ఇన్లే వర్క్ బాక్స్‌ను మోడీ బహూకరించారు. పియత్రా దురా లేదా పచ్చికారిగా పిలిచే ఈ అద్భుతమైన కళ వాస్తవానికి ఇటలీలోని ఫ్లోరెన్స్‌లో పుట్టి, మొఘలుల కాలంలో భారత్‌లో ప్రాచుర్యం పొందింది. ఈ కళాఖండం ఇరు దేశాల కళాత్మక బంధానికి నిదర్శనంగా నిలిచింది.

ఈ బాక్స్‌లో సంగీత ప్రపంచంలో శిఖర సమానులైన భారతరత్న పండిట్ భీమ్‌సేన్ జోషి, ఎం.ఎస్. సుబ్బలక్ష్మి ఆలపించిన గీతాల సిడిలను ఉంచి అందించారు. బలపడిన ద్వైపాక్షిక సంబంధాలు ఈ పర్యటనలో ఇరు దేశాలు పలు కీలక ఒప్పందాలు కుదుర్చుకు న్నాయి. 2029 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 20 బిలియన్ యూరోలకు పెంచాలని లక్ష్యంగా పెట్టు కున్నాయి. వ్యవసాయం, ఆర్థిక నేరాల నివారణ, భారత ఆరోగ్య నిపుణుల ఇటలీ వలస వంటి అంశాలపై ఒప్పందాలు జరిగాయి. యుఎఇ, నెదర్లాండ్స్, స్వీడన్, నార్వే, ఇటలీలో ఐదు దేశాల పర్యటనను విజయవంతంగా ముగించుకుని ప్రధాని మోడీ తిరిగి స్వదేశానికి చేరుకున్నారు.




## పాకిస్థాన్ నరమేధ చర్యలను ఎండగట్టిన భారత్

**న్యూయార్క్, మే 21:** అంతర్జాతీయ వేదికపై పాకిస్థాన్‌కు మళ్లీ భంగపాటు తప్పలేదు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌పై నిందలు మోపేందుకు పాక్ ప్రయత్నించింది. అయితే, భారత్ వీటిని గట్టిగా తిప్పికొట్టింది. అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవడంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. సాయుధ ఘర్షణల్లో పౌరులకు రక్షణ కల్పించే అంశంపై ఐరాసలో బహిరంగ చర్చ జరిగింది. ఈ సందర్భంగా పాక్ ప్రతనిధి జమ్మూకాశ్మీర్ అంశాన్ని ప్రస్తావించారు. దీన్ని ఐరాసలోని భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ గట్టిగా తిప్పికొట్టారు. నరమేధ చర్యలకు పాల్పడే దేశం.. భారత అంతర్గత విషయాల గురించి ప్రస్తావించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ యేడాది ఆరంభంలో అఫ్గానిస్థాన్‌పై పాక్ జరిపిన దాడుల గురించి హరీశ్ ప్రస్తావించారు. పవిత్ర రంజాన్ మాసంలో కాబుల్‌లోని ఓ ఆస్పత్రిపై జరిగిన దాడిని ప్రపంచం ఇంకా మరిచిపోలేదన్నారు. చీకట్లో అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకుంటూ.. అంతర్జాతీయ చట్టాల గురించి మాట్లాడటం పాక్ కపటత్వానికి నిదర్శనం' అని విమర్శించారు.

## పెట్రో, డీజిల్ ధరల మరింత పెంపు తప్పదు

### ఐఎంఎఫ్ మాజీ డిప్యూటీ ఎండి గీతాగోపీనాథ్

**న్యూఢిల్లీ, మే 21:** ముడిచమురు, గ్యాస్ దిగుమతులపైనే ఆధారపడిన దేశాల్లో పెట్రోధరలు పెంపు మరింత ఉంటుందని ఐఎంఎఫ్ మాజీ డిప్యూటీ ఎండి గీతాగోపీనాథ్ హెచ్చరించారు. పశ్చిమాసియా యుద్ధం, ఇరాన్ అమెరికా ఇజ్రాయెల్ దాడులకారణంగా ముడిచమురు సరఫరాలో స్తంభన ఏర్పడిందని అన్నారు. రానున్న కాలంలో ముడిచమురు బ్యారెల్‌కు 140 డాలర్లకు పెరిగినా విస్తుపోవాల్సిన పనిలేదని ఆమె పేర్కొన్నారు. ఇందుకోసం ముందు నుంచే వినియోగంలో కుదింపులు అవసరం అవుతాయని, ఇటు కుటుంబీకులు, అటు ప్రభుత్వం రెండూ కూడా ఈ భారం మోయాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## విజయ్ సర్కారును బర్తరఫ్‌చేసి రాష్ట్రపతి పాలన విధించాలని సుప్రీంకోర్టులో పిల్


**న్యూఢిల్లీ,మే 21:** తమిళనాడులో టివికె విజయ్ విశ్వాస పరీక్ష సందర్భంగా భారీ ఎత్తున ఎమ్మెల్యేల కొనుగోళ్లుజరిగాయని, వెంటనే వాటిపై దర్యాప్తుజరిపించి తమిళనాడులో రాష్ట్రపతి పాలన విధించేవిధంగా ఆదేశాలు జారీచేయాలని కోరుతూ సుప్రీం కోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలయింది. ఈనెల 13వ తేదీ విశ్వాస పరీక్ష సందర్భంగా టివికె జోసెఫ్ విజయ్‌పార్టీ భారీ ఎత్తున ఎమ్మెల్యేలను మభ్యపెట్టిందని పిటిషనర్ మదురై నివాసి కెకె రమేష్ ఆరోపించారు.అనైతిక విధానాల్లో విజయ్ ప్రబుత్వం విశ్వాసపరీక్షలో నెగ్గిందని, అప్రజాస్వామ్య సూత్రాలు అనుసరించిందని ఆరోపించారు.ఇతర పార్టీలనుంచి కొందరు ఎమ్మెల్యేలు అనైతికంగా ఈ విశ్వాసపరీక్షలో భాగం అయ్యారని, వారికి భారీ మొత్తంలో సొమ్ములు అందించినట్లు ఆరోపణలున్నాయన్నారు.

## దాడుల్లో పాల్గొన్న హమాస్ మిలిటెంట్ల ఏరివేత

### డిజిటల్ ఆధారాలతో మిలిటెంట్ల జాడపై ఇజ్రాయెల్ నిఘా

**జెరూసలెం, మే 21:** హమాస్ 2023 అక్టోబర్ 7న జరిపిన దాడుల తర్వాత, ఇజ్రాయెల్ తన చరిత్రలోనే అత్యంత భారీ, రహస్యమైన వేటను ప్రారంభించింది. ఈ దాడిలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ గుర్తించి, ట్రాక్ చేసి, హతమార్చడం లేదా పట్టుకోవడమే లక్ష్యంగా ఈ ఆపరేషన్ కొనసాగుతోంది. ఇజ్రాయెల్ నిఘా సంస్థలు ఇందుకోసం ఎఫ్ఎం అనే ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశాయి. హీబ్రూలో ది ఎటర్నల్ వన్ ఆఫ్ ఇజ్రాయెల్ డజంట్ లై అనే అర్థం వచ్చేలా ఈ పేరు పెట్టారు. ఈ ఆపరేషన్ పూర్తిగా సర్వైలెన్స్ టెక్నాలజీ, నిఘా వర్గాల సమాచారం, మిలిటెంట్లు వదిలివెళ్లిన డిజిటల్ ఆధారాలపైనే నడుస్తోంది. దాడుల సమయంలో మిలిటెంట్లు తమ ఫోన్లు, గోప్రోలతో చిత్రీకరించిన వీడియోలు, సోషల్ మీడియా పోస్టులు, ఇంటర్‌సెప్ట్ చేసిన ఫోన్ కాల్స్, సెల్ టవర్ డేటా, మరియు అదుపులోకి తీసుకున్న వారి నుంచి సేకరించిన సమాచారాన్ని విశ్లేషిస్తున్నారు.

దాడుల ఫుటేజ్‌లనుంచి అనుమానితులను గుర్తించడానికి ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్‌లను వాడుతున్నారు. ఎవరినైనా లక్ష్యంగా చేసుకోవడానికి ముందు కనీసం రెండు బలమైన ఆధారాలను నిర్ధారించుకుంటున్నట్లు ఇజ్రాయెల్ అధికారులు



తెలిపారు. ఈ ఆపరేషన్ పరిధి ఎంత విస్తృతంగా ఉందంటే, దాడి సమయంలో సరిహద్దు కంచెను ట్రాక్టర్‌తో కూల్చిన వ్యక్తిని కూడా వదలకుండా, సుదీర్ఘకాలం తర్వాత వైమానిక దాడిలో హతమార్చారు. ఈ రహస్య ఆపరేషన్లు కేవలం గాజాకే పరిమితం కాలేదు. లెబనాన్, ఇరాన్ వంటి దేశాల్లోని హమాస్ సీనియర్ నాయకులను కూడా లక్ష్యంగా చేసుకున్నారు. 2024 జనవరిలో బీరూట్‌లో హమాస్ నేత సలేహ్ అల్‌అరౌరీ, ఆ తర్వాత కొద్ది నెలలకు టెహ్రాన్‌లో హమాస్ రాజకీయ అధినేత ఇస్మాయిల్ హనియే, అక్టోబర్ 7 దాడితో సంబంధం ఉన్న సీనియర్ కమాండర్ ఎజెద్దీన్ అల్‌హద్దాద్‌లను హతమార్చడం ఈ ఆపరేషన్‌లోని కీలక ఘట్టాలు. దాడికి బాధ్యులైన వారిని దాదాపుగా మట్టుబెట్టా మని, గాజా మళ్లీ తమకు ముప్పుగా పరిణమించ కుండా చూస్తామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇటీవల ప్రకటించినట్లు లే మాండే పత్రిక పేర్కొంది. ఈ ఆపరేషన్‌ను చాలా మంది 1972 మ్యూనిచ్ ఒలింపిక్స్‌లో 11 మంది ఇజ్రా యెల్ అథ్లెట్లను చంపిన మిలిటెంట్లపై మొసాద్ జరిపిన దశాబ్దాల వేటతో పోలుస్తున్నారు. మొసాద్ చీఫ్ డేవిడ్ బర్నియా కూడా "మ్యూనిచ్ ఘటన అనంతర ఆపరేషన్ లాగే దీనికీ సమయం పడుతుంది. కానీ వారు ఎక్కడున్నా మా చేతులు వారిని చేరుకుంటాయని వ్యాఖ్యానించడం గమనార్హం.

మరోవైపు, ఈ లక్షిత హత్యలపై అంతర్జాతీయంగా చట్టపరమైన, నైతిక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇవి చట్టవిరుద్ధమైన హత్యలని, అమాయక పౌరుల మరణాలకు కారణమవుతున్నా యని విమర్శకులు ఆరోపిస్తున్నారు. యుద్ధ సమయంలో శత్రు పోరాట యోధులను లక్ష్యంగా చేసుకోవడం చట్టబద్ధమేనని కొందరు నిపుణులు వాదిస్తున్నారు. ఇజ్రాయెల్ దృష్టిలో ఈ వేట కేవలం భద్రతకు సంబంధించింది మాత్రమే కాదు, మానసిక సాంత్వనకు కూడా సంబంధించినది. ఈ ప్రతీకార చర్యల వల్ల హమాస్‌లో చేరే వారి సంఖ్య పెరుగుతోందని, ఇది మరింత హింసకు దారితీస్తుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నప్పటికీ, ఇజ్రాయెల్ తన వేటను ఆపేలా కనిపించడం లేదు.

## జిన్‌పింగ్ మధ్యవర్తిత్వంతో ట్రంప్-కిమ్ మధ్య మళ్లీ చర్చలు?

**ప్యాంగ్యాంగ్, మే 21:** అమెరికా-ఉత్తరకొరియా మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. అగ్రరాజ్యంపై దాడికి వీలుగా కిమ్ ప్రభుత్వం క్షిపణి ఇంజిన్లు, అణు ఆయుధాలను పరీక్షించడంతో అవి మరింత తీవ్రస్థాయికి చేరాయి. ఈ నేపథ్యంలో ఇరు దేశాల మధ్య చైనా అధ్యక్షుడు షీజిన్‌పింగ్ మధ్యవర్తిత్వం వహించే అవకాశం ఉందని దక్షిణ కొరియా మీడియాలో వార్తలు వచ్చాయి. వచ్చే వారంలో జిన్‌పింగ్ ఉత్తరకొరియా పర్యటనకు వెళ్లనున్నారని తెలుస్తోంది. అందుకోసం సన్నాహాలు జరుగుతున్నాయి. ఇప్పటికే చైనా సెక్యూరిటీ, ప్రొటోకాల్ బృందాలు ఆ దేశంలో పర్యటించాయి. ఇరు దేశాల సంబంధాలు బలోపేతం చేసుకునే దిశగా ఈ పర్యటన జరగనుందనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. ఉత్తరకొరియా ప్రస్తుతం అణునిరాయుధీకరణ చర్చలకు ఆసక్తి చూపడం లేదు. ఒకవేళ ఏదైనా దాడుల్లో కిమ్ మరణిస్తే.. తక్షణమే అణుదాడులు చేసేలా ఉత్తరకొరియా తన విధానాలను సవరించినట్లు తెలుస్తోంది. అమెరికా-ఇజ్రాయెల్ తొలిరోజు జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీ సహా అనేకమంది సీనియర్ నాయకులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఉత్తరకొరియా ఈ మార్పులు చేసినట్లు తెలుస్తోంది. ఈ కొత్త విధానాలపై ఆందోళన వ్యక్తమవుతోంది.

ఈ నేపథ్యంలోనే జిన్‌పింగ్ పర్యటన జరుగుతోంది. ఆంక్షలతో సతమతమవుతోన్న కిమ్ రాజ్యానికి చైనా నుంచి ఆర్థిక సహాయం అందుతోంది. తమ మధ్య సంబంధాలు బలోపేతం చేసుకునేందుకు రెండూ చర్యలు తీసుకుంటున్నాయి. ఈ క్రమంలో ప్రాంతీయ అస్థిరతలకు చెక్ పట్టే దిశగా.. ట్రంప్, కిమ్‌ల మధ్య మధ్యవర్తిత్వం వహించేందుకు జిన్‌పింగ్ ప్రయత్నించవచ్చని తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. గతంలో ట్రంప్ అధికారంలో ఉన్న సమయంలో ఉత్తరకొరియా విషయంలో పట్టు విడుపులతో వ్యవహరించారు.

2019లో వియత్నాంలో ట్రంప్-కిమ్‌జోంగ్ ఉన్ భేటీ అయ్యారు. కానీ, అణ్వాయుధాలు వదిలేసే విషయంలో ఉత్తర కొరియా వెనక్కి తగ్గకపోవడంతో ఆ చర్చలు విఫలమైన సంగతి తెలిసిందే.

## కర్ణాటకలో మరోసారి వేడెక్కిన కాంగ్రెస్ రాజకీయాలు



### కేరళ తరహాలోనే పరిష్కరించాలని డికెవర్గం మంకుపట్టు

### ఐదేళ్లు కొనసాగించాలంటున్న సిద్దూ వర్గం

**బెంగళూరు, మే 21:** కేరళం ఎన్నికల ఫలితాలు వెలువడిన 10 రోజుల తర్వాత ముఖ్యమంత్రి పంచాయితీని పరిష్కరించిన కాంగ్రెస్ హైకమాండ్ కర్ణాటకను మాత్రం సరిదిద్దలేకపోతోంది. ముఖ్యమంత్రి పీఠంపై డికె శివకుమార్ ఎప్పటి నుంచో ఆశలు పెట్టుకున్నారు. కానీ సిద్ధరామయ్య మాత్రం ఆ పీఠాన్ని వదులుకునేందుకు మాత్రం సిద్ధంగా ఉన్నట్లు కనిపించడం లేదు. దీంతో డికె.శివకుమార్ వర్గంలో నిరాశ వ్యక్తం అవుతోంది. ఈసారి తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నట్లుఇద్దరి ధోరణులు చెపుతున్నాయి.

కర్ణాటకకు సంబంధించిన అన్ని విషయాలను పరిష్కరించడానికి కాంగ్రెస్ హైకమాండ్ మే నెలాఖరులోగా ఒక కీలక సమావేశం నిర్వహించే అవకాశం ఉందని వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. భవిష్యత్ వ్యూహంపై చర్చించేందుకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్‌లను ఢిల్లీకి పిలిపించవచ్చని సమాచారం. సిద్ధరామయ్య దాదాపు ఆరు నెలలుగా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు పార్టీ నాయకత్వం అనుమతి కోసం ఎదురుచూస్తున్నారు. సిద్ధరామయ్య ప్రభుత్వం ఏర్పడి మూడేళ్ళు పూర్తవుతోంది. ఈ నేపథ్యంలో మరోసారి సిఎం పంచాయితీ తెరపైకి వచ్చింది. ఇక ముఖ్యమంత్రి పదవిపై డికె శివకుమార్, కొత్తగా హోం మంత్రి జి. పరమేశ్వర ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం వీరిద్దరి మధ్య పోటీ నెలకొన్నట్లుగా తెలుస్తోంది. గత నవంబర్‌లో సిద్ధరామయ్య ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు పూర్తయినప్పుడు డికె శివకుమార్ 'రెండున్నర సంవత్సరాల ఫార్ములా ఆధారంగా ముఖ్యమంత్రి పదవి కోసం ఒత్తిడి చేయడం ప్రారంభించారు.

కాంగ్రెస్ నాయకత్వం జోక్యం చేసుకుని వర్గపోరాటాన్ని అణచివేసింది. ముఖ్యమంత్రి పదవి దక్కకపోవడంతో డీకే శివకుమార్ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణను కూడా అడ్డుకున్నారు. కేరళం, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత కర్ణాటక విషయంపై నిర్ణయం తీసుకుంటారని అప్పట్లో వర్గాలు తెలిపాయి. ఇప్పుడు ఆ సమయం రానే వచ్చింది. ఒకవైపు ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు పూర్తయింది. మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానంతో సహా కర్ణాటక నుంచి మూడు రాజ్యసభ స్థానాలు జూన్‌లో ఖాళీ కానున్నాయి. రాబోయే రెండు నెలల్లో కర్ణాటక శాసన మండలిలోని సుమారు తొమ్మిది స్థానాలు కూడా కాంగ్రెస్ పార్టీ ఖాతాలోకి వెళ్లే అవకాశం ఉంది. అన్ని నిర్ణయాలు ఢిల్లీ నుంచే తీసుకోవాల్సిన అవసరం ఉంది. కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై కాంగ్రెస్ చర్చిస్తుందా లేదా అన్నదే అతిపెద్ద ప్రశ్న. ప్రస్తుతం 79 ఏళ్ల వయసులో ఉన్న సిద్దరామయ్యకు వయసు పైబడుతుండటంతో ఆయన నాయకత్వంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి కాంగ్రెస్ సుముఖంగా లేదని ఆ వర్గాలు అంటున్నాయి.

2023 మేలో కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు రెండున్నరేళ్ల రొటేషన్ పద్ధతిలో అంటే సగం పదవీకాలానికి ముఖ్యమంత్రి పదవి ఇస్తామని తనకు హామీ ఇచ్చారని డీకే శివకుమార్ చెబుతున్నారు. మరోవైపు దళిత వర్గానికి చెందిన హోం మంత్రి పరమేశ్వరను ముఖ్యమంత్రిగా నియమించాలని ఆయన మద్దతుదారులు డిమాండ్ చేస్తూనే ఉన్నారు. కర్ణాటకకు ఇప్పటివరకు దళిత ముఖ్యమంత్రి ఎవరూ లేరు. ముఖ్యమంత్రి పదవి సమస్య కారణంగా ఆరు నెలలుగా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ నిలిచిపోయింది. సిద్దరామయ్య ప్రభుత్వంలోని సగానికి పైగా మంత్రులను మార్చనున్నారని వర్గాలు చెబుతున్నాయి. కొన్ని వారాల క్రితం మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ కోరుతూ కర్ణాటకకు చెందిన సుమారు డజను మంది ఎమ్మెల్యేలు ఢిల్లీలో మకాం వేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, ఆర్గనైజేషన్ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ రణదీప్ సుర్జేవాలా మొదట సిద్దరామయ్య, డీకే శివకుమార్‌లతో సమావేశమవుతారు. తుది నిర్ణయం రాహుల్ గాంధీ చేతిలోకి వెళ్లింది.

## మదర్సాల్లో వందేమాతరం తప్పనిసరి



**కోల్‌కత్తా, మే 21:** పశ్చిమ బెంగాల్ లోని బిజెపి ప్రభుత్వం అన్ని మదర్సాలలో వందేమాతరం తప్పనిసరిచేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకొస్తూ రాష్ట్రంలోని అన్ని మదర్సాలలో వందేమాతరం గీతాన్ని ఆలపించాలని సువేందు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర మదర్సా విద్యా డైరెక్టరేట్ విడుదల చేసిన ఈ కొత్త నిబంధనల ప్రకారం ప్రభుత్వ, ప్రభుత్వ సహాయం పొందే, అలాగే గుర్తింపు పొందిన అన్ని రకాల మదర్సాలు, ఎంఎస్‌కే, ఎస్ఎస్‌కే సంస్థలలో రోజువారీ తరగతులు ప్రారంభమయ్యే ముందు నిర్వహించే ప్రార్థనా సమావేశాల్లో ఈ జాతీయ గీతాన్ని తప్పనిసరిగా ఆలపించాల్సి ఉంటుంది. గతంలో అమలులో ఉన్న అన్ని పాత పద్ధతులను, ఉత్తర్వులను రద్దు చేస్తూ ఈ ఏకరీతి విధానాన్ని తక్షణమే అమలులోకి తీసుకువచ్చారు. రాష్ట్ర మైనారిటీ వ్యవహారాలు, మదర్సా విద్యాశాఖ మంత్రి ఖుదీరామ్ టుడు ఈ నిర్ణయాన్ని పూర్తిగా సమర్థించారు.

ఇప్పటికే రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో సంతాలి భాషలో బోధన జరుగుతోందని, అక్కడ కూడా వందేమాతరం గీతాన్ని విజయవంతంగా ఆలపిస్తున్నారని ఆయన గుర్తుచేశారు. కాబట్టి మదర్సాలలో దీనిని అమలు చేయడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండకూడ దని, ఇది కేవలం జాతీయవాదం, విద్యార్థుల్లో క్రమశిక్షణను పెంపొందించేందుకు ఉద్దేశించిన అంశమని స్పష్టం చేశారు.

## ఇరాన్ యుద్ధంపై ట్రంప్ నెతన్యాహుల మధ్య వాగ్యుద్ధం

**వాషింగ్టన్, మే 21:** ఇరాన్ యుద్ధాన్ని ముగించే వ్యూహంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మధ్య విభేదాలు భగ్గుమన్నట్లు వైట్‌హౌస్ వర్గాల సమాచారం. ఇద్దరు నేతల మధ్య దాదాపు గంటపాటు ఫోన్లో వాగ్వాదం జరిగినట్లు సమాచారం. ఇరాన్‌పై వెంటనే వైమానిక దాడులు ప్రారంభించాలని నెతన్యాహు ఒత్తిడి చేయగా, దౌత్య చర్చలకు మరో అవకాశం ఇవ్వాలని ట్రంప్ పట్టుబట్టినట్లు తెలుస్తోంది. ఈ ఫోన్ కాల్ తర్వాత నెతన్యాహు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. ఇరాన్‌తో శాంతి చర్చలపై నెతన్యాహు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. దాడులను ఆలస్యం చేయడం పెద్ద పొరపాటని, ఇరాన్ సైనిక సామర్థ్యాలను దెబ్బతీసేందుకు ప్లాన్ ప్రకారం యుద్ధాన్ని కొనసాగించాల్సిందేనని ఆయన ట్రంప్‌తో వాదించినట్లు తెలుస్తోంది. యుద్ధానికి స్వస్తి పలికేలా అమెరికా ఇరాన్ మధ్య సంతకాలకు ఖతార్, పాకిస్థాన్ దేశాలు మధ్యవర్తిత్వం వహిస్తున్నట్లు ట్రంప్ వివరించినట్లు తెలుస్తోంది. అణు కార్యక్రమం, హర్మూజ్ జలసంధి తెరిచే అంశాలపై 30 రోజులపాటు చర్చలుజరపాలని ట్రంప్ భావిస్తున్నారు. ఒకవేళ అవి విఫలమైతే మళ్లీ యుద్ధం చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం. నెతన్యాహుతో తీవ్రమైన విభేదాలు వచ్చినా ట్రంప్ మాత్రం బయటకు ఏమీ తెలియనట్లే వ్యవహరిస్తున్నారు. ఇరాన్ విషయంలో తాను ఏం చెబితే నెతన్యాహు అదే వింటారని ట్రంప్ మీడియాకు తెలిపారు. ఖతార్, సౌదీఅరేబియా, యుఎఇవంటి అరబ్‌దేశాల అభ్యర్థన మేరకే ఇరాన్‌పై దాడుల ప్రణాళికను తాత్కాలికంగా ఆపినట్లు ట్రంప్ గతంలోనే ప్రకటించారు.

## పుల్వామా ఉగ్రదాడి మాస్టర్‌మైండ్ హతం

### పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో అదృశ్యశక్తుల హత్య



**శ్రీనగర్, మే 21:** పుల్వామా ఉగ్రదాడి మాస్టర్ మైండ్స్‌లో ఒకడైన హంజా బుర్హాన్ అలియాస్ డాక్టర్ హతమయ్యాడు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ రాజధాని ముజఫరాబాద్‌లో గుర్తుతెలియని సాయుధులు జరిపిన కాల్పుల్లో అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. హంజా బుర్హాన్ అసలు పేరు అర్జుమంద్ గుల్జార్ దార్. పుల్వామా జిల్లా రత్నిపోరా ప్రాంతానికి చెందిన అతడు 2017లో ఉన్నత చదువుల కోసమంటూ పాకిస్థాన్ వెళ్లాడు. అక్కడ నిషేధిత ఉగ్రవాద సంస్థ అల్ బదర్‌లోచేరి కమాండర్‌గాఎదిగాడు. తర్వాత కశ్మీర్‌లోని యువతను ఉగ్రవాదం వైపు ఆకర్షించ డానికి, వారిని తీవ్రవాదులుగా మార్చడానికి దక్షిణ కశ్మీర్‌లో పెద్ద నెట్‌వర్క్ నడిపినట్లు రికార్డులు చెబున్నాయి. 2019 ఫిబ్రవరి 14న జరిగిన పుల్వామా దాడిలో 40మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లు అమరులైన సంగతి తెలిసిందే. ఈ దాడికి పాల్ప డిన జైషే మహ్మద్ ఉగ్రవాదులకు హంజా బుర్హానే పేలుడు పదార్థాలు, గ్రెనేడ్లు సరఫరా చేసినట్లు భారత భద్రతా సంస్థలు గుర్తించాయి. దీనితో పాటు 2020లో జరిగిన మరో గ్రెనేడ్ దాడిలోనూ ఇతడి ప్రమేయంఉంది. దీనిపై భారత హోం మంత్రిత్వ శాఖ 2022లోనే ఇతడిని ఉగ్రవాదిగా ప్రకటించింది. గత రెండేళ్లుగా పాకిస్థాన్, పీఓకే పరిధిలో భారత మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులు వరుసగా హతమవుతున్నారు. లష్కరే తోయిబా, జైషే మహ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి సంస్థల టాప్ కమాండర్లను అజ్ఞాత వ్యక్తులు టార్గెట్ చేస్తూ వస్తున్నారు.

## ఎయిరిండియాకు తృటిలో తప్పిన ప్రమాదం

### లాండింగ్‌లో నేలను బలంగా తాకిన తోక

**న్యూఢిల్లీ, మే 21:** దేశ రాజధాని ఢిల్లీ నుంచి బెంగళూరుకు వచ్చిన ఎయిరిండియా విమానానికి ల్యాండింగ్ సమయంలో త్రుటిలో ప్రమాదం తప్పింది. రన్‌వేపై దిగుతున్న తరుణంలో దాని తోక భాగం భూమిని బలంగా తాకింది. అయితే పైలట్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో అంతా సురక్షితంగా బయటపడ్డారు. ఢిల్లీ నుంచి బెంగళూరుకు 179 మంది ప్రయాణికులతో వచ్చిన ఎఐ 2651 ఎయిర్‌బస్ విమానం ల్యాండింగ్ కావడానికి సిద్ధమైంది. సరిగ్గా అదే సమయంలో రన్‌వేపై నుంచి మరో పెద్ద విమానం టేకాఫ్ కావడంతో గాల్లో తీవ్రమైన గాలిఉద్ధృతి ఏర్పడింది. దాంతో విమానం బ్యాలెన్స్ తప్పింది. పైలట్లు ల్యాండింగ్ నిర్ణయాన్ని మార్చుకుని మళ్లీ విమానాన్ని పైకి లేపేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలోనే విమానం తోకభాగం రన్‌వేనుగీసుకుంటూ వెళ్లింది. ఎయిరిండియా సంస్థ ఈ ఎయిర్‌బస్ ఏ321 విమానాన్ని తదుపరి తనిఖీల కోసం ఎయిర్‌పోర్టులోనే నిలిపివేసింది. దీనివల్ల బెంగళూరు నుంచి తిరిగి ఢిల్లీ వెళ్లాల్సిన ఎఐ2652 ఫ్లైట్‌ను క్యాన్సిల్ చేశారు. ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు సంస్థ ప్రతినిధి తెలిపారు. ప్రమాదంపై విమానయాన నియంత్రణ సంస్థ డిజిసిఎ దర్యాప్తు ప్రారంభించింది.

# ముడతలూ, మచ్చలూ లేకుండా..



30వ పడిలోకి అడుగు పెట్టగానే... వృద్ధాప్య ఛాయలు మొదలై పోయాయని బాధపడేవారే ఎక్కువ. ఈ సమస్యనుంచి బయటపడటానికి ఏవేవో మార్గాలను కనిపెట్టపెడతారు. వాటిలో మాయిశ్చరైజర్ల వాడకం ఒకటి. అయితే, సరైన వాటిని ఎంపిక చేసుకోకపోయినా, రాసుకునే విధానం తెలియకపోయినా... సమస్య మరింత జటిలం అవుతుంది. అసలు దీన్నెల వాడాలంటే... చాలామంది పొడిబారిన చర్మంపై మాయిశ్చరైజర్ రాస్తుంటారు. అలాకాకుండా చర్మం కాస్త తడిగా ఉన్నప్పుడు మాత్రమే దీన్ని రాయాలి. అప్పుడే ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇప్పుడంతా ఉరుకులూ, పరుగులే... ఆ కంగారులో దీన్ని రాసుకొని, వెంటనే మేకప్ వేసుకునే వాళ్లే ఎక్కువ. దీనివల్ల చర్మకణాలు మూసుకుపోయి, వృద్ధాప్య ఛాయలు తొందరగా వచ్చేస్తాయట. అందుకే దీన్ని రాసుకున్నాక 1015 నిమిషాలైనా ఆరనివ్వాలి. అప్పుడే అనుకున్న స్థాయిలో ఫలితం ఉంటుంది. చాలా మాయిశ్చరైజర్స్‌లో చర్మానికి హాని చేసే రసాయనాలు ఉంటాయి. అందుకే వీటి ఎంపికలో సహజ సిద్ధమైన వాటితో తయారైన వాటికి ప్రాధాన్యత ఇవ్వండి. ఒకవేళ వేరే ఉత్పత్తులు వాడినా... తయారీలో వాడే వస్తువులు, స్థాయులూ మీ చర్మతత్వానికి సరిపోతాయో లేదో తెలుసుకుని... వైద్యుల సలహా మేరకు తీసుకుంటేనే మేలు. చర్మ సంరక్షణలో ముఖానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి... మెడను అలానే వదిలేస్తారు. దాంతో పిగ్మెంటేషన్, ముడతలు పడి... ఎక్కువ వయసు వారిలా కనిపిస్తారు. కాబట్టి ముఖంతో పాటూ మెడకు దీన్ని రాయాలి. వాడుకలో పరిమాణమూ ముఖ్యమే. ఏ చర్మతత్వానికి ఎంతమేర మాయిశ్చరైజర్ వాడొచ్చో తెలుసు కోవాలి. అలాకాకుండా, ఎక్కువ, తక్కువ రాస్తే అనుకున్న స్థాయిలో ఫలితాలు ఉండవు ఆ స్కిన్‌ను కాబట్టి మాయిశ్చరైజర్స్ అవసరం లేదనుకుంటారు చాలామంది. కానీ దీనికీ ఇవి అవసరమే. □

# ఎనర్జీ డ్రింక్స్ తాగుతున్నారా?



తక్షణ శక్తి కావాలను కున్న ప్పుడో, సరదాగా కబుర్లు చెప్పుకుంటు న్నప్పుడో వెంటనే మనకు గుర్తొచ్చేవి ఎనర్జీ డ్రింక్‌లే. అయితే జాగ్రత్తలు కూడా అవసరం.

క్షణం తీరికలేని ఈ జీవితాల్లో తక్షణ శక్తినిచ్చే ఆహారానికీ, పానీయాలకూ మనం అలవాటుపడ్డా మనటంలో సందేహం లేదు. అయితే ఈ సౌకర్యమే మన అనారోగ్యాలకు కారణమవుతోందట. వీటిని తక్కువ మొత్తాల్లో తీసుకున్నా సరే.. విద్యార్థుల్లో నిద్రలేమి సమస్య లొస్తున్నట్లు తాజా పరిశోధనల్లో వెల్లడైంది. నిద్రలేమికి జీవనశైలి,ఒత్తిడి, నిద్రవేళలు సక్రమంగా లేకపోవటం.. వంటివి కారణమైనప్పటికీ ఇదీ ఓ కారణమవుతోందట. సాధారణంగా ఎనర్జీ డ్రింక్‌లు త్వరగా శక్తినిస్తాయని, శారీరకంగా, మానసికంగానూ చురుగ్గా ఉండొచ్చని తీసుకుంటాం. అయితే వీటిల్లో ఉండే కెఫీన్.. కేంద్ర నాడీ వ్యవస్థను స్టిమ్యులేట్ చేసి, అలసటను తగ్గిస్తుంది. అయితే ఇవి అందరిలోనూ ఒకేలాంటి ప్రభావం చూపించవచ్చు. ఒక వ్యక్తి కుండే కెఫీన్ సెన్సి టివిటీ,ఆరోగ్యం, వారికున్న ఇతర వ్యాధులను బట్టి ఫలితాలు వేరుగా ఉంటాయట. వీటిని ఎక్కువగా తీసుకుంటే బిపి పెరగటం, ఆందోళన, గుండె సంబంధిత వ్యాధులు, జీర్ణ సమస్యల వంటివి తలెత్తుతాయట. వీటిలో ఉండే పంచదార బరువు పెరిగేలా చేయ టమే కాదు. దంత సమస్యలనూ తెచ్చి పెడు తుంది. ఈ ఎనర్జీ డ్రింకుల వల్ల అందరికీ ఒకేలాంటి ప్రయోజనాలు అందవనీ వాటిని పరిమితంగా తీసుకోకుంటే అనారోగ్యాలు తప్పవనీ వైద్యులు సూచిస్తున్నారు.

**ప్రత్యామ్నాయం ఇలా...** శక్తి తగ్గకుండా ఉండాలంటే ముఖ్యంగా చేయాల్సినది శరీరంలో నీటి శాతం తగ్గకుండా చేసుకోవటం. అందుకోసం నీళు, హెర్బల్ టీ, ఇన్‌ఫ్యూజ్‌డ్ వాటర్‌ను (పండ్లను వేసి ఉంచినవి) తీసుకుంటే ఉల్లాసంగానూ ఆరోగ్యంగానూ ఉంటాం. నట్స్ పెరుగు, పండ్లు, తృణధాన్యాలతో చేసిన క్రాకర్స్ వంటివి చిరుతిళ్లుగా తీసుకోవచ్చు. వీటిలోని సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు, ఆరోగ్యకరమైన కొవ్వులూ, ప్రొటీన్లూ ఆకలిని తీర్చటమే కాకుండా శరీరానికి పోషకాలనూ అంది స్తాయి. అలానే కూరగాయలు, పండ్లతో స్మూతీ చేసుకుని దాన్లో కొంచెం తీనె కలిపి తీసుకుంటే శక్తి కోల్పోకుండా ఉంటాం. లేదంటే తాజా పండ్ల రసాలు తీసుకున్నామంచిదే. □

# పిల్లలు, కెరియర్ సమన్వయం !



**మాతృత్వం** ఓ మధురానుభూతి. కానీ ఆ ప్రయాణంలో శారీరకంగా, మానసికంగా, భావోద్వేగాలపరంగా, సామాజికంగా మనం ఎదుర్కొనే సవాళ్లనేకం. ఓవైపు తల్లిగా బాధ్యతలు నెరవేరుస్తూ, మరోవైపు కెరియర్‌నీ సమన్వయం చేసుకోవడం అంత తేలికేం కాదు. అందుకే చాలామంది ఉద్యోగినులు ప్రమోషన్లూ, వేతనాల విషయంలో రాజీపడుతున్నారు. కొంతమందైతే అసలు ఉద్యోగాన్నే వదిలేస్తున్నారు. ఈ పరిస్థితినే 'మదర్‌హుడ్ పెనాల్టీ'గా అభివర్ణిస్తున్నారు నిపుణులు. తొలి బిడ్డ పుట్టిన మొదటి ఏడాది 24 శాతం మహిళలు ఉద్యో గాల్ని వదిలేస్తుంటే, ఐదేళ్ల తర్వాతా చేరనివారు. 17 శాతం. పదేళ్లయ్యాకా కూడా చేరని మహిళలు 15 శాతమట. ఇప్పుడిప్పుడే భర్తా.. పిల్లల బాధ్యతల్ని పంచుకోవడం సంతోషించదగ్గ విషయమే అయినా, ఆడవాళ్లు చేసే పనిలో మూడో వంతు మాత్రమే చేస్తు న్నారట. ఇప్పటికీ చాలామంది మహిళలపై ఇల్లూ, ఉద్యోగంతో పాటు అదనపు పనిభారం ఉంటూనే ఉంటుంది. నిజానికి అమ్మకాని మహిళలకూ, తల్లులకూ మధ్య వేతనాల్లో ఉండే తేడా ఆడా, మగా వేతనాల్లో ఉండే భేదం కంటే ఎక్కువట. ఎందుకంటే తల్లయిన మహిళ సమర్థవంతంగా పనిచేయలేదనీ, ఎక్కువగా భావోద్వేగాలకు లోనవుతుంటారనీ భావించడమే అందుకు కారణమట. పిల్లల బాధ్యతలతో ఈ 'మమ్మీట్రాక్'లో పడి చాలామంది మహిళలు తమ సామర్థ్యాల కంటే తక్కువ ఉద్యోగాల్లో సర్దుకుపోతున్నారు. కెరియర్లో ఎదిగే అవకా శాలు పోగొట్టుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో మార్పు రావాలంటే నిజానికి ప్రభుత్వ విధానాలు మాత్రమే సరిపోవు. ఇంట్లోనూ, సంస్థల ఆలోచనా విధానాల్లోనూ మార్పురావాల్సి ఉంది. అప్పుడే సమానత్వం సాధించ గలం. అమ్మ మోస్తోన్న ఈ శిక్షను తగ్గించగలం. □

# 'సర్వేజనాః సుఖినో భవంతు'

**హిమాలయమంత ఉన్నతమైంది**, గంగా జలంలా పవిత్రమైంది హిందూధర్మం. అందుకే ఈ ధర్మం యుగయుగాలుగా మనుగడ సాగిస్తూ కొనసాగుతోంది. ఇది వేదాల్లోంచి జన్మించినందు వల్లే ఇంతటి శక్తి కలిగుంది. అందుకే మనదేశాన్ని వేదభూమి, కర్మభూమి, ధర్మభూమి, పుణ్య భూమి అంటూ వర్ణించారు. సమైక్యంగా, ప్రేమభావంతో జీవించమని ఉపదేశిస్తున్నాయి వేదాలు. కుటుంబంలోనూ ఒకరితో ఒకరు ఎలా ప్రవర్తించాలో బోధిస్తాయి. తండ్రిని అనుకరించాలని, తల్లి మనసును నొప్పించకూడదని, భార్యాభర్తలు పరస్పర అవగాహనతో ఉండాలని తెలియజేస్తున్నాయి. తొడపుట్టినవాళ్లు కలహించుకో కూడదని పేర్కొంది అధర్వణవేదం. కుటుంబమే కాదు, సమాజశ్రేయస్సూ ముఖ్యమని, సకల ప్రాణకోటీ ఐక్యతంగా ఉండాలని బోధిస్తుంది రుగ్వేదంలోని సంపన్న సూక్తం. సంపన్న అంటే జయించడం అనే అర్థముంది. అంటే అవసరమైనవి సాధించు కునేలా ప్రేరేపిస్తుంది. ఇలా వేద ఆధారితమైన హిందూధర్మం- 'సర్వేజనాఃసుఖినో భవంతు' అంటూ సర్వ జనావళి సుఖంగా ఉండాలని ఆకాంక్షి స్తుంది. ప్రకృతిలో అణువణువునా పరమాత్మను దర్శిస్తుంది. ప్రకృతినే గురువుగా భావిస్తుంది. ప్రకృతి నుంచే పాఠాలు నేర్చు కోమంటుంది. తులసిమొక్కకి పవిత్ర స్థానం ఇచ్చింది హిందూ ధర్మం. సర్వతీర్థాలను, దేవతలను కలిగున్న తులసిని తులసీమాతగా కీర్తించింది. హిందూ ధర్మం ప్రవచించే సూత్రాలన్నింటిలో ఆధ్యాత్మికత ఇమిడి ఉంటుంది. మన ఆచారాలు భక్తిని ప్రేరేపించడమే కాదు. ప్రశాంతత నిచ్చి, అభ్యున్నతి దిశగా నడిపిస్తాయి. □

# స్పడ్‌గా ఆడుదాం..



ముందుగా పిల్లల్లో ఎవరో ఒకరు బంతిని గాల్లోకి ఎగరవేయాలి. ఎగరవేసిన వెంటనే ఇతర పిల్లల్లో ఎవరో ఒకరి పేరుని గట్టి అరవాలి. అలా ఎవరి పేరు చెప్పారో వాళ్లు ఆ బాల్‌ని కిందపడే లోగా పట్టుకోవాలి. వెంటనే ఎస్‌పియూడి (స్పడ్) అని అరవాలి. దీంతో మిగతా పిల్లలు ఎక్కడ ఉన్నవాళ్లు అక్కడే కదలకుండా ఉండిపోవాలి. బాల్ పట్టుకున్న పిల్లవాడు నిల్చున్న చోటునుంచే దాన్ని ఎవరో ఒకరి మీదకు విసరాలి. బాల్ తగిలిన వాళ్లకు ఒక 'ఎస్' అక్షరం వచ్చినట్లు. తర్వాత వాళ్లే బాల్‌ను కూడా పైకి విసరాల్సి ఉంటుంది. అలా ఎవరికైతే ముందుగా ఎస్‌పియూడి అక్షరాలు వస్తాయో వాళ్లు ఓడిపోయినట్లు మిగిలిన వాళ్లు ఆటను కొనసాగిస్తారు! ఈ ఆటవల్ల పిలల్లో మెంటల్ అలర్జ్‌నెస్ అలపడుతుంది. □

# ఫ్రిజ్‌లో ఎంత సమయం పెట్టాలి?



**ఫ్రిజ్‌లో పెడితే పదార్థాలు పాడైపోవు అనుకుంటారు. కానీ వాటికీ ఎక్స్‌పైరీ డేట్ ఉంటుంది. అంతేకాదు. అవి చూడ్డానికి, రుచికి బాగానే ఉంటాయి. కానీ మన ఆరోగ్యాన్ని పాడు చేసే బ్యాక్టీరియా వాటిలో అభివృద్ధి చెందు తుంది. కాబట్టి ఏ పదార్థం ఎప్పుడు ఫ్రిజ్‌లో పెట్టాలి? ఎన్ని రోజులు ఉంచాలి?**

ఏ కాలంలోనైనా ఫ్రిజ్‌లో ఉష్ణోగ్రత 40 డిగ్రీల ఫారన్‌హీట్ (4.4 డిగ్రీల సెల్సియస్)కు మించ కుండా చూసుకోవాలి. పాలు, పాల పదార్థాలు, మాంసం, కోడిగుడ్లు, చేపలు.. వంటి త్వరగా పాడైపోయే పదార్థాలు బయటి నుంచితెచ్చిన రెండు గంట ల్లోపే ఫ్రిజ్‌లో పెట్టేయాలి. ఒకవేళ బయట ఉష్ణోగ్రత 90 డిగ్రీల ఫారన్‌హీట్ (32.2 డిగ్రీల సెల్సియస్) కంటే ఎక్కువగా ఉన్నట్లయితే తెచ్చిన గంటలోపే ఈ పదార్థాల్ని ఫ్రిజ్‌లో పెట్టాలి. గడ్డకటిని పదార్థాలను కిచెన్ ప్లాట్ ఫామ్, టేబుల్‌పై పెట్టి వాటంతటవే కరిగిపోతాయి అని వదిలేయడం మంచిది కాదు. ఎందుకంటే గది ఉష్ణోగ్రత వద్దకు చేరేసరికి ఆయా పదార్థాల్లోని బ్యాక్టీరియా రెండింతలవుతుంది. కాబట్టి కౌంటర్ టాప్స్‌పై పెట్టి ఘనీభవించిన పదార్థాల్ని అస్సలు కరిగించ కూడదు. నీటిలో/ మైక్రోవేవ్ ఒవెన్‌లో పెట్టి కరిగించడం సురక్షితం. సూప్స్, ఇతర కూరల్ని 'కాయగూరలు లేదా ఇతర మాంసాహారం కలిపి తయారు చేసినా మూడు నాలుగు రోజుల వరకు ఫ్రిజ్‌లో నిల్వ చేయచ్చు. మిగిలి పోయిన ఆహార పదార్థాలు (మాంసం, పౌల్ట్రీ, చికెన్ నగెట్స్/ ప్యాటీస్, పిజ్జా.. వంటివి ఫ్రిజ్‌లో మూడు నాలుగు రోజులు ఉంచచ్చు. అలాగని అన్ని పదార్థాల ను రోజుల తరబడి ఫ్రీజర్లో పెట్టి ఎప్పుడో వినియో గించడం కరక్ట్ కాదు. అయితే సాధ్యమైనంత వరకు మనం తీసుకునే ఆహార పదార్థాల్ని తాజాగా, పరిశుభ్రంగా, అప్పటికప్పుడు వండుకొని, వేడివేడిగా తీసుకోవడమే మంచిదని చెబుతున్నారు నిపుణులు. కాబట్టి వీలైనంతవరకు మిగిలిపోయిన అన్ని పదార్థాలనీ ఫ్రిజ్‌లో తోసేయకుండా జాగ్రత్త పడడం మంచిది. □

**చెలి**

సామాజిక పరిణామ క్రమంలో మహిళల పాత్ర ఎంతో అనిర్వచనీయమైనది. దానికి అందం చేకూర్చాలంటే స్త్రీ పాత్ర ఉండాల్సిందే! అందుకే మీ రచనలు పరిచయం చేయాలని 'వార్త' సంకల్పించింది. మహిళ సంబంధిత అంశాలపై వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం. మీరు అనుసరించే జాగ్రత్తలు పాటించే చిట్కాలు, ఇతర ఏ అంశాలైనా మీ పేరుతో ప్రచురిస్తాం. ఈ మెయిల్: Cheli@vaartha.com

# 'ఆత్మకథ' టైటిల్ ట్రైలర్ లాంచ్



దర్శకత్వంలో రానున్న చిత్రం ఆత్మ కథ యాన్ అన్ టోల్డ్ స్టోరీ. సినీ ప్రముఖులు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చేతుల మీదగా ఈ చిత్ర టైటిల్, అలాగే ట్రైలర్ లాంచ్ చేయడం జరిగింది. జెమిని సురేష్ హీరోగా రూప హీరోయిన్‌గా చేయగా 30 ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వి, సమ్మెట గాంధీ, షకలక శంకర్, తాగుబోతు రమేష్, ధనరాజ్, నాగ మహేష్, బలగం విజయ లక్ష్మి, శ్రీనివాస్ నాయుడు తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ సందర్భంగా దర్శకుడు శ్రీనివాస్ గుండ్రెడ్డి మాట్లాడుతూ... 'నేను ఇతర భాషలలో కూడా సినిమాలు చేశాను. ప్రతి సినిమాకు నా వెనుక ఉండి నన్ను సపోర్ట్ చేస్తూ వచ్చిన వ్యక్తి మా అన్నయ్య ప్రసన్న. చెప్పిన బడ్జెట్‌లో ఒక సినిమా చేశాను అంటే దానికి ఎంతో మంది సహకారం ఉండటం వల్లనే. అలాగే చిత్ర పోస్ట్ ప్రొడక్షన్ సమయంలో నాకు ఎంతో సహాయం చేసిన వ్యక్తి రామకృష్ణ అన్నయ్య. ఈ చిత్ర నిర్మాత మా ఇంటి ఓనర్, ఆయన కుమారుడే ఈ సినిమాకు సంగీతాన్ని అందించారు. తెలుగు చిత్ర నిర్మాతల మండలి సెక్రటరీ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ...'వారాహి ఎంటర్టైన్మెంట్స్ వస్తున్న ఆత్మకథ చిత్రం ఒక సామాన్యుడిది. దర్శకుడు శ్రీనివాస్ తమ పిల్లలు కూడా ఇదే ఇండస్ట్రీలో ఉండటంతో వారి సహాయంతో నిర్మాతకు బడ్జెట్ పెరగకుండా ఈ సినిమాకు ఎంతో బడ్జెట్ తగ్గించి వేడి చేశారు. నటుడు కెవి ప్రదీప్ గారు మాట్లాడుతూ... ఈ కార్యక్రమంలో పాల్గొనడం, అందరిని కలవడం చాలా సంతోషం.నటుడు సమ్మెట గాంధీ మాట్లాడుతూ... ఈ కార్యక్రమానికి వచ్చిన దర్శకులు నాకు కథ చెప్పినప్పుడు ఆ కథలో ఆత్మ నేను అని చెప్పినప్పుడు సినిమాలో నేను కనిపిస్తానా అనుకున్న కాని సినిమా అంతా నా చుట్టూ తిరుగుతుంది అని సంతోషించాను.


**తెర**

# చిరుబాబీ 2 /చిరు 158, షూటింగ్ ప్రారంభం



మెగాస్టార్ చిరంజీవి, సక్సెస్ ఫుల్ డైరెక్టర్ బాబీ కొల్లి క్రేజీ కాంబినేషన్ లో వచ్చిన వాల్తేర్ వీరయ్య సంచలనాత్మక మాస్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇప్పుడు ఈ ద్వయం మరో భారీ ప్రాజెక్ట్ చిరుబాబీ2 / చిరు158తో అలరించబోతు న్నారు. ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మాత వెంకట్ కె నారాయణ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. కన్నడ, తమిళ, హిందీ భాషల్లో పలు భారీ ప్రాజెక్టులను అందించిన తర్వాత, కేవీఎన్ ప్రొడక్షన్స్ వారి తొలి తెలుగు చిత్రం ఇది. ఇప్పటికే వరుస అప్డేట్స్‌తో భారీ అంచనాలు సృష్టించిన ఈ చిత్రం నేడు ఘనంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, నాగబాబు ముఖ్య అతిథులుగా విచ్చేసి ఈ కార్యక్రమం మరింత వైభవంగా మారింది. ఈ మెగా త్రయం వేదికను పంచుకోవడం అభిమానులకు కనులవిందు చేసింది. పవన్ కళ్యాణ్ క్లాప్‌బోర్డ్ కొట్టగా, సుష్మిత కొణిదెల కెమెరా స్విచ్ ఆన్ చేశారు. వి.వి. వినాయక్ ఫస్ట్ షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. బి. గోపాల్, కోదండరామి రెడ్డి, నాగబాబు చిత్ర బృందానికి స్క్రిప్ట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖ దర్శకులు, నిర్మాతలు హాజరయ్యారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ నుంచి లోహిత్ తన బృందంతో కలిసి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# 'డేవిడ్ రెడ్డి' మూవీ టీజర్ రిలీజ్



ఈ దసరాకు గ్రాండ్ పాన్ ఇండియా రిలీజ్ కు వస్తున్న మూవీ 'రా కింగ్' మంచు మనోజ్ నటిస్తున్న కొత్త సినిమా 'డేవిడ్ రెడ్డి'. ఈ సినిమాను వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్, ట్రూ రాడిక్స్ బ్యానర్స్ పై నల్లగంగుల వెంకట్ రెడ్డి, భరత్ మోటుకూరి నిర్మిస్తున్నారు. డైరెక్టర్ హనుమా రెడ్డి యక్కంటి రూపొందిస్తున్నారు. బ్రిటీష్ కాలం నాటి బ్యాక్ డ్రాప్‌తో ఇంటెన్స్ యాక్షన్ డ్రామా కథతో భారీ పాన్ ఇండియా చిత్రంగా 'డేవిడ్ రెడ్డి' సినిమా తెరకెక్కుతోంది. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడలో రూపొందుతున్న ఈ చిత్రం ఈ దసరా పండుగ సంద ర్భంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు 'రా కింగ్' మంచు మనోజ్ పుట్టినరోజు సందర్భంగా డేవిడ్ రెడ్డి సినిమా టీజర్ రిలీజ్ చేశారు. ఈ టీజర్ ఎలా ఉందో చూస్తే 1897 నుంచి 1920 మధ్య బ్రిటీష్ పాలనా కాలం నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ సినిమాలోని ప్రతి విజువల్, ప్రతి షాట్, నటీనటుల ఎంపిక ఇలా...అన్ని విషయాల్లో హై క్వాలిటీ మేకింగ్ వ్యాల్యూస్ కనిపిస్తున్నాయి. మహాత్ముడి అహింసా మార్గానికి భిన్నంగా హింసా మార్గాన్ని ఎంచుకుంటాడు డేవిడ్ రెడ్డి. అమాయక భారతీయుల్ని హింసిస్తున్న ఆంగ్లేయులపై ప్రతి దాడులు చేస్తూ వారికి దడ పుట్టిస్తాడు. దేశంలో నెహ్రూ, బోస్ వంటి అగ్ర నాయకులు డేవిడ్ రెడ్డి గురించి తెలుసుకుంటూ ఉంటారు. మరోవైపు డేవిడ్‌రెడ్డి రూపంలో తమ సామ్రా జ్యానికి పొంచి ఉన్న ప్రమాదం గురించి లండన్ లోని బ్రిటీష్ ఇంటెలిజెన్స్ వార్ రూమ్‌లో చర్చలు జరుగుతుంటాయి. 50 బెటాలియన్లలోని 2 వేల మందిని ఒంటరిగా ఎదుర్కొన్న డేవిడ్ రెడ్డి సాహసం, దేశాన్ని మోసం చేసేందుకు సిద్ధంగా ఉన్న అతని వ్యక్తిత్వం బ్రిటీషర్స్‌ను ఆకర్షిస్తుంది. డేవిడ్‌రెడ్డిని తమ కోసం పనిచేసేలా ఒప్పించాలని బ్రిటీషర్స్ ప్లాన్ చేస్తారు.

# 'ఐ యామ్ గేమ్' ఆగస్టు 20న వరల్డ్ వైడ్ రిలీజ్

దుల్కర్ సల్మాన్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'ఐ యామ్ గేమ్' రిలీజ్ డేట్‌ను మేకర్స్ అధికారి కంగా ప్రకటించారు. దుల్కర్ సల్మాన్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 2026 ఆగస్టు 20న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్ల లో విడుదల కానుంది. ప్రస్తుతం డబ్బింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతు న్నాయి. దుల్కర్ సల్మాన్‌కు చెందిన వే ఫారర్ ఫిల్మ్స్ బ్యానర్‌పై ఈ చిత్రం నిర్మిస్తున్నారు. దక్షిణ భారతదేశంలోని 100కు పైగా లొకేషన్ల లో చిత్రీకరించిన ఈ సినిమాకు నహాస్ హిదాయత్ దర్శకత్వం వహిస్తున్నారు. వే ఫారర్ ఫిల్మ్స్ బ్యానర్‌పై దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ సంయుక్తంగా నిర్మిస్తుండగా, షహబాస్ రషీద్, ఆదర్శ్ సుకుమారన్ కథా రచన అందించారు. మలయాళ సినీ చరిత్రలోనే అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కుతున్న చిత్రాల్లో ఒకటిగా ఐ యామ్ గేమ్ నిలవనుంది. ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్ అల్ట్రా స్టైలిష్, మాస్ అవతార్‌లో కనిపించనున్నారు. తన కెరీర్‌లో ఇదే అత్యంత స్టైలిష్ మూవీ అని దుల్కర్ ఇప్పటికే వెల్లడించారు. 'లోకా' బ్లాక్‌బస్టర్ తర్వాత వే ఫారర్ ఫిల్మ్స్ నుంచి వస్తున్న తదుపరి భారీ ప్రాజెక్ట్ ఇదే. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్,



సెకండ్ లుక్ పోస్టర్లు సోషల్ మీడియాలో అద్భుత మైన స్పందన తెచ్చుకున్నాయి. ఇదే దుల్కర్ సల్మాన్ కెరీర్‌లో 40వ చిత్రం కావడం విశేషం.

# బి.ఎ. రాజు 5వ వర్ధంతి నివాళి



చిత్ర పరిశ్రమతో పాటు అభిమానులు సైతం బీఏ రాజు స్ఫూర్తివంతమైన ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటున్నారు. మే 21న ఆయన అయిదవ వర్ధంతి సందర్భంగా తెలుగు చలనచిత్ర పరిశ్రమపై ఆయన వేసిన చెరగని ముద్రను గుర్తు చేసుకుందాం. నలభై ఏళ్లకు పైగా సాగిన కెరీర్‌తో బీఏ రాజు గారు ఒక గొప్ప మార్గదర్శకుడిగా నిలిచారు. ఫిల్మ్ జర్నలిస్ట్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్, మ్యాగజైన్, వెబ్‌సైట్ హెడ్, నిర్మాతగా ఆయన ఎనలేని సేవలు అందించారు. లెజెండరీ సూపర్ స్టార్ కృష్ణ కి పీఆర్‌ఓగా తన ప్రయాణాన్ని మొదలుపెట్టి, అద్భుతంగా పబ్లిసిటీ బాధ్యతలు నిర్వహించారు. ఆ తర్వాత ప్రముఖ ఫిల్మ్ జర్నలిస్ట్‌గా ఎదిగి, సూపర్ హిట్ వీక్లీ, క్రేజీ వరల్డ్ వంటి పత్రికలకు సంపాదకుడిగా పనిచేశారు. సినిమా పట్ల ఆయనకున్న అంకితభావం, అభిరుచి ప్రతి దశలోనూ కనిపించాయి. జర్నలిజానికే పరిమితం కాకుండా సూపర్ హిట్ ఫ్రెండ్స్, ఆ తర్వాత ఆర్జే సినిమాస్ బ్యానర్ల పై నిర్మాతగా మారారు. ప్రేమలో పవని కళ్యాణ్, చంటిగాడు, లవ్లీ, వైశాఖం వంటి గుర్తుండిపోయే చిత్రాలను అందించారు. తన సతీమణి, దివంగత బి.జయతో కలిసి నిర్మించిన చిత్రాలు ప్రేక్షకుల హృదయాలకు చేరువయ్యాయి. కథ చెప్పడంలో, సినిమా నిర్మాణంలో ఆయనకున్న నైపుణ్యం వాటిలో స్పష్టంగా కనిపిస్తుంది.తన కెరీర్‌లో ఎందరో ప్రముఖులతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకున్నారు. దర్శకులు, నటులు, టెక్నీషియన్లకు విలువైన సలహాలు, మద్దతు ఇచ్చారు. ఆయన వృత్తి నిబద్ధత, నిజాయితీ ఆయనకు అందరి గౌరవాన్ని సంపాదించిపెట్టాయి. సినిమాపై ఆయనకున్న విస్తృతమైన జ్ఞానం, అంకితభావం స్ఫూర్తిని ఇస్తాయి.

# జులై 3న 'నాగబంధం' విడుదల



జూలై 3న 'నాగబంధం' విడుదల విరాట్ కర్ణా, అభిషేక్ నామా, నిక్ స్టూడియోస్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'నాగబంధం' నార్త్ ఇండియాలో జూలై 3నజీ స్టూడియోస్ ద్వారా గ్రాండ్ రిలీజ్ అభిషేక్ నామాదర్శకత్వంలో, విరాట్ కర్ణా నటించిన 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' చిత్రం జూలై 3న థియేటర్లలో ఘనంగా విడుదల కాబోతున్న నేపథ్యంలో అంచనాలు భారీగా పెరుగుతున్నాయి. ప్రతీ అప్‌డేట్‌తో ఈ చిత్రంపై బజ్ నెక్స్ట్ లెవల్ కి చేరుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్, గ్లింప్స్, సాంగ్స్ సినిమాపై మ్యాసీవ్ బజ్ క్రియేట్ చేశాయి. తాజాగా మేకర్స్ మరో క్రేజీ అప్డేట్ ఇచ్చారు. నార్త్ ఇండియాలో అన్ని భాషల థియేట్రికల్ రిలీజ్ పార్ట్నర్‌గా ప్రముఖ నిర్మాణ సంస్థ జీ స్టూడియోస్ చేతులు కలిపింది. ఎపిక్ అడ్వెంచర్‌గా తెరకెక్కుతున్న 'నాగబంధం'ను నార్త్ ఇండియాలో అన్ని భాషల్లో జీ స్టూడియోస్ గ్రాండ్‌గా విడుదల చేయ నుంది.ఈ సినిమాలో నభానటేష్, ఐశ్వర్యా మీనన్, రిషబ్ సాహ్నీ, జగపతిబాబు, గరుడ రామ్, మహేష్ మాంజ్రేకర్, జయప్రకాశ్, మురళీ శర్మ, బి.ఎస్. అవినాష్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఎన్ఐకే స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్ నిర్మాణంలో వస్తున్న 'నాగబంధం' పౌరాణికం, చరిత్ర, యాక్షన్ అంశాల కలయికగా రూపొందుతోంది.



# ఉప్పల్‌లో స్టార్ జట్ల ఉత్కంఠ పోరు

## ఆర్సీబీతో నేడు మ్యాచ్ * టాప్-2లో స్థానంపై సన్‌రైజర్స్ ఫోకస్

**హైదరాబాద్, మే 21(ప్రభాతవార్త క్రీడా ప్రతినిధి)**

ఉప్పల్ స్టేడియం వేదికగా నేడు మరో ఇంట్రెస్టింగ్ మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే ప్లేఆఫ్‌కు చేరుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్.. టాప్-2లో ప్లేస్ కోసం బెంగళూరుతో తలపడనుంది. సొంత గడ్డ, సొంత అభిమానుల అండగా బరిలోకి దిగుతున్న సన్‌రైజర్స్ ఈ మ్యాచ్‌లో గెలుపొందడంపై ఫోకస్ పెట్టింది. ఇక 18పాయింట్లతోఉన్న ఆర్సీబీ ..ఈ మ్యాచ్‌లో నెగ్గితే టాప్ ప్లేస్ పటిష్టమవుతుంది. ఓడినా టాప్ టూలో వారి స్థానం దాదాపుగా ఖాయమైంది. ఎటొచ్చి సన్‌రైజర్స్‌కే ఈ మ్యాచ్ అత్యంత కీలకంగా మారింది. ఇక కోహ్లీ మానియాతో ఇప్పటికే ఉప్పల్ మ్యాచ్ టికెట్లన్నీ హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి.

ఈ సీజన్‌లో సొంతగడ్డ ఉప్పల్ స్టేడియంలో ఆరెంజ్ టీమ్‌కు చక్కని రికార్డు ఉంది.ముఖ్యంగా రాత్రి మ్యాచ్‌లలో జరిగిన అన్ని మ్యాచ్‌ల్లోనూ ఎస్ఆర్‌హెచ్ గెలుపొందింది. ఓవరాల్‌గా హైదరాబాద్‌లో ఆడిన ఆరు మ్యాచ్‌లలో నాలుగింటిలో విజయం సాధించగా,ఆ రెండు ఓటములు పగటి మ్యాచ్‌లలోనే ఎదురయ్యాయి. ఆర్సీబీతో జరిగే పోరులో కూడా ఈ రికార్డును అలాగే కొనసాగించాలని కోరుకుంటోంది.ఈ రెండుజట్లు మార్చి 28న తలపడినపుడు ఆర్సీబీ గెలుపొందింది. అప్పటికి ఇప్పటికీ ఎస్ఆర్‌హెచ్ మరింత పటిష్టంగా మారింది. కమిన్స్ రావడంతో బౌలింగ్ పటిష్టమైంది. సాకిబ్, హింగే, మలింగ, శివాంగ్ లు... ప్రత్యర్థి జట్లను చక్కగా కట్టడి చేస్తున్నారు.ఇక బ్యాటింగ్‌లో ఎదురేలేకుండా ఉంది. టాప్ ఆర్డర్ మొత్తం టాప్ ఫామ్‌లో ఉంది. అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్, నితీష్ కుమార్ సొంతగడ్డపై మరోసారి చెలరేగడానికి సిద్ధమయ్యారు.

ఆర్సీబీ కూడా ఇటు బ్యాటింగ్, అటు బౌలింగ్‌లో పటిష్టంగా ఉంది. ఎస్ఆర్‌హెచ్ లాగే ఆర్సీబీ టాప్ ఆర్డర్ కూడా పరుగుల వేటలో ఉంది. గత మ్యాచ్‌లో హాఫ్ సెంచరీతో మెరిసిన వెంకటేష్ అయ్యర్‌తో పాటు కోహ్లీ, దేవదత్, టిమ్ డేవిడ్ చక్కని ఫామ్‌లో ఉన్నారు. ఛేజింగ్ కింగ్ కోహ్లీ టాప్ ఫామ్‌లో ఉండడం ఆర్సీబీకి కలిసొచ్చే అంశం. గాయంతో గత మ్యాచ్‌కు దూరమైన కెప్టెన్ రజత్ పాటిదార్.. ఈ మ్యాచ్‌లో ఆడనుండడం బ్యాటింగ్‌కు మరింత బలం.ఇక భువనేశ్వర్ కొత్త బంతితో ఆరంభంలోనే వికెట్లు అందిస్తున్నాడు. అదే కొనసాగితే ఎస్ఆర్‌హెచ్‌కు కష్టాలు తప్పవు. హేజిల్ వుడ్, కృనాల్, రసిఖ్, డఫీలతో ఆర్సీబీ బౌలింగ్ వైవిధ్యంగా ఉంది. ఎస్ఆర్‌హెచ్ టాప్ ఆర్డర్‌ను ఎంత త్వరగా పెవిలియన్‌కు చేర్చడంపైనే ఆర్సీబీకి విజయావకాశాలు ఉంటాయి.

### హెడ్ టు హెడ్ రికార్డు

ఆర్సీబీపై సన్‌రైజర్స్ బెటర్ రికార్డు కలిగి ఉంది. ఇరు జట్లు 27 మ్యాచ్‌ల్లో ముఖాముఖిగా తలపడగా.. సన్‌రైజర్స్ 14 మ్యాచ్‌ల్లో, ఆర్సీబీ 12 మ్యాచ్‌ల్లో గెలుపొందాయి.

**సన్‌రైజర్స్ హైదరాబాద్ (అంచనా):** అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్, సలీల్ అరోరా, స్మరణ్, నితీష్ కుమార్ రెడ్డి, ప్యాట్ కమిన్స్ (కెప్టెన్), శివాంగ్ కుమార్, ఈషాన్ మలింగ, సాకిబ్ హుస్సేన్; **ఇంఫాక్ట్ ప్లేయర్:** ప్రఫుల్ హింగే

**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (అంచనా):** వెంకటేష్ అయ్యర్, విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్,రజత్ పాటిదార్ (కెప్టెన్), టిమ్ డేవిడ్, జితేష్ శర్మ, రొమారియో షెపర్డ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, రసిఖ్ సలామ్, జోష్ హేజిల్‌వుడ్; **ఇంఫాక్ట్ ప్లేయర్:** జాకబ్ డఫీ

# వ్యవస్థపై రగిలిన జ్వాల

## బ్యాడ్మింటన్‌లో బ్యాకప్ జీరో




**హైదరాబాద్, మే 21(వార్త క్రీడా ప్రతినిధి)**

**గుత్తా జ్వాల...** భారత బ్యాడ్మింటన్‌లో ఫైర్‌బ్రాండ్. ప్రముఖ మాజీ డబుల్స్ స్టార్ గుత్తా జ్వాల తాజాగా భారత బ్యాడ్మింటన్ వ్యవస్థపై ఓ రేంజ్‌లో విరుచుకుపడ్డారు. ఏకస్వామ్యం, పక్షపాతం, ఆటగాళ్ల అభివృద్ధిలో దీర్ఘకాలిక దృష్టి లోపించిందని ఆరోపించారు. బ్యాడ్మింటన్ అభివృద్ధి కోసం తాను చేసిన సేవలకు గుర్తింపు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన అకాడమీ ద్వారా క్షేత్రస్థాయిలో సేవలందించేందుకు ముందుకు వచ్చినా బ్యాడ్మింటన్ సమాఖ్య పట్టించుకోవడం లేదని వాపోయారు. ఒకే ఒక వ్యక్తి అన్ని నిర్ణయిస్తున్నాడని ఫైర్ అయింది.

### రిటైర్మెంట్ తర్వాత సొంత అకాడమీ

బ్యాడ్మింటన్‌కు గుర్తింపు తెచ్చిన ప్లేయర్లలో గుత్తా జ్వాల ఒకరు. ఆమె స్ఫూర్తితో ఎందరో బాలికలు బ్యాడింటన్‌లోకి దూసుకెళ్లారు. 2011 ప్రపంచ ఛాంపియన్ షిప్ బ్రాంజ్ మెడలిస్ట్ అయిన గుత్తా జ్వాలా... అంతర్జాతీయ స్థాయిలో పలు విజయాలు అందుకుంది. కామన్ వెల్త్ గేమ్స్‌లో ఓ స్వర్ణంతో సహా రెండు స్వర్ణాలు, ఓకాంస్యం... భారత్‌కు అందించింది. అలాగే ఉబర్ కప్‌లో రెండుసార్లు కాంస్యం సాధించిపెట్టింది. డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో టాప్ ప్లేయర్‌గా వెలుగొందింది.

బ్యాడింటన్ గేమ్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత మేటి ప్లేయర్లను దేశానికి అందించాలనే సంకల్పంతో 2020లో హైదరాబాద్ శివార్లలోని మెయినాబాద్‌లో అత్యంత అధునాతన బ్యాడ్మింటన్ అకాడమీని నెలకొల్పింది. విశాలమైన 50వేల చదరపు అడుగు విస్తీర్ణంలో 14 కోర్టులు ఉన్నాయి. దేశం లోని అతిపెద్ద అకాడమీల్లో ఒకటిగా జ్వాలా అకాడమీ నిలిచింది. అత్యున్నత శిక్షణను అందిస్తున్నది.

### అండర్-13, 15 క్యాంపులైనా సరే

తాను అకాడమీని గత ఆరేళ్లుగా స్వయంగా, సొంత ఖర్చులతో నడుపుతున్నా ఎటువంటి మద్దలు లభించడం లేదని జ్వాల వాపోయింది. అండర్- 19, సీనియర్ క్యాంపులు కేటాయించమని అడగడం లేదని, కనీసం అండర్-13, అండర్-15 క్యాంపులైనా కేటాయించాలని పలుసార్లు విజ్ఞప్తి చేసినా బ్యాడ్మింటన్ సమాఖ్య అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇక్కడి మౌలిక వసతులను ఉపయోగించుకుని పిల్లలు బాగా ఆడి దేశానికి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. తాను ముక్కుసూటిగా మాడతానని, దీంతో తన అకాడమీలో శిక్షణ పొందిన ప్రతి ఒక్కరూ తిరుగుబాటుదారులుగా తయారవుతారని ముద్ర వేస్తున్నారని జ్వాల విమర్శించారు.

### బ్యాడ్మింటన్ వ్యవస్థ అంతా అస్తవ్యస్తం

ఈ వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తంగా ఉందని గుత్తా జ్వాలా అన్నారు. ఇక్కడ పూర్తిగా గుత్తాధిపత్యం నడుస్తోందని విమర్శించారు. వ్యవస్థలోని నిర్మాణాత్మక సమస్యల గురించి బహిరంగంగా ఎందుకు మాట్లాడలేకపోతున్నారని ప్రశ్నించారు. పత్రి ఒక్కరూ సర్దుకుపోతున్నారు,రాజీ పడుతున్నారు. అసోసియేషన్లు కూడా అలాగే ఉన్నాయి అన్నారు. ప్రత్యామ్నాయ ఆటగాళ్లను అందించడంలో భారత్ విఫలమవుతోందన్నారు. చైనాలో దీనికి భిన్నంగా పరిస్థితి ఉందని, అందువల్లే అక్కడ ఒకరి వెనక ఒకరు ప్రపంచ ఛాంపియన్లు పుట్టుకువస్తున్నారని గుత్తా జ్వాల తెలిపారు.

థామస్ కప్ బ్రాంజ్ మెడల్ నెగ్గినా తమకు సరైన గుర్తింపు లేదని ఇటీవలే భారత బ్యాడ్మింటన్ ఆటగాళ్లు వాపోయారు. తాజాగా గుత్తా జ్వాలా విమర్శలు బ్యాడ్మింటన్ వర్గాల్లో కాక రేపుతున్నాయి.

# చెన్నైపై గుజరాత్ టైటాన్స్ విక్టరీ

**అహ్మదాబాద్:** ఐపీఎల్ లీగ్ స్టేజ్‌ను గుజరాత్ టైటాన్స్ ఘనంగా ముగించింది. ఆరంభంలో తడబడ్డా ఆ తర్వాత వరుస విజయాలతో ప్లే ఆఫ్ లోకి దూసుకొచ్చిన గిల్ సేన... చివరి మ్యాచ్‌లోనూ అదరగొట్టింది. చెన్నై సూపర్ కింగ్స్‌పై 89 పరుగుల భారీ విజయాన్ని అందుకుంది. మొదట బ్యాటింగ్‌లో అదరగొట్టి 20 ఓవర్లలో 4 వికెట్లకు 229 పరుగులు చేసిన గుజరాత్ టైటాన్స్.. ఆ పై బౌలింగ్‌లోనూ బెంబేలెత్తించి చెన్నైను 13.4ఓవర్లలోనే 140పరుగులకు కుప్పకూల్చింది.హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ సిరాజ్ గుజరాత్ టాప్ ఆర్డర్ పనిపట్టాడు. ఇన్నింగ్స్ తొలి బంతికే సంజూ శాంసన్‌ను డకౌట్‌గా పెవిలియన్ చేర్చాడు. అదే ఊపులో తరువాతి ఓవర్లో ఏకంగా రెండు వికెట్లు తీశాడు. రుతురాజ్(16)ను క్లీన్ బౌల్డ్ చేసిన సిరాజ్.. ఉర్విల్ పటేల్‌ను డకౌట్‌గా వెనక్కి పంపాడు. మరో ఎండ్‌లో మాథ్యూ షార్ట్(24)ను రబడా అవుట్ చేశాడు. కార్తీక్ శర్మ.. గిల్ అద్భుత త్రో తో రనౌట్ అవడంతో 63 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయింది. మధ్యలో శివమ్ దూబే(17 బంతుల్లో 47) మెరుపులు మెరిపించినా.. రషీద్ ఖాన్, రబడా చివరి వరుస బ్యాట్స్‌మెన్ పనిపట్టారు. దీంతో చెన్నై 140 పరుగులకే ఆలౌటైంది. గుజరాత్ బౌలర్లలో సిరాజ్, రబడ, రషీద్ ఖాన్ తలా మూడేసి వికెట్లు తీశారు. ఈ విజయంతో పాయింట్లతో పాయింట్ల పట్టికలో రెండోస్థానంలో నిలిచింది. నెట్ రన్‌రేట్‌ను భారీగా పెంచుకుంది.




## గిల్, సుదర్శన్, బట్లర్ హాఫ్ సెంచరీల షో

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 229 పరుగుల భారీ స్కోరు సాధించింది. గుజరాత్ ఓపెనర్లు శుబ్‌మన్ గిల్(37 బంతుల్లో 64; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), సాయి సుదర్శన్(53 బంతుల్లో 84; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు).. చెన్నై బౌలర్లను ఊచకోత కోశారు. ముఖ్యంగా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో చెలరేగిపోయాడు. గ్రౌండ్ నలుమూలలా క్లాసిక్ షాట్లతో బౌండరీల వర్షం కురిపించాడు. తొలి వికెట్‌కు 125 రన్స్ జోడించాడు. హాఫ్ సెంచరీ తర్వాత మరింత వేగంగా ఆడే క్రమంలో గిల్ అవుట్ అయ్యాడు.మరో ఎండ్ లో ఉన్న సాయి సుదర్శన్ 35 బంతుల్లో అర్ధసెంచరీ తర్వాత మరింత జోరు చూపాడు.క్రీజ్‌లోకి వచ్చిన జోస్ బట్లర్(27బంతుల్లో 57; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) కూడా విధ్వంసకర బ్యాటింగ్‌తో సిక్సర్ల వర్షం కురిపించాడు. సీఎస్‌కే బౌలర్లకు ఎలాంటి ఛాన్స్ ఇవ్వకుండా ఊచకోత కోస్తూ మెరుపు హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. రెండో వికెట్‌కు వీరిద్దరూ 82 పరుగులు వేగంగా జోడించి 200 మార్కు దాటించారు.సుదర్శన్ అవుట్ తర్వాత గుజరాత్ వేగంగా రెండు వికెట్లు కోల్పోయింది. తెవాటియా డకౌట్ కాగా, సుందర్ 7 పరుగులు చేశాడు. ఇక చివరి ఓవర్లో గుజరాత్ బ్యాటర్లు 13 పరుగులు రాబట్టడంతో స్కోరు 229కి చేరింది. సీఎస్‌కే బౌలర్లలో కాంబోజ్, జాన్సన్, ముకేష్ చౌదరీ తలా ఓ వికెట్‌పడగొట్టారు.

# ఆసియా కుబేరుల్లో అంబానీ, అదానీలే టాప్

**ముంబయి, మే 21:** అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి విలువ క్షీణిస్తున్నప్పటికీ భారత బిలియనీర్లు రికార్డులు సృష్టిస్తున్నారు. ఫోర్బ్స్ ప్రపంచ బిలియనీర్ల జాబితా2026 ప్రకారం భారత్ నుంచి రికార్డు స్థాయిలో 229 మంది ఈ లిస్ట్‌లో చోటు దక్కించుకున్నారు. వీరి మొత్తం ఆస్తి విలువ లక్ష కోట్ల డాలర్ల మార్కును దాటింది. ఈసారి రికార్డు స్థాయిలో 30 మంది కొత్త సంపన్నులు జాబితాలోకి ఎంట్రీ ఇచ్చారు. తొలి 2 స్థానాల్లో అంబానీ, అదానీ భారత్‌లోనే కాకుండా ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా ముకేశ్ అంబానీ తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. 99.7 బిలియన్ డాలర్ల సంపదతో ఆయన దేశంలోనే మొదటి స్థానంలో ఉండగా మౌలిక సదుపాయాల రంగ దిగ్గజం గౌతమ్ అదానీ 63.8 బిలియన్ డాలర్ల ఆస్తితో రెండో స్థానంలో నిలిచారు. దేశవ్యాప్తంగా ఏఐ మౌలిక సదుపాయాలను నిర్మించేందుకు ఈ రెండు గ్రూపులు కలిపి ఏకంగా 210 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడులు ప్రకటించాయి.ఓపీ జిందాల్ గ్రూప్ అధినేత్రి సావిత్రి జిందాల్ 39.1 బిలియన్ డాలర్ల సంపదతో దేశంలోనే అత్యంత ధనవంతురాలైన మహిళగా నిలిచారు. ఓవరాల్‌గా ఆమెకు మూడో స్థానం దక్కింది. కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ కోటక్ 14.4 బిలియన్ డాలర్ల ఆస్తితో పదో స్థానంలో నిలిచి ఈ టాప్ గ్రూపులోకి ప్రవేశించారు. యూట్యూబ్ క్లాస్ నుంచి బిలియనీర్స్ క్లబ్‌కు భారతీయ ఎడ్‌టెక్ రంగంలో ఈసారి సరికొత్త సంచలనం నమోదైంది.




ప్రముఖ ఎడ్యుకేషన్ ప్లాట్‌ఫామ్ ఫిజిక్స్ వాలా కోఫౌండర్లు అలఖ్ పాండే, ప్రతీక్ బూబ్ ఈసారి బిలియనీర్ల జాబితాలో స్థానం సంపాదించారు. ఈ ఏడాది ఫోర్బ్స్ జాబితాలో చోటు దక్కించుకున్న అత్యంత పిన్న వయస్కుడైన భారతీయుడిగా అరవింద్ శ్రీనివాస్(31) రికార్డు సృష్టించారు. జెఫ్ బెజోస్ మద్దతుతో నడుస్తున్న పెర్‌ప్లెక్సిటీ ఏఐ సెర్చ్ స్టార్టప్ కోఫౌండర్ అయిన అరవింద్ శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉంటున్నారు. కొన్నేళ్ల విరామం తర్వాత పేటీఎమ్ వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మ మళ్లీ బిలియనీర్ల జాబితాలోకి వచ్చారు. ఓలా క్యాబ్స్ ఫౌండర్ భవీష్ అగర్వాల్‌తో పాటు మరో ఏడుగురు ఈసారి బిలియనీర్ల హోదాను కోల్పోయారు.

టాప్10 జాబితా ముకేశ్ అంబానీ 99.7 బిలియన్ డాలర్లు గౌతమ్ అదానీ 63.8 బిలియన్ డాలర్లు, సావిత్రి జిందాల్ 39.1 బిలియన్ డాలర్లు, లక్ష్మీ మిట్టల్ 31.0 బిలియన్ డాలర్లు, శివ్ నాడార్ 30.9 బిలియన్ డాలర్లు, సైరస్ పూనావాలా 27 బిలియన్ డాలర్లు, దిలీప్ సంఘ్వీ 25.6 బిలియన్ డాలర్లు, కుమార్ బిర్లా 21.1 బిలియన్ డాలర్లు, రాధాకిషన్ దమానీ 15.7 బిలియన్ డాలర్లు, కాగా ఉదయ్ కోటక్ 14.4 బిలియన్ డాలర్లతో వరుసగా టాప్ పది జాబితాలో చోటుసాధించారు.



## యుఎస్‌లో పడగ విప్పిన ద్రవ్యోల్బణం

**న్యూయార్కు, మే 21:** అమెరికాలో ద్రవ్యోల్బణం మరోసారి పడగవిప్పింది. గ్యాసోలిన్, కిరాణా సరుకులు, ఇతర నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్య ప్రజల జీవనం కష్టతరంగా మారింది.గత 12నెలల్లో వినియోగదారుల ధరల సూచీ ఏకంగా 3.8 శాతం పెరిగింది.2023 తర్వాత అత్యధిక వార్షిక పెరుగుదల కావడం గమనార్హం. కేవలం ఏప్రిల్ నెలలోనే ద్రవ్యోల్బణం 0.6 శాతం పెరిగింది. అంతర్జాతీయంగా నెలకొన్న రాజకీయ సంక్షోభాలు, ఇంధన సరఫరాలో అంతరాయాలే ఈ పరిస్థితికి ప్రధాన కారణమని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, ప్రపంచంలోనే కీలకమైన ఇంధన రవాణామార్గం హార్మూజ్ జలసంధి గుండా చమురు సరఫరాలో ఏర్పడిన ఆటంకాల వల్ల ఇంధన ధరలు ఆకాశాన్నంటాయి. అమెరికా కార్మిక గణాంకాల బ్యూరో ప్రకారం గత ఏడాదికాలంలో ఇంధనధరలు 17.9శాతం పెరగ్గా, ఒక్క గ్యాసోలిన్ ధరలే 28.4శాతం పెరిగాయి. దేశవ్యాప్తంగా గ్యాసోలిన్ సగటుధర గ్యాలన్‌కు 4.50డాలర్లు దాటింది.రవాణా ఖర్చులు పెరగడంతో ఆ ప్రభావం దాదాపు అన్ని వస్తువుల ధరలపై పడుతోంది.ట్రక్కుల రవాణావ్యయం పెరిగితే, దానిని సూపర్ మార్కెట్లు, రిటైలర్లు వినియోగదారులపైనే మోపుతున్నారని నిపుణులు చెబుతున్నారు. ఏప్రిల్ నెలలో కిరాణా సరుకుల ధరలు 0.7 శాతం పెరిగాయి.గొడ్డు మాంసం, కాఫీ, పండ్లు,కూరగాయల ధరలు గణనీయంగా పెరిగాయి. ఆహారం, గ్యాస్, బట్టలు, ఇంటిఅద్దె ఇలా ఏది చూసినా పైపైకే పోతోందని గృహిణులు ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఏప్రిల్‌లో ఉద్యోగుల నిజమైన సగటు గంట వేతనాలు 0.5 శాతం తగ్గాయని తెలిపింది. జీతాలు పెరిగినట్లు కనిపిస్తున్నా,కొనుగోలు శక్తి తగ్గిపోతోంది. డబ్బులు దేనికీ సరిపోవడం లేదు.ఈ పరిస్థితుల్లో అనవసర ఖర్చులను తగ్గించుకోవడం, క్రెడిట్‌కార్డుల వాడకం పెంచుకోవడం తప్పడంలేదు.

# పెరిగినట్లే పెరిగి క్షీణించిన ఈక్విటీలు



## నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్,నిఫ్టీ

**ముంబయి, మే 21:** ఈక్విటీ మార్కెట్లలో సూచీలన్నీ పెరిగినట్లే పెరిగి మళ్లీ దిగజారాయి. రెండురోజుల పాటు లాభాల బాటలో నడిచిన సూచీలు గురువారం నష్టాలుచవిచూసాయి. రూపాయి మారకం క్షీణతను కట్టడిచేసేందుకు ఆర్బీఐ జోక్యంచేసుకోవడం, స్థిరీకరణ కార్యాచరణ ప్రకటించడం, అదనపు కరెన్సీ స్వాపింగ్, విదేశీ ఇన్వెస్టర్లనుంచి డాలర్ల సమీకరణ వంటివి కొంతమేర సూచీలను నియంత్రించినా విదేశీ ఇన్వెస్టర్లు అమ్మకాలకు దిగడం, లాభాల స్వీకరణతో మార్కెట్లు ప్రతికూలంగా ముగిసాయి.

ఐటి, ఎఫ్ఎంసిజి కంపెనీలు భారీగా క్షీణించాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 135.03పాయింట్లు క్షీణించి 75,183.36పాయింట్ల వద్ద ట్రేడింగ్ నిలిపివేస్తే నిఫ్టీ 50 సూచీ 4.30 పాయింట్లు క్షీణించి 23,654.70 పాయింట్లవద్ద ట్రేడింగ్ ముగించింది. ఇన్ఫోసిస్ 1.05శాతం, భారతి ఎయిర్‌టెల్ 1.03శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.74శాతం ట్రేడింగ్‌లో పతనం చెందాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్ సూచీ మాత్రం 0.18శాతం పెరిగితే స్మాల్ క్యాప్ సూచీ కూడా 0.70శాతం పెరిగింది. మార్కెట్ల పరంగా బిఎస్ఇలో 2423 షేర్లు పెరిగితే 1748 కంపెనీల షేర్లు క్షీణించాయి. మరో 208 కంపెనీల షేర్లు యధాతథంగా కొనసాగాయి. ఇక డాలరుతోరూపాయి మారకం విలువలు కొంతమేర స్థిరపడ్డాయి. ముందురోజు 96.86తో పోలిస్తే గురువారం 96.23వద్ద స్థిరపడింది.

ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు 0.29శాతం క్షీణించి రూ.1,59,538కి నమోదు కాగా కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు జులై నెల సెటిల్‌మెంట్‌ధరలు 91 సెంట్లు క్షీణించి బ్యారెల్‌కు 104.11 డాలర్లుగా కొనసాగింది. ఐటిసి స్థిరంగా కొనసాగితే జూబిలియన్ ఫుడ్ వర్క్స్ 7.81శాతం క్షీణించింది. అరియన్‌ప్రో సొల్యూషన్స్ 3.87శాతంపెరిగాయి. హనీవెల్ ఆటోమేషన్ 15.85 శాతంపెరిగింది.ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ 3.92శాతంక్షీణించింది.మెట్రోబ్రాండ్స్ 6.25శాతం, సంవర్ధన మదర్సన్ ఇంటర్నేషనల్ 3.65 శాతం పెరిగింది. లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్ 2.39 శాతం, అపోలో హాస్పిటల్స్ 2.85 శాతం, జెఎస్‌డబ్ల్యు సిమెంట్స్ 5.42శాతం ర్యాలీ తీసాయి. ఆసియా షేర్లు దిగువస్థాయిలోనే ముగిస్తే యూరోపియన్ షేర్లు కూడా పిఎంఐల ప్రకటనలతో యుకె, ఫ్రాన్స్‌ల షేర్లు క్షీణించాయి. వాల్‌స్ట్రీట్ ఇన్వెస్టర్లు ప్రపంచ వృద్ధి అంచనాలతోపాటు భౌగోళిక ఉద్రిక్తతలు, పశ్చిమాసియా ప్రభావాలను గమనిస్తూ ట్రేడింగ్‌చేసారు. జపాన్ నిక్కీ 225 సూచీ 3శాతం పెరిగింది. రాత్రికి రాత్రే వాల్‌స్ట్రీట్ షేర్లు పెరిగాయి. డౌజోన్స్ పారిశ్రామిక సగటు 645.47 పాయింట్లు పెరిగితే ఎస్అండ్‌పి 500 1.08 శాతం పెరిగింది. అలాగేనాస్‌డాక్ కాంపోజిట కూడా 1.54శాతం పెరిగింది.

# అల్పాదాయ వర్గాలపై పన్నులు రద్దుచేయాలి: జెఫ్ బెజోస్




**న్యూయార్కు, మే 21:** అమెరికాలో అత్యల్ప ఆదాయం ఉన్న వారిలో సగంమంది ప్రజలకు ఎలాంటి ఆదాయపు పన్ను ఉండకూడదని అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ కొత్త వాదన తెచ్చారు. తక్కువ వేతనాలు పొందుతున్న ఉద్యోగులపై పన్ను విధించడాన్ని తీవ్రంగా విమర్శించారు. దేశంలో చాలా మంది బాగా సంపాదిస్తున్నారు. కానీ, అదే సమయంలో ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారని బెజోస్ అన్నారు. క్వీన్స్‌లో ఏడాదికి 75 వేల డాలర్లు సంపాదించే ఒక నర్సు, నెలకు 1,000 డాలర్లకు పైగా పన్ను ఎందుకు చెల్లించాలని ఆయన ప్రశ్నించారు. ఆ డబ్బు వారి అద్దె, నిత్యావసరాలు లేదా ఇతర అవసరాలకు ఉపయోగపడుతుందన్నారు. మొత్తం పన్ను రాబడిలో ఒకశాతం మంది పన్ను చెల్లింపుదారులు 40 శాతం వాటాను అందిస్తుంటే, దిగువన ఉన్న సగం మంది కేవలం 3శాతం మాత్రమే చెల్లిస్తున్నారు. అది సున్నాగా ఉండాలని బెజోస్ స్పష్టంచేశారు. ప్రభుత్వానికి ఇది చాలా చిన్న మొత్తమే అయినా, ప్రజలకు పెద్ద ఊరటనిస్తుందని ఆయన వివరించారు.ఏడాదికి 50వేలడాలర్లు సంపాదించే అమెజాన్ ఉద్యోగిపై పన్ను విధించడం అసంబద్ధమని ఆయన వ్యాఖ్యానించారు.అమెజాన్‌లో కార్మికుల పరిస్థితిపై తీవ్ర విమర్శలు బెజోస్ పేదల పన్ను భారం గురించి మాట్లాడుతున్నప్పటికీ ఆయన సంస్థ అమెజాన్‌లో కార్మికుల పరిస్థితిపై తీవ్ర విమర్శలు ఉన్నాయి.డెలివరీ డ్రైవర్లకు,యూనియన్ సభ్యులైన యూపీఎస్‌డ్రైవర్లకు మధ్య జీతాల్లో భారీవ్యత్యాసం ఉంది.యూపీఎస్ డ్రైవర్లు గంటకు 35డాలర్లు సంపాదిస్తుంటే,అమెజాన్ డ్రైవర్లు సగటున గంటకు 19డాలర్లు మాత్రమే పొందుతున్నారు. దీని కారణంగా 26 శాతం మంది అమెజాన్ కొరియర్ ఉద్యోగులు ఆకలితో ఇబ్బంది పడుతున్నారని, 33 శాతం మంది కనీస బిల్లులు కూడా చెల్లించలేకపోతున్నారని హార్వర్డ్ యూనివర్సిటీ పరిశోధనలో తేలింది. ప్రస్తుతం కాలిఫోర్నియాలో బిలియనీర్లపై ప్రత్యేక పన్ను విధించాలనే ప్రతిపాదన నేపథ్యంలో బెజోస్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

# లోన్ రికవరీపై ఆర్బీఐ కొత్త మార్గదర్శకాలు




**ముంబయి, మే 21:** రుణాల రికరీకి సంబంధించి బ్యాంకులు,ఎన్‌బీఎఫ్‌సీలకు రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కఠిన నిబంధనలను ప్రతిపాదించింది. లోన్ల రికవరీ పేరుతో కస్టమర్లను వేధించే ఆర్థిక సంస్థలకు అడ్డుకట్ట వేసేందుకు కొత్త ప్రతిపాదనలు చేసింది. ఈ మేరకు కండక్ట్ ఆఫ్ రెగ్యులేటెడ్ ఎంటీటీఎస్ ఇన్ రికవరీ ఆఫ్ లోన్స్ అండ్ ఎంగేజ్‌మెంట్ ఆఫ్ రికవరీ ఏజెంట్స్ పేరిట ముసాయిదా నిబంధనలను ప్రతిపాదించింది.ఈ ప్రతిపాదనలపై మే 31వ తేదీ వరకు వాటాదారులు, ప్రజల అభిప్రాయాలను ఆర్బీఐ సేకరించనుంది. ఆ తర్వాత అక్టోబర్ 1వ తేదీ నుంచి ఈ నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఆర్బీఐ ప్రతిపాదనల్లో కీలక అంశాలు ఉన్నాయి. వ్యక్తిగత, కారు, హోమ్ లోన్లకు సంబంధించి రుణగ్రహీత సకాలంలో తిరిగి చెల్లింపులు చేయనప్పుడు మొబైల్ ఫోన్‌ను లాక్ చేయడం, దాని ఫీచర్లను నిలిపివేయడం వంటివి బ్యాంకులు చేయకూడదని ప్రతిపాదనల్లో పేర్కొంది.కస్టమర్లకు నోటీసులు ఇచ్చినా స్పందించకుంటే అప్పుడు చర్యలు తీసుకోవచ్చుని పేర్కొంది. ఫోన్ బ్లాక్ చేసినప్పటికీ ఇంటర్నెట్, ఇన్‌కమింగ్ కాల్స్, అత్యవసర సేవలు, ప్రభుత్వ ఎమర్జెన్సీ అలర్టులు నిలిపివేయవద్దని పేర్కొంది.

## ఉద్యోగులకిచ్చిన ఐడిలన్నీ డీయాక్టివేట్ చేసిన మెటా




**శాన్‌ఫ్రాన్సిస్కో, మే 21:** టెక్నాలజీ సోషల్‌మీడియా దిగ్గజం ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా సుమారు 8వేల మంది ఉద్యోగులను తొలగిస్తు ప్రకటించడమే కాకుండా వెంటనే మీ సామన్లుతీసుకుని వెళ్లాలని ఆదేశాలు జారీచేసింది. అంతేకాకుండా వారందరినీ అల్యూమినీ పోర్టల్‌కు అనుసంధానించడంతో ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన రేకెత్తింది. అదే సమయంలో 7వేల మందికి పైగా ఉద్యోగులను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రాజెక్టులకు బదిలీ చేసింది. కంపెనీని మరింత సమర్థవంతంగా నడపడానికి, ఏఐ వంటి రంగాలలో చేస్తున్న భారీ పెట్టుబడులను భర్తీ చేయడానికి ఈ తొలగింపులు అవసరమని మెటా తన ప్రకటనలో పేర్కొంది. ఈమెయిల్ అందుకున్న ఉద్యోగుల యాక్సెస్ బ్యాడ్జ్‌లను తక్షణమే డియాక్టివేట్ చేశారు. కంపెనీ అంతర్గత సిస్టమ్స్‌కు వారి యాక్సెస్‌ను కూడా నిలిపివేశారు. గంటలోపే వారిని మెటా అలుమినీ పోర్టల్‌కు అనుసంధానించారు. అక్కడ సెవరెన్స్ ప్యాకేజీ, వీసా, ఆరోగ్య బీమా, ఉద్యోగ సహాయం వంటి వివరాలు పొందుపరిచారు. మెటా ప్రయాణంలో మీ పాత్ర ఎంతో ముఖ్యమైనది అని ఈమెయిల్‌లో పేర్కొనడం గమనార్హం. కంపెనీ నిర్మాణంలో పాలుపంచుకున్న వారికి వీడ్కోలు పలకడం ఎప్పుడూ బాధాకరమే. ఈ నిర్ణయం నాకెంతో భారంగా ఉంది అని సిఇఒ జుకర్‌బెర్గ్ పేర్కొన్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.